www.andhrajyothy.com
పేజీలు: 14
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 211

శనివారం | 16-11-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి రా. 11.51 తదుపరి విదియ; నక్షత్రం: కృత్తిక రా. 7.28 తదుపరి రోహిణి
వర్జ్యం: ఉ. 8.41-10.07; దుర్ముహూర్తం: ఉ. 6.24-7.53; అమృతఘడియలు: సా.5.18-6.44; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 5.35

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీశైలంలో ఘనంగా కార్తీక పౌర్ణమి



శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీశైలంలో పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం

దోచేసి.. దాచేశారు

ఐదేళ్లలో అంతులేని దోపిడీ.. సీఎం ధ్వజం

రాజకీయాల్లో అవినీతిని చూశా..
కానీ, దోపిడీ కోసమే రాజకీయాల్లోకి వచ్చారు

45 ఏళ్ల రాజకీయ అనుభవం నాది.. కానీ, ఒక ఆర్థిక ఉగ్రవాది విధ్వంసం తొలిసారి చూస్తున్నా

కుటుంబానికి ప్రజల సొమ్ముతో విశాఖలో భారీ ప్యాలెస్

సొంత పత్రికకే అడ్డగోలుగా రూ.400 కోట్ల యాడ్స్

రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పైకి నెట్టారు

మోదీ సహకారంతో బయటికి తెచ్చాం: చంద్రబాబు

ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకమే

అప్పులు 9.74 లక్షల కోట్లుపైనే

ఇంకా తవ్వాల్సింది చాలానే ఉంది


జగన్ హయాం అప్పులకు లెక్కల్లేవు

ఒక్కో శాఖ క్లియరెన్స్‌కు 4 నెలలు

బడ్జెట్‌పై చర్చకు మంత్రి కేశవ్ జవాబు

నేను గత ఐదు నెలల్లోనే ఏదో చేశానని చెప్పడంలేదు. కొద్ది కొద్దిగా పారిశ్రామిక వేత్తల్లో నమ్మకాన్ని కల్పిస్తున్నాం. మళ్లీ దుర్మార్గ ప్రభుత్వం వస్తే ఎలాగని వారు జంకుతున్నారు.
అయితే, ఆంధ్రులు విజ్ఞులు అని, ఇక భవిష్యత్తులో ఎప్పటికీ వైసీపీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని.. వారికి నచ్చజెప్పి ఒక్కో కంపెనీని తీసుకొస్తున్నాం.
ధైర్యంగా పెట్టుబడులు పెట్టండి భరోసా మాది.. అని చెబుతున్నాం. నా దగ్గర డబ్బుల్లేవు కానీ నూతన ఆలోచనలు ఉన్నాయి. ఓ మంచి ఆలోచన ప్రపంచాన్నే మారుస్తుంది. అటువంటి ఆలోచనతో ముందుకెళ్లి సంపద సృష్టిద్దాం.

- అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణాన్ని ఆపేసి.. పోలవరం ప్రాజెక్టును వరదకు వదిలేసి.. ప్రభుత్వ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి.. ప్రభుత్వ టెర్రరిజంతో పరిశ్రమల్ని తరిమేసి.. రాష్ట్రాన్ని అడవి పందుల్లా తినేసి.. దోచిన సొమ్మంతా ఆనాడు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించి.. రాష్ట్రాన్ని వెంటిలేటర్ పైకి నెట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క చాన్స్ అనే మాటతో మోసపోయిన జనం.. వైసీపీ దోపిడీ రాజ్యాన్ని భరించలేక ఇటీవలి ఎన్నికల్లో 57% ఓట్లు, 93% సీట్లతో ఎన్డీయేకు పట్టం కట్టారని తెలిపారు. అలాంటి ప్రజల కోసం 100% కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు. ఇంతటి ఆర్థిక దుస్థితిలో కూడా పెట్టిన రూ.2,94,427 కోట్ల బడ్జెట్ అద్భుతంగా

మిగతా 13వ పేజీలో...



శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలతో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి నిర్మాణంలో సింగపూర్ భాగస్వామ్యాన్ని

పునరుద్ధరించండి!

గోదావరి-పెన్నా అనుసంధానానికి సహకరించండి

విదేశీ పెట్టుబడులు ఏపీకి వచ్చేలా చూడండి

రాష్ట్ర జీఎస్టీలో సర్‌చార్జీని ఒక శాతం పెంచండి

కేంద్ర మంత్రులకు చంద్రబాబు వినతులు 13

నిర్మలా సీతారామన్, జైశంకర్‌తో సీఎం భేటీ

అధికారంలోకి రావడానికి అబద్ధాలే ఆలంబన! అధికారంలోకి వచ్చాకా అబద్ధాలు! అధికారం పోయాకా అవే అబద్ధాలు! ఇదీ.. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీరు! చంద్రబాబుకంటే తానే భేషైన పాలకుడినని, తనదే పురోగామి పాలన అని చెప్పుకొనేందుకు జగన్ నానా తంటాలు పడుతున్నారు. ఇందులో భాగంగా అనేక అసత్యాలు, అర్ధసత్యాలతో కూడిన గణాంకాలను తన రోత పత్రిక ద్వారా జనంలోకి వదులుతున్నారు.

అవే అబద్ధాలు

అధికారం పోయినా మారని జగన్ తీరు

అప్పులు, ఉద్యోగాలు, ప్రగతిపై అసత్యాలు

తప్పుడు లెక్కలతో తప్పుదోవ పట్టించే యత్నం

60 ఏళ్ల అప్పులను ఐదేళ్లలోనే చేసిన జగన్

అయినా... తానే గ్రేట్ అంటూ గొప్పలు

ఆయన దిగిపోయేనాటికి 10 లక్షల కోట్ల అప్పులు

పబ్లిక్ డెట్, పెండింగ్ బిల్లులు, కార్పొరేట్ రుణ భారం

6.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లుగా కలరింగ్

వలంటీర్లు, ఆర్టీసీ కార్మికులు, మద్యం దుకాణాల్లో పని చేసేవారూ ఆ లెక్కల్లోకే!

డిస్కమ్‌లను ముంచేసి.. 'మేలు' ముసుగు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ రోత పత్రికలో ఎప్పట్లాగే అప్పులపై అనేక అబద్ధాలు అచ్చేశారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వం గద్దెదిగేనాటికి రాష్ట్ర అప్పులు 3.13 లక్షల కోట్లని... 2024లో తాను దిగిపోయే నాటికి రూ.6.46 లక్షల కోట్లని ఆయనే చెప్పుకొన్నారు. ఈ లెక్కే నిజమైనా.. 3.13 లక్షల కోట్ల రుణ భారం 2014-19 మధ్య కొత్తగా వచ్చింది కాదు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి 2014లో రాష్ట్ర విభజన జరిగాక సీమాంధ్ర వాటాగా వచ్చిన అప్పు, ఆ తర్వాత ఐదేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం చేసిన రుణం అన్నీ కలిపి రూ.3.13 లక్షల కోట్లు అని జగనే ఒప్పుకొన్నారు. అంటే... ఇది ఆరు దశాబ్దాల కాలంలో అయిన అప్పు. దీనిని జగన్ ఐదేళ్లలోనే రెట్టింపు చేసి... 6.46 లక్షల కోట్లకు చేర్చారు. ఇదొక రికార్డు. ఇంకా చెప్పాలంటే ఇది కూడా అర్ధసత్యమే! జగన్ సీఎంగా దిగిపోయేనాటికి రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లకు

మిగతా 14వ పేజీలో...

పరిపూర్ణంగా పోలవరం!

45.72 మీటర్ల ఎత్తు.. 194.6 టీఎంసీలు నిల్వ


నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి

స్టాప్ వర్క్ ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తేయాలని పట్టుబడదాం

ఈసీఆర్ఎఫ్‌పై స్పష్టత కోరండి

2027 మే కల్లా పూర్తికి ప్రణాళికలు

జల వనరుల శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం



అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం సాగునీటి ప్రాజెక్టును పూర్తి స్థాయి సామర్థ్యంతో నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని జల వనరుల శాఖను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రాజెక్టును 45.72 మీటర్ల గరిష్ఠ ఎత్తులో నిర్మించి, 194.60 టీఎంసీల జలాలను నిల్వ చేసి గోదావరి మిగులు జలాలను రాష్ట్రమంతటికీ అందించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. అలాగే 45.72 మీటర్ల కాంటూరులో

మిగతా 3వ పేజీలో...



పాకిస్థాన్ పరువు పాయె!

పీవోకేలో చాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శనకు ఏర్పాట్లు 10

ఆక్షేపించిన భారత క్రికెట్ బోర్డు

వెంటనే స్పందించిన ఐసీసీ

ట్రోఫీ ప్రదర్శన రద్దు



14

ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్

రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్ రంజన్ నియామకం

60 రోజుల్లోపు నివేదిక

ఉపాధి పెండింగ్ బకాయిలకు మోక్షం

రూ.331 కోట్లు చెల్లించేందుకు సర్కారు ఆదేశాలు 2

ఏపీ అభివృద్ధికి

ఐఐటీ-ఎం బాసట

మంత్రి లోకేశ్ సమక్షంలో 8 ఒప్పందాలు

అమరావతికి సాంకేతిక సహకారం

విద్యార్థులకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ

పారిశ్రామిక అవసరాల మేరకు టీచింగ్

ఇంటర్నెట్ గేట్‌వేగా విశాఖ అభివృద్ధి

వివిధ శాఖలతో కలిసి ముందుకు

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి మద్రాస్ ఐఐటీ బాసటగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలకు చేదోడుగా నిలవడానికి ముందుకొచ్చింది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంలోని

మిగతా 14వ పేజీలో...

టీచర్లపై కేసులు ఎత్తివేస్తాం

డీజీపీతో చర్చిస్తున్నాం.. ప్రభుత్వ మార్పునకు టీచర్ల ఉద్యమమే కారణం

వారిని చూసి ప్రజలూ ఉద్యమించారు.. వైసీపీ సర్కారు కేసులతో వేధించింది

టీచర్లు విద్య మాత్రమే చెప్పాలి.. బాత్‌రూమ్ ఫొటోలు వారి పనికాదు

కేసుల్లేకుండా డీఎస్సీ పూర్తిచేస్తాం.. అధికారులు అధ్యయనం చేస్తున్నారు

విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి చేసేస్తాం.. అసెంబ్లీలో లోకేశ్ వెల్లడి



12

ప్రైవేటు స్కూళ్ల ఫీజులు వెబ్‌సైట్‌లో ఉంచాలి: హైకోర్టు 3

ప్రాథమిక స్కూళ్లలోనే 3,4,5 తరగతులు

130 మంది విద్యార్థులు దాటిన బడికి హెచ్ఎం 14

వచ్చే ఏడాదే టీచర్ల బదిలీలు.. స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం



అమిత్ షా బ్యాగుల తనిఖీ



న్యూఢిల్లీ, నవంబరు 15: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ తమను మాత్రమే లక్ష్యంగా చేసుకుని తనిఖీలు చేస్తున్నారంటూ కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. హింగోలి జిల్లాలో మహాయుతి కూటమి పార్టీల తరఫున ప్రచారానికి వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా బ్యాగులను, ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌ను ఈసీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను అమిత్ షా తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. "హింగోలి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లాను. ఈ సందర్భంగా నేను ప్రయాణించిన హెలికాప్టర్ సహా నా బ్యాగేజీని ఈసీ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై బీజేపీకి విశ్వాసం ఉంది" అని షా పేర్కొన్నారు. ఇదిలావుంటే, గత మూడు రోజులుగా ఈసీ తమ బ్యాగులను మాత్రమే తనిఖీ చేస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, ఉద్ధవ్ ఠాక్రే తదితరులు విమర్శలు సంధిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం అన్ని పార్టీల నాయకులకు చెందిన బ్యాగులు, వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తుండడం గమనార్హం.

మోదీ ప్రయాణిస్తున్న విమానంలో

సాంకేతిక లోపం

దేవ్‌గఢ్, నవంబరు 15: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తుది దశ ప్రచారం నిమిత్తం శుక్రవారం ఈ రాష్ట్రానికి వచ్చిన ప్రధాన మంత్రికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఝార్ఖండ్‌లోని దేవ్‌గఢ్‌లో ప్రచారం ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీకి పయనమయ్యారు. అయితే, 80 కిలో మీటర్లు వెళ్లిన తర్వాత ఆయన ప్రయాణిస్తున్న విమానం సాంకేతిక లోపం కారణంగా వెనుదిరిగి వచ్చింది. దీంతో మరో విమానంలో ప్రధాని ఢిల్లీకి వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే కార్యక్రమాన్ని ప్రారంభించాల్సి ఉంది. దీంతో హుటాహుటిన అధికారులు ప్రత్యామ్నాయంగా మరో విమానాన్ని సిద్ధం చేశారు.


45 నిమిషాలు ఆలస్యంగా

రాహుల్ హెలికాప్టర్ టేకాఫ్

» ప్రధాని ఉన్నారనే ఇలా చేశారు.. ఈసీకి కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

గొడ్డా, నవంబరు 15: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తుది దశ ప్రచారంలో రాజకీయ రగడ చోటు చేసుకుంది. రాహుల్‌గాంధీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు అనుమతులు ఇవ్వడంలో 45 నిమిషాలపాటు ఆలస్యం జరిగింది. దీంతో ఆయన ఝార్ఖండ్‌లోని గొడ్డా నియోజకవర్గంలోనే ఉండిపోయారు. అయితే, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలోనే తమ నాయకుడి హెలికాప్టర్‌ను 45 నిమిషాల పాటు నిలుపుదల చేశారని, కాంగ్రెస్ పార్టీ ప్రచారంపై ప్రభావం చూపించేలా వ్యవహరించారని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. "ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) అధికారులకు ప్రధాని మోదీ కదలికలపై ఉన్న దృష్టి.. రాహుల్ గాంధీపై లేదు" అని దుయ్యబట్టారు. కాగా, ఈ వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. కాగా, ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ మాట్లాడుతూ.. బీసీలంటే బీజేపీకి లెక్కలేదని విమర్శలు గుప్పించారు. "ఝార్ఖండ్‌లో బీసీల రిజర్వేషన్‌ను 27 శాతం నుంచి 14 శాతానికి బీజేపీ తగ్గించింది" అని దుయ్యబట్టారు.

లోకం తీరు



మహా వికాస్ అఘాడీ సర్కారు

కూల్చివేతలో అదానీ హస్తం

» ధారావిని సొంతం చేసుకునేందుకే:రాహుల్



నాందేడ్, నవంబరు 15: మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ హస్తం ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. 2019లో అవిభాజ్య ఎన్సీపీ, బీజేపీ మధ్య జరిగిన సమావేశంలో అదానీ పాల్గొన్నట్లుగా ఇటీవల అజిత్ పవార్ వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజకీయ పార్టీల పొత్తు సమావేశంలో ఓ పారిశ్రామికవేత్తకు పనేంటని ప్రశ్నించారు. ధారావి ప్రాంతంపై అదానీ ఆనాడే కన్నేశారని, దానిని సొంతం చేసుకోవడానికి రాజకీయంగా పావులు కదిపారని అన్నారు. ఇందులో మోదీ పాత్ర కూడా ఉందని రాహుల్ ఆరోపించారు.

సమాజాన్ని మోదీ విభజిస్తున్నారు



పుణె, నవంబరు 15: ప్రధాని మోదీ తన ప్రసంగాలతో సమాజాన్ని విభజిస్తున్నారని ఎన్సీపీ(ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ ఆరోపించారు. మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమిపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత వల్ల ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి అధికారంలోకి రానుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం అజిత్‌పవార్‌ను తిరిగి కలుపుకొనే అవకాశంపై ప్రశ్నించగా, అలాంటి అవకాశమే లేదన్నారు. బీజేపీతో కలిసి ఉన్నవారితో తనకు ఏ విధమైన సంబంధమూ లేదని తేల్చిచెప్పారు. అజిత్‌పవార్ వెంట వెళ్లిపోయిన నేతలను 'ద్రోహులు'గా ఆయన అభివర్ణించారు. ఎన్నికల్లో గెలుపు కోసం మహాయుతి కూటమి భారీగా ధనాన్ని వెదజల్లుతోందని శరద్ పవార్ ఆరోపించారు.



రూ.23 కోట్ల దున్నపోతు!

అన్‌మోల్.. అంటే 'వెల కట్టలేనిది' అని అర్థం! ఈ చిత్రంలో యముని మహిషంలా బలంగా కనపడుతున్న దున్నపోతు పేరు అదే. దీని ధర అక్షరాలా 23 కోట్ల రూపాయలు!! హరియాణాలోని సిర్సా జిల్లాకు చెందిన గిల్ అనే ఆసామీ వద్ద ఉందీ దున్నపోతు. దీని బరువు 1500 కిలోలు. మేలు జాతి జీవం కావడంతో దీని వీర్యానికి బోలెడంత డిమాండ్ ఉంది. ఎంతంటే.. అన్‌మోల్ వీర్యాన్ని అమ్మడం ద్వారా దీని యజమాని గిల్ నెలకు రూ.5 లక్షల దాకా సంపాదిస్తున్నాడు. దీన్ని ఆరోగ్యంగా ఉంచడం ద్వారా అంత ఆదాయం సంపాదించాలంటే.. అందుకు తగ్గ ఖర్చు ఉంటుంది. దీనికి రోజూ పావుకిలో బాదం పప్పులు, నాలుగు కిలోల దానిమ్మ గింజలు, 30 అరటిపండ్లు, 5 లీటర్ల పాలు, 20 గుడ్లు పెడతారు. రోజుకు రెండుసార్లు దీని ఒంటికి ఆవ నూనె, బాదం నూనె దట్టంగా పట్టించి స్నానం చేయిస్తారు.

గిరిజన ప్రాంతాల్లో వసతుల కల్పనకు కృషి

» బిర్సా ముండా 150వ జయంతి సభలో కేంద్ర మంత్రి పెమ్మసాని

» రాష్ట్రంలో 18 పథకాల పునరుద్ధరణ: మంత్రి గుమ్మడి సంధ్య

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెడుతున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్లశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా శుక్రవారం విజయవాడలో జన్ జాతి గౌరవ దినోత్సవం, గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహించారు. గిరిజనులకు అటవీ భూ హక్కు పత్రాలు, ఆధార్ కార్డులు, ఎల్పీజీ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని మాట్లాడుతూ బిర్సా ముండా జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమన్నారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా ప్రధాని మోదీ గిరిజన ప్రాంతాల్లో రూ.6 వేల కోట్లతో పనులను ప్రారంభించారని తెలిపారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం మొదటిసారిగా ఎన్టీఆర్ కృషిచేశారని మంత్రి సంధ్యారాణి అన్నారు. గిరిజనుల ప్రాంతాల్లో రోడ్ల అనుసంధానానికి సీఎం చంద్రబాబు రూ.2,000 కోట్లు ప్రకటించారన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన 18 పథకాలను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. సాలూరులో త్వరలో గిరిజన యూనివర్సిటీ అందుబాటులోకి వస్తుందన్నారు.

ఉపాధి పెండింగ్ బకాయిలకు మోక్షం

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2014-15 నుంచి 2018-19 మధ్య కాలంలో చేపట్టిన పనులకు సంబంధించి గత ప్రభుత్వం చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచిన బిల్లులు సుమారు రూ.331 కోట్లు చెల్లించాలని నిర్ణయించింది. దీని ప్రకారం.. 2018 అక్టోబరు 1 నుంచి 2019 మే 31 వరకు 4.47 లక్షల పనుల బిల్లులు అప్‌లోడ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు ఉమ్మడి సర్వీస్ రూల్స్

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి సబార్డినేట్ సర్వీసురూల్స్‌లో పలు సవరణలు తీసుకొస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీ రాజ్‌శాఖలో పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు ఉన్నాయి. కొత్తగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసిన తర్వాత అక్కడ నియమించిన పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్-5, గ్రేడ్-6లుగా పేర్కొన్నారు.

8న బాలికల విద్య ఉపకార వేతనం పరీక్ష

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విద్యా సంస్థలు నిర్వహించే బాలికల విద్య ఉపకారవేతనం పరీక్ష (జీఈఎస్‌టీ-2025) డిసెంబరు 8న జరుగుతుందని ఎన్టీఆర్ విద్యా సంస్థల మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన మొదటి 25 మంది బాలికలకు ఎన్టీఆర్ విద్యా సంస్థల ద్వారా ఉపకార వేతనం అందిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు వెబ్‌సైట్ www.ntrcolle-geforwomen.educationలో 16 నుంచి వచ్చే నెల 4 వరకు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7660002627/28 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గాడిదలు అంటగట్టి 100కోట్లకు కుచ్చుటోపీ!

» తమిళనాడులోని 'ది డాంకీ ప్యాలెస్' మోసం

పంజాగుట్ట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ షెడ్డు కట్టుకొని 20-30 గాడిదలు కొనుక్కొని పాలు పితికి ఇస్తే లీటరు రూ.1600కు కొనే పూచీ మాది! తమిళనాడులోని తిరునల్వేలికి చెందిన 'ది డాంకీ ప్యాలెస్' సామాజిక మాధ్యమాల్లో ఇలానే ప్రచారం చేసింది. బాగుందే.. 20-30 గాడిదలు పెంచుకుంటే లక్షలకొద్దీ లాభాల పంట అని తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది ఎగబడ్డారు. పెద్ద పెద్ద షెడ్లు నిర్మించి.. రూ.80వేల నుంచి రూ.1.50 లక్షల చొప్పున వెచ్చించి గాడిదలు కొనుక్కున్నారు! కొద్దిరోజులు చెప్పినట్లుగానే పాలు తీసుకున్న 'ది డాంకీ ప్యాలెస్' నిర్వాహకులు తర్వాత తూచ్ పొమ్మన్నారు! ఫలితంగా నమ్మి గాడిదలు కొనుకున్న వారంతా తలా రూ.50 లక్షల నుంచి రూ.కోటి దాకా నష్టపోయారు! అయితే.. 'గాడిద' మాటలతో నమ్మించి 'ది డాంకీ ప్యాలెస్' వారు రూ.100 కోట్ల దాకా పోగేసుకున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. కరోనా తర్వాత జనాలకు రోగ నిరోధక శక్తి పెరుగుదల, పోషక పదార్థాలు అవసరం చాలా ఉంటుందని.. ఇవి గాడిద పాలల్లో పుష్కలంగా ఉంటాయని.. ఔషధాల తయారీ లోనూ గాడిద పాలు వాడతారని ఫలితంగా డిమాండ్ బాగా ఉంటుందంటూ ది డాంకీ ప్యాలెస్ నిర్వాహకుడు బాబు ఉలఘనాథన్, సభ్యులు గిరి సుందర్, బాలాజీ, సోనిక రెడ్డి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఫలితంగా చాలామంది ఫ్రాంఛైజీలు తీసుకున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ కట్టారు, షెడ్లు నిర్మించుకున్నారు, వారి వద్దనే గాడిదలు కొనుగోలు చేశారు. మూడు నెలలు వారి వద్ద నుంచి పాలు సేకరించి డబ్బులు చెల్లించినా తర్వాత స్పందించడం, డబ్బులు చెల్లించడం మాని వేశాడని బాధితులు ఆరోపించారు. 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు, నాలుగు నెలల పాటు లీటరుకు రూ.1600 చొప్పున ఒక్కొక్కరికి సుమారు రూ.4లక్షలు-రూ5లక్షల దాకా చెల్లించారని చెప్పారు. భారీగా లాభాలు వస్తాయని నమ్మించడంతో తాము తీసుకున్న డబ్బులను తిరిగి వ్యాపారంలోనే పెట్టించారని చెప్పారు. ఏప్రిల్, మే తర్వాత నుంచి ఇప్పటి వరకు సరఫరా చేసిన డబ్బులు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ విషయంపై తమిళనాడులో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నామని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

హిందూ వ్యతిరేక భావజాలంతోనే

యోగి వ్యాఖ్యలను అజిత్‌పవార్ తప్పుపట్టడంపై ఫడణవీస్

» 'కటేంగేతో బటేంగే' అన్న యోగి వ్యాఖ్యల్లో తప్పేమీ లేదు

» ఈ దేశ చరిత్రనే చెప్పారు: ఫడణవీస్

» 'మహాయుతి'లో లుకలుకలు బయటకు



సతారాలో ఫడణవీస్ ఎన్నికల ప్రచారం

న్యూఢిల్లీ, నవంబరు 15: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కీలక సమయంలో అధికార 'మహాయుతి' కూటమిలో లుకలుకలు పెరుగుతున్నాయి. మహాయుతి కూటమి పక్షాన ఇటీవల ప్రచారం చేసిన యూపీ సీఎం, బీజేపీ నేత యోగి ఆదిత్యనాథ్.. హిందువులను ఉద్దేశించి 'కటేంగేతో బటేంగే'(ఐక్యత లేకపోతే విభజిస్తారు) అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా కూటమి పార్టీల మధ్య వివాదానికి దారితీశాయి. యోగి చేసిన వ్యాఖ్యలను కూటమిలో భాగస్వామ్య పార్టీగా ఉన్న నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(అజిత్ పవార్) నేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ బహిరంగంగానే తప్పుబట్టారు. యోగి వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మతతత్వ భావనతోనే యోగి ఇలా వ్యాఖ్యానించారని చెప్పుకొచ్చారు. అయితే, తాజాగా మరో ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడణవీస్.. అజిత్ పవార్ చేసిన వ్యాఖ్యలపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫడణవీస్ మాట్లాడుతూ.. ఆయనలో(అజిత్) హిందూ వ్యతిరేక భావజాలం ఉందని, అందుకే యోగి వ్యాఖ్యలపై అలా వ్యాఖ్యానించారని చెప్పారు. అంతేకాదు, ప్రజల మనసులు అర్థం చేసుకునేందుకు అజిత్‌కు కొంత సమయం పడుతుందన్నారు. "యోగి నినాదంలో తప్పేముంది? ఈ దేశ చరిత్రనే ఆయన చెప్పుకొచ్చారు" అని యోగిని ఫడణవీస్ సమర్థించారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలని యోగి పిలుపునివ్వడంలో తప్పులేదన్నారు. "అజిత్.. సుదీర్ఘకాలం పాటు హిందూ వ్యతిరేక శక్తులతో కలిసి ప్రయాణించారు. ఆయనలోనూ హిందూ వ్యతిరేక భావజాలం ఉంది. తమకు తాము లౌకిక వాదులమని చెప్పుకొనే వారిలో నిజమైన లౌకిక వాదం లేదు. హిందూత్వను వ్యతిరేకించే వారితో అజిత్ దశాబ్దాల పాటు కలిసి ఉన్నారు" అని ఫడణవీస్ వ్యాఖ్యానించారు. "ఇలాంటి ప్రజల సెంటిమెంట్లను అర్థం చేసుకోలేరు. వారి ప్రకటనలను కూడా అర్థం చేసుకోలేరు. ఇంకేదో చెపాలనుకుంటారు" అని అన్నారు. యోగి చేసిన వ్యాఖ్యల్లో తప్పులేదన్న ఆయన.. ఆ నినాదం భారత దేశ చరిత్రను చాటి చెబుతుందన్నారు. "యోగి నినాదంలో ఎలాంటి తప్పూ లేదు. మన చరిత్రను చూడండి. ఎప్పుడెప్పుడు విడిపోయామో అప్పుడప్పుడు బానిసలుగా మారాం. ఎప్పుడైతే ఈ దేశం కులాలు, రాష్ట్రాలు, మతాలు, సంఘాలుగా విడిపోయిందో అప్పుడప్పుడల్లా మనం బానిసలమైపోయాం. దేశం, ప్రజలు కూడా విడిపోయారు. అందుకే మనం(హిందువులు) ఐక్యంగా ఉండాలి. ఇదీ మన చరిత్ర. చిత్రం ఏంటంటే.. విభజన వద్దని చెప్పేవారే.. యోగి వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నారు. ఇదే నాకు అర్థం కావడం లేదు" అని ఫడణవీస్ అన్నారు.

అప్పట్లో మాతో కలవాలని పవార్ భావించారు!

మహారాష్ట్రలో 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ, శివసేన కూటమి మెజారిటీ దక్కించుకున్నా ముఖ్యమంత్రి పీఠంపై ఏర్పడిన వివాదంతో ఈ కూటమి విచ్ఛిన్నమైంది. అయితే, అప్పట్లో ఎన్సీపీ నేతగా ఉన్న శరద్ పవార్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని తాజాగా ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. "ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో మేం సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ సమయంలో ఎన్సీపీ నుంచి ఇద్దరు నాయకులు వచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేద్దామన్నారు. ఈ ఆఫర్ చూసి నేను ఆశ్చర్యపోయారు. ఆ ఇద్దరూ శరద్ పవార్ పంపించిన వారేనని తెలిసింది. దీంతో కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులపై వారితో చర్చించాం. ఎన్నికలు ముగిసిన తర్వాత శరద్ పవార్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తొలుత రాష్ట్రపతి పాలనకు వెళ్లాలని భావించారు. తర్వాత శరద్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి.. సుస్థిర ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు కోరుతున్నట్టు చెప్పి.. తర్వాత మా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని భావించారు. అంతేకాదు, వాస్తవానికి రాష్ట్రపతి పాలన కోసం.. 'ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉందని' పేర్కొంటూ ఎన్సీపీ సిద్ధం చేసిన లేఖ మా దగ్గరే సిద్ధమైంది. తర్వాత శరద్ పవార్ అనుమతి తీసుకుని గవర్నర్‌కు పంపించాం. ఉద్ధవ్ మాతో అంటీ ముట్టనట్టు ఉండేసరికి పవార్‌తో చేతులు కలపాలని నిర్ణయించాం" అని ఫడణవీస్ వివరించారు.

మైనర్ భార్యతో శృంగారం అత్యాచారమే

ముంబయి, నవంబరు 15: మైనర్ బాలికతో శృంగారం జరపడం అత్యాచారం కిందకే వస్తుందని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఆమె సొంత భార్యే అయినప్పటికీ, శృంగారానికి అంగీకారం తెలిపినప్పటికీ చెల్లదని తెలిపింది. 18 ఏళ్లు నిండని బాలికతో శారీరక సంబంధం పెట్టుకోవడం నేరమని, అందువల్ల మైనర్ భార్యతో పరస్పర సమ్మతితో జరిపిన శృంగారాన్ని కూడా రేప్‌గానే పరిగణించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గోవింద్ సనప్ తీర్పు చెప్పారు. దీన్ని అత్యాచారం కింద గుర్తిస్తూ పోక్సో చట్టం కింద ఓ భర్తకు శిక్ష వేస్తూ వార్ధా జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించారు. భార్యతో జరిపే శృంగారం నేరం ఎలా అవుతుందంటూ నిందితుడు చేసిన వాదనను తిరస్కరించారు. నిందితుడు తన భార్య(మైనర్)ను గర్భస్రావం చేయించుకోవాలని వేధించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు కోర్టుకు వెళ్లింది.

టీనేజీ ముద్దు నేరమేమీ కాదు: మద్రాస్ హైకోర్టు

చెన్నై, నవంబరు 15: టీనేజీ దశలోని యువతీయువకులు పరస్పర ఇష్టంతో చేసుకునే కౌగలింతలు, పెట్టుకునే ముద్దులను క్రిమినల్ చర్యలుగా పరిగణించలేమని మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ స్పష్టం చేసింది. యవ్వన ఆకర్షణతో తప్ప, క్రిమినల్ దురుద్దేశాలు లేకుండా చేసే ఇలాంటి పనులకు క్రిమినల్ నేరం కింద సెక్షన్లు మోపలేమని తెలిపింది. 19 ఏళ్ల యువతి, టీనేజీలోని మరో యువకుడు ప్రేమలో పడ్డారు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏకాంత ప్రదేశంలో తనను ముద్దు పెట్టుకోవడంతో పాటు, హత్తుకున్నట్టు తెలిపింది. లైంగిక వాంఛతో దగ్గరకు వచ్చాడన్న నేరంపై పోలీసులు ఐపీసీలోని సెక్షన్ 354-ఏ(1)(1) కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదంలో పది మంది శిశువుల మృతి

» ఉత్తరప్రదేశ్ ఝాన్సీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఘటన

» 32 మందిని కాపాడిన సహాయ సిబ్బంది

» షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం

ఝాన్సీ, నవంబరు15: ఉత్తరప్రదేశ్ ఝాన్సీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 మంది శిశువులు మృతిచెందారు. మరో 32 మందిని సహాయ సిబ్బంది కాపాడారు. ఇన్‌కుబేటర్లలో ఉండగానే శిశువులు ప్రాణాలు కోల్పోయారు. ఎన్ఐసీయూలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఘటనపై విచారణ జరిపేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కమిటీని ఏర్పాటు చేశారు. 12 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అమెరికాలో బడ్జెట్ కోతల విభాగం

ఉద్యోగాలకు అర్హతలు: సూపర్ హై-ఐక్యూ, రోజుకు కనీసం 12 గంటలు పనిచేసే అనురక్తి

» ఆధ్వర్యం: మస్క్, వివేక్

» జీతం మాత్రం సున్నా

» రక్షణ మంత్రిగా పీట్ హెగ్‌సెట్ పేరును ప్రతిపాదించిన ట్రంప్



వాషింగ్టన్, నవంబరు 15: అమెరికా అధ్యక్షునిగా ఎన్నికయిన డొనాల్డ్ ట్రంప్.. ప్రభుత్వ సామర్థ్యం పెంపును తన ప్రథమ కర్తవ్యంగా ఎంచుకున్నారు. వృథా వ్యయాలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని తగ్గించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ప్రభుత్వ సామర్థ్య విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్న్‌మెంట్ ఎఫిషియన్సీ-డీఓజీఈ)ని ఏర్పాటు చేశారు. ఈ విభాగానికి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి ఆధ్వర్యం వహిస్తున్నారు. అమెరికా వార్షిక బడ్జెట్ 7 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.600 లక్షల కోట్లు) కాగా, దాంట్లో 2 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.170 లక్షల కోట్లు) మేర కోత విధించడమే ట్రంప్ లక్ష్యం. ఇందుకోసం కొత్తగా ఏర్పాటయిన విభాగంలో ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు మస్క్, వివేక్‌లు ప్రకటించారు. వారిని నియమిస్తున్నట్లు గురువారం ట్రంప్ ప్రకటించగా, వెంటనే రంగంలో పని ప్రారంభించారు. డీఓజీఈలో పనిచేసేందుకు ఆసక్తికలవారు తమ రెజ్యూమేలను ఎక్స్ ద్వారా డైరెక్ట్ మెసేజ్ (డీఎం)ల రూపంలో పంపించాలని సూచించారు. నెలకు కనీసం 8 డాలర్ల చందా చెల్లించే ఎక్స్ ఖాతాల ద్వారా మాత్రమే ఈ డీఎంలు పంపించే అవకాశం ఉంది. "ఐడియాలు ఇచ్చేందుకు మాకు పార్ట్ టైం ఉద్యోగులు అవసరం లేదు. 'స్మాల్-గవర్నమెంట్' విప్లవకారులుగా పనిచేసేందుకు సూపర్ హై-ఐక్యూ, వారానికి 80గంటలకు పైగా (రోజుకు సుమారుగా 12 గంటలు) పనిచేసేందుకు అనురక్తి ఉండేవారు కావాలి. 'ఖర్చుల్లో కోత విధించే' పనులు చేయాలి. ఇది అంత గ్లామరస్‌గా ఉండదు. మొదటి 1%లో ఉండే డైరెక్ట్ మెసేజ్‌లను ఎలాన్, వివేక్‌లు స్వయంగా పరిశీలిస్తారు" అని డీఓజీఈ ఎక్స్ సందేశంలో తెలిపింది. ఎలాన్ మస్క్ మరో సందేశం ఇస్తూ "డీఓజీఈలో పనిచేసే సిబ్బంది ప్రభుత్వ వ్యయాల తగ్గింపునకు, సామర్థ్యం పెంపునకు జాగురూకతతో పని చేయాల్సి ఉంది. ఇందుకు ఎలాంటి పరిహారం చెల్లించరు" అని స్పష్టం చేశారు. "నిజానికి ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. ఎంతో మంది శత్రువులను కొని తెచ్చుకుంటారు. పరిహారం మాత్రం సున్నా. చాలా మంచి బేరం కదూ!" అంటూ వ్యాఖ్యానించారు.

యుద్ధాలను నిలిపివేస్తా

శక్తిమంతమైన సైన్యం సాయంతో ప్రస్తుతం జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్, మధ్యప్రాచ్యం యుద్ధాలను నిలిపివేస్తానని ట్రంప్ అన్నారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని పామ్‌బీచ్‌లో ఉన్న తన సొంత రిసార్ట్ అయిన మార్ ఎ లాగోలో నెలకొల్పిన 'అమెరికా ఫస్ట్' పాలసీ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం జరిగిన సన్మాన సభలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. 'అమెరికా ఫస్ట్' పేరుతో విదేశాంగ విధానంపై మాట్లాడుతూ 'తక్కువ పన్నులు, శక్తిమంతమైన సైన్యం ఉన్న దేశంగా అమెరికాను మళ్లీ అభివృద్ధి చేయాలి' అని అన్నారు. మరోవైపు ఫాక్స్ న్యూస్ టీవీ యాంకర్, నేషనల్ గార్డ్ మాజీ ఉద్యోగి పీట్ హెగ్‌సెట్‌ను రక్షణ మంత్రిగా నియమించాలని ట్రంప్ ప్రతిపాదించారు. దీన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంది.

ఇరాన్ రాయబారితో ఎలాన్ మస్క్ భేటీ!

న్యూయార్క్, నవంబరు 15: అమెరికా, ఇరాన్ అంతర్యుద్ధం వేళ కీలక పరిణామం జరిగింది. ఐక్యరాజ్యసమితికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానితో అపర కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ భేటీ అయ్యారు. ఓ రహస్య ప్రదేశంలో వీరిద్దరు సమావేశమైనట్లు శుక్రవారం న్యూయార్క్ టైమ్స్ ఒక కథనంలో పేర్కొంది. కనీసం గంట పాటు జరిగిన చర్చల్లో రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలను తగ్గించేందుకు దృష్టి సారించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను తొలగించాలని, రెండు దేశాల మధ్య వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించాలని ఆ దేశ రాయబారి కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశానికి సంబంధించి అమెరికా, ఇరాన్ అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

ఓబీసీ క్రీమీలేయర్‌లో 'జీతం' లెక్కించాలా?

ప్రభుత్వరంగ సంస్థల సిబ్బందికీ వర్తింపజేయాలా?

» పార్లమెంటరీ స్థాయీ సంఘంలో చర్చ

న్యూఢిల్లీ, నవంబరు 15: సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఓబీసీ క్రీమీలేయర్ విధానాన్ని అమలుచేయడంలో వారి తల్లిదండ్రుల 'వేతనాన్ని' పరిగణనలోకి తీసుకునే విషయంలో పార్లమెంటరీ స్థాయీ సంఘంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఈ నెల 28వ తేదీకి సమావేశం వాయిదా పడింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పనిచేస్తున్న ఓబీసీ వర్గం తల్లిదండ్రుల పిల్లల విషయంలో ఈ సమస్య తలెత్తింది. తల్లిదండ్రుల ఆదాయాన్ని బట్టి ఓబీసీ క్రీమీలేయర్‌ను సహజంగా నిర్ణయిస్తారు. ఒకవేళ ఆదాయం రూ. 8 లక్షలు మించితే వారి పిల్లలకు రిజర్వేషన్లు వర్తించవు. ఈ విధానాన్ని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కూడా వర్తింపజేయాలని ఇటీవల సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల ఆదాయాన్ని లెక్కించడంలోనూ 'వేతనాన్ని' పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనే అంశాన్ని ఓబీసీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం ప్రస్తుతం పరిశీలిస్తోంది. ఇందుకోసం వచ్చే సమావేశానికి హాజరు కావాల్సిందిగా కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగం ఉన్నతాధికారులకు నోటీసులు జారీచేసింది. అయితే, పీఎస్‌యూలకూ 'వేతన' ప్రమాణాన్ని వర్తింపజేసే ప్రతిపాదనను విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు వ్యతిరేకిస్తున్నారు. పీఎస్‌యూల్లో పనిచేస్తున్న ఓబీసీ కేటగిరి సిబ్బంది వేతనం, వ్యవసాయం ద్వారా వారికి లభించే లాభాలను.. ఆదాయంగా పరిగణించరాదని 1993 ఆఫీస్ మెమొరండంలో స్పష్టంగా ఉన్నదని, కానీ, దానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని వారు ఆక్షేపించారు. ఈ కారణంగా అనేక మంది ఓబీసీ అభ్యర్థులు గ్రూపు ఏ,బీ,సీ,డీ పోస్టులకు అనర్హులు అవుతున్నారన్నారు. అయితే, ఐదేళ్ల క్రితం ఇదే అంశం చర్చకు వచ్చినప్పుడు దానిని స్థాయీ సంఘం తిరస్కరించింది. అప్పుడు స్థాయీ సంఘానికి నేతృత్వం వహించిన బీజేపీ ఎంపీ సురేశ్ సింగ్ ఇప్పుడూ సంఘం ఛైర్మన్‌గా ఉండటం గమనార్హం.

మధుమేహుల్లో నాలుగో వంతు భారత్‌లోనే

» ప్రపంచవ్యాప్తంగా 82.8 కోట్లు.. భారత్‌లో 21.2 కోట్ల మంది బాధితులు

న్యూఢిల్లీ, నవంబరు 15: ప్రపంచానికి అతిపెద్ద సవాల్ విసురుతున్న సమస్యల్లో మధుమేహం ఒకటి. 2022 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 82.8 కోట్ల మంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, ఇందులో నాలుగో వంతు మంది భారత్ (21.2 కోట్లు)లోనే ఉన్నారని ది లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనంలో వెల్లడైంది.



ప్రపంచ మధుమేహ దినోత్సవం (నవంబరు 14) సందర్భంగా ప్రచురించిన ఈ అధ్యయనం ప్రకారం.. 1990 లెక్కలతో పోలిస్తే ఈ 82.8 కోట్ల సంఖ్య నాలుగు రెట్లు అధికం. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ఈ సంఖ్యలో భారీగా పెరుగుదల కనిపించిందని అధ్యయనానికి నేతృత్వం వహించిన నాన్ కమ్యూనబుల్ డిసీజ్ రిస్క్ ఫ్యాక్టర్ కొలాబరేషన్ (ఎన్‌సీడీ-ఆర్ఐఎస్‌సీ) పరిశోధకులు తెలిపారు. 1990-2022 మధ్యకాలంలో అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో మధుమేహ చికిత్స రేట్లు తక్కువగానే ఉన్నాయని, కేసులు మాత్రం ఎక్కువగా పెరిగాయని వారు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మధుమేహంతో బాధపడుతున్న 82.8 కోట్ల మందిలో ఒక్క భారత్‌లోనే 21.2 కోట్ల మంది ఉన్నారని, ఆ తర్వాత చైనాలో 14.8 కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నారు. అమెరికాలో 4.2 కోట్లు, పాకిస్థాన్‌లో 3.6 కోట్లు, బ్రెజిల్‌లో 2.2 కోట్ల మంది ఉన్నారని చెప్పారు. 2022లో 30 ఏళ్లు పైబడిన బాధితుల్లో 44.5 కోట్ల మంది అసలు మధుమేహానికి చికిత్స తీసుకోలేదని, వారిలో 13.3 కోట్ల మంది భారత్‌లోనే ఉన్నారని వెల్లడించారు.

డీఎస్పీ పదోన్నతి కలేనా?!



సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పోలీసు శాఖలో అడుగుపెట్టారు. కొన్నాళ్ల తర్వాత ఇన్‌స్పెక్టర్లు అయ్యారు. అక్కడి నుంచి మరో మెట్టు ఎక్కాల్సి ఉన్నా అన్యాయమే జరుగుతోంది! పదోన్నతి పలకరించడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 1995లో ఎస్ఐలుగా ఉద్యోగాలకు ఎంపికైన ఇన్‌స్పెక్టర్ల పరిస్థితి ఇది!. గత వైసీపీ సర్కారులో సీనియారిటీ జాబితా తయారీ, ఖాళీల భర్తీలో దొర్లిన తప్పులు వీరికి శాపంగా మారాయి. అన్ని అర్హతలూ, మంచి ఏసీఆర్ (యాన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్టు) ఉన్నప్పటికీ డీఎస్పీ పదోన్నతి వారికి అందని ద్రాక్షలా మారింది. తమకు అన్యాయం జరుగుతోంది మహాప్రభో.. అని ఈ బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు నాటి జగన్ ప్రభుత్వాన్ని పదేపదే వేడుకున్నా కరుణించలేదు. అన్యాయాన్ని అడ్డుకుని న్యాయం చేయాల్సిన పోలీసు ఉన్నతాధికారులు సైతం ఆ విషయం గురించి మాట్లాడొద్దని నాడు ఉచిత సలహాతో సరిపెట్టారు.

‘1995 బ్యాచ్’కు న్యాయం జరిగేనా?

- ఇన్‌స్పెక్టర్లుగానే ముగుస్తున్న సర్వీసు!
- వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్లే అన్యాయం
- ఏలూరు రేంజ్‌లోనే అత్యధిక బాధితులు
- గత ప్రభుత్వంలో హైకోర్టును ఆశ్రయించిన గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్
- భయపెట్టి పిటిషన్ విత్‌డ్రా
- కూటమి ప్రభుత్వంపైనే ఇన్‌స్పెక్టర్ల ఆశలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక వికృత ఆటలాడింది. అందులో పోలీసుల పదోన్నతులను తారుమారు చేయడం ఒకటి!. ఇందులో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 1995లో జరిగిన రిక్రూట్‌మెంట్‌లో ఎస్ఐలుగా ఉద్యోగాలు సాధించి, ప్రస్తుతం వివిధ రేంజ్‌ల్లో ఉన్న ఇన్‌స్పెక్టర్లు బాధితులుగా మారారు. కొన్నేళ్లుగా న్యాయంగా రావాల్సిన డీఎస్పీ పదోన్నతి కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి ఇన్‌స్పెక్టర్లు ఒక్క ఏలూరు రేంజ్‌లోనే 18 మంది ఉన్నారు. వీరు ఇప్పటికే 30 ఏళ్ల సర్వీసు దగ్గరికి వచ్చారు. ఈ బ్యాచ్‌లో డీఎస్పీ అవుతామని ఆశపడిన కొందరు ఆ కోరిక తీరకుండా చనిపోయారు. ఇంకొంతమంది ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారు. సర్వీసులో సీనియర్లుగా ఉన్న ఇన్‌స్పెక్టర్లు తమ కంటే వెనుక ఉద్యోగంలో చేరి అడ్డదారి పదోన్నతుల్లో పైఅధికారులుగా మారగా, వారి కింద పని చేయడం తీవ్ర ఇబ్బందికరంగా భావిస్తున్నారు.

నాడు బెదిరింపులే న్యాయం?!

1995 బ్యాచ్ ఇన్‌స్పెక్టర్లు గత వైసీపీ ప్రభుత్వంలో పెద్దలను, డీజీపీలను కలిసి సమస్యను వివరించారు. సర్వీసు నిబంధనలు, పదోన్నతులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పులను అందజేశారు. అయితే, ఈ విషయం గురించి మాట్లాడొద్దని జవాబు ఇవ్వడం తప్ప న్యాయం చేయలేకపోయారు. ఈ పరిణామాలతో కలత చెందిన గుంటూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. మరికొద్దిరోజుల్లో కోర్టు తీర్పు వెలువడుతుందనగా, ఓ డీజీపీ ఆయన్ను పిలిపించి పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, లేదంటే వేటు తప్పదని బెదిరించారు. దీంతో ఆ ఇన్‌స్పెక్టర్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్ పోస్టులు రేంజ్ పరిధిలో ఉంటాయి. డీఎస్పీ పోస్టులు మాత్రం రాష్ట్రస్థాయిలో ఉంటాయి. ఏలూరు రేంజ్‌లో ఉన్న ఖాళీలను.. ఇతర రేంజ్‌ల్లో పదోన్నతులు పొందినవారు తీసుకోవడంతో ఇక్కడున్న తమకు అన్యాయం జరుగుతోందని ఇన్‌స్పెక్టర్లు భావిస్తున్నారు.

తర్వాత వచ్చినవారికి అవకాశాలు..

రాష్ట్రంలో ఏలూరు, విశాఖ, గుంటూరు, కర్నూలు, అనంతపురం రేంజ్‌ల్లో 1995 తర్వాత బ్యాచ్‌లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు డీఎస్పీ పదోన్నతులు పొందుతున్నారు. దీంతో 1995 బ్యాచ్ ఇన్‌స్పెక్టర్లు జూనియర్ల కింద పనిచేయాల్సి వస్తోంది. కర్నూలు రేంజ్‌లో ఈ బ్యాచ్ ఇన్‌స్పెక్టర్లను 2003 బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లకు దిగువన చేర్చారు. గుంటూరు, విశాఖ రేంజ్‌లో 1999 బ్యాచ్‌కు అడుగున ఉన్నారు.

ఇలా న్యాయం చేయవచ్చు!!

- సీనియారిటీ జాబితా తయారీ లో ఉద్యోగంలో చేరిన తేదీని ప్రామాణికంగా తీసుకోవడం.
- పదోన్నతులను బ్యాచ్‌లవారీగా ఇవ్వడం ద్వారా గాడి తప్పుతున్న జాబితాను క్రమబద్ధీకరించడం.
- అన్యాయమవుతున్న ఇన్‌స్పెక్టర్లకు సూపర్ న్యూమరరీ చూపించి పదోన్నతి ఇవ్వడం.
- అన్ని రేంజ్‌ల్లోనూ ఉన్న ఖాళీల లెక్కలను తేల్చడం.
- సీనియారిటీ జాబితాలో ఉన్న తప్పులను సరిచేసే వరకు పదోన్నతులను నిలుపుదల చేయడం.

2003లో ఎస్ఐలుగా ఉద్యోగంలో చేరిన వారికి 2011లో ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం 2020లో సీనియారిటీ జాబితా రూపొందించింది. ఈ ఇన్‌స్పెక్టర్లకు నోషనల్ సీనియారిటీ పేరుతో సీనియర్లను కిందకు తోసేసి ఈ జూనియర్ల పేర్లను చేర్చింది. పోలీసు శాఖ నిబంధనల ప్రకారం ఎస్ఐగా ఉద్యోగంలో చేరిన ఆరేళ్లకు ఇన్‌స్పెక్టర్ పదోన్నతి ఇస్తారు. తర్వాత రాష్ట్రంలో ఉన్న

2020 జాబితా ఎఫెక్ట్!

డీఎస్పీ పోస్టుల ఖాళీలను బట్టి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలి. 1995లో ఎస్ఐగా ఎంపికైన వారు 1996లో ఉద్యోగంలో చేరారు. 14 ఏళ్ల తర్వాత ఇన్‌స్పెక్టర్లు అయ్యారు. వారు ఇప్పటికీ ఇన్‌స్పెక్టర్లుగా ఉన్నారు. 2003 రిక్రూట్‌మెంట్‌లో ఎస్ఐలుగా ఎంపికైన వారు 2004లో ఉద్యోగంలో చేరారు. వారు 2011లో ఇన్‌స్పెక్టర్ పదోన్నతులు పొందారు. వాస్తవానికి 1995లో ఎస్ఐలుగా ఎంపికై ఇన్‌స్పెక్టర్లుగా ఉన్న వారికి పదోన్నతులు ఇచ్చి డీఎస్పీలు గా పంపినా తాము చెప్పిన విధం గా వ్యవహరించరన్న ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం ఈబ్యాచ్‌ను వెన క్కి తోసిందన్న ఆరోపణలున్నాయి.



తిరుమలలో శుక్రవారం కార్తీక పౌర్ణమి గరుడసేవను వైభవంగా నిర్వహించారు. మలయప్పస్వామి గరుడుడిపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రైవేటు పాఠశాలల ఫీజులు వెబ్‌సైట్‌లో ఉంచాలి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాల గుర్తింపు కోసం సంబంధిత యాజమాన్యాలు సమర్పించే ఫారం-1 వివరాలను (మౌలిక సదుపాయాలు, ఫీజులు, టీచర్ల విద్యార్హత- వారి అనుభవం) cse.ap.-gov.in వెబ్‌సైట్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. విచారణను డిసెంబరు 4కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. ఆర్టీఈ చట్ట నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని 14,551 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన ఫారం-1 వివరాలను వెబ్‌సైట్ ద్వారా వెల్లడించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

ఫిజికల్, తుదిరాత పరీక్షకు అనుమతించండి

» హోంగార్డుల పిటిషన్‌పై సర్కారుకు హైకోర్టు ఆదేశాలు

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో తమను ప్రత్యేక కేటగిరిగా పరిగణించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించిన హోంగార్డులకు ఉపశమనం లభించింది. సామాజిక, మతపరమైన రిజర్వేషన్లతో సంబంధం లేకుండా పిటిషనర్లను ఫిజికల్, తుది రాతపరీక్షకు అనుమతించాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. మతపరమైన రిజర్వేషన్లను వర్తింప చేసి ప్రిలిమినరీ పరీక్షలో తమకు క్వాలిఫైయింగ్ మార్కులు రాలేదంటూ తమను తదుపరి ఫిజికల్, తుది రాతపరీక్షకు అనుమతించలేదని హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి.. రిజర్వేషన్లతో సంబం ధం లేకుండా ఫిజికల్, తుదిరాతపరీక్షకు అనుమతించాలని ఆదేశించారు.

కార్తీక పౌర్ణమి వేడుకల్లో మంత్రి లోకేశ్



మంగళాద్రి క్షేత్రం దిగువ సన్నిధిలో దీపాన్ని వెలిగిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. తొలుత దిగువ సన్నిధిలో ఓం శ్రీ మణిద్వీపం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోటి దీపోత్సవంలో పాల్గొని అఖండ కోటి దీపం వెలిగించారు. శ్రీ పానకాలస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి మంగళాద్రి పర్వత శిఖరాగ్రాన గండాలయ స్వామి సన్నిధికి కాలినడకన చేరుకున్నారు. అఖండ గండ దీపంలో నూనె వడ్డించి మొక్కులు తీర్చుకున్నారు. సనాతన ధర్మ రక్ష సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గండ భేరుండ జ్వాలా దీపోత్సవంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు.

సూపర్‌సిక్స్‌పై చేతులెత్తేస్తారా?!

» సీఎం చంద్రబాబుకు వైసీపీ నేత ముద్రగడ లేఖ

కిర్లంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి శుక్రవారం సీఎం చంద్రబాబు పేరిట లేఖ రాసి మీడియాకు విడుదల చేశారు. ‘అధికార దాహం తీర్చుకోవడం కోసం సూపర్ సిక్స్ హామీలిచ్చారు. తీరా హామీలు అమలు చేయకుండా చేతులెత్తేయడం తగునా?. సూపర్ సిక్స్ హామీలను తలచుకుంటే భయమేస్తోంది. సొల్లు కబుర్లు చెప్పడంలో మీకు మీరే సాటి. సూపర్ సిక్స్ అమలుకు కోట్ల నిధులు కావాలని మీకు తెలియదా? అబద్ధాలు చెప్పి ఎందుకు ఓట్లు వేయించుకున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ మీకు వెన్నతో పెట్టిన విద్య. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడం అన్యాయం. అమాయకులను జైల్లో పెట్టి కొట్టడం మంచిది కాదు’ అని ముద్రగడ లేఖలో పేర్కొన్నారు.

పద్మనాభ రెడ్డి గారూ.. పిచ్చి లేఖలు రాయకండి

» బుద్దా వెంకన్న బహిరంగ లేఖ



విజయవాడ, (వన్‌టౌన్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముద్రగడ పద్మనాభ రెడ్డిగారూ అని సంబోధిస్తూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న శుక్రవారం ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. చంద్రబాబు నాయుడును, కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వైసీపీ నేత ముద్రగడ రాసిన లేఖపై వెంకన్న దుయ్యబట్టారు. పద్మనాభరెడ్డి తొందరపడి సున్నితమైన అంశాల విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా లేఖ రాశాడని వెంకన్న పేర్కొన్నారు. ఇకపై ఇటువంటి పిచ్చి లేఖలు రాయవద్దని, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని హితవు పలికారు. సులభంగా పార్టీలు మారిన తీరులోనే పద్మనాభం కులం కూడా మారిపోయారన్నారు. చంద్రబాబు సీఎం అయ్యేనాటికి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ఇడుపులపాయకు పంపించాడన్నది తెలిసి కూడా పద్మనాభరెడ్డి మాట్లాడం సరికాదన్నారు. అధికారం కోసం కాకుండా కూటమి ప్రభుత్వం ప్రజల కోసం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిందన్నారు. సంపదను సృష్టించి పేదవాడికి పంచడమే కాకుండా, ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అందరికీ అమలు చేస్తారని తెలిపారు. పవన్ కల్యాణ్‌ను అంత పెద్ద స్థాయిలో చూసి ఓర్వలేక ఎప్పుడూ తన జాతి అంటూ మాట్లాడే పద్మనాభరెడ్డి, వైసీపీ నాయకులు అలా మాట్లాడి ఉంటారని ప్రజలు అనుకుంటున్నారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ.4000 వేలు చేశార ని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి రూ.2000 పింఛన్‌ను రూ.3000 చేస్తానని వాయిదా పద్ధతిని అమలు చేసినప్పుడు ఎందుకు లేఖ రాయలేదో పద్మనాభరెడ్డి చెప్పాలని బుద్దా నిలదీశారు.

ఈపీఎస్-95 పెన్షనర్లకు న్యాయం చేయండి

» కేంద్ర మంత్రులు నిర్మల, మాండవీయకు షర్మిల లేఖ

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల కిందట సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈపీఎస్-95 పెన్షనర్లకు న్యాయం చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, మన్‌సుఖ్ మాండవీయకు శుక్రవారం వేర్వేరుగా లేఖలు రాశారు. ఈపీఎస్-95 పింఛనుదారులకు కేంద్రం న్యాయం చేయకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించినా ఇప్పటి దాకా న్యాయం జరగకపోవడంతో పింఛనుదారులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమాన్ని మోదీ విస్మరించారని విమర్శించారు.

ఆర్టీజీఎస్ పనితీరు భేష్

» మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ల బృందం కితాబు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) పనితీరు అద్భుతమని మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ల బృందం కితాబునిచ్చింది. ప్రభుత్వ రంగంలో ఆర్టీజీఎస్ వంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థ ఉండటం ప్రశంసనీయమని పేర్కొంది. వెలగపూడి సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో ఉన్న ఆర్టీజీఎస్ విభాగాన్ని మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీళినాథన్ కామకోటి నేతృత్వంలోని బృందం శుక్రవారం పరిశీలించింది. ఐఐటీ బృందానికి సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ఆర్టీజీఎస్ సీఈవో దినేశ్‌కుమార్ స్వాగతం పలికారు. ఆర్టీజీఎస్ పనితీరును ఆ బృందానికి ప్రద్యుమ్న వివరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఫైబర్‌నెట్‌ను విస్తరిస్తాం: జీవీ రెడ్డి

» ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం



ఫైబర్‌నెట్ చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు చేపడుతున్న జీవీ రెడ్డి, పక్కన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు ఫైబర్‌నెట్ సేవలను విస్తరిస్తామని ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ జీవీ రెడ్డి చెప్పారు. ఫైబర్‌నెట్ కనెక్షన్లను ప్రస్తుతం ఉన్న 6 లక్షల నుంచి 50 లక్షలు పెంచుతామని ప్రకటించారు. ఫైబర్‌నెట్ చైర్మన్‌గా జీవీరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన సాంకేతిక సేవలను అందిస్తూ ప్రజలకు చేరువవుతామని, ప్రైవేట్ నెట్‌వర్క్ ప్రొవైడర్లతో పోటీ పడుతూ సేవలందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఫైబర్‌నెట్ కనెక్షన్లు ఒక్కసారిగా పడిపోయాయని, గత ప్రభుత్వంలో జరిగిన దానిపై ఆధారాలతో సహా త్వరలో మాట్లాడతానని తెలిపారు. తనను చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరికి, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి పాల్గొన్నారు.

పరిపూర్ణంగా పోలవరం!

(మొదటి పేజీ తరువాయి)

భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలకు నిధులు కేటాయించేలా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి సమ్మతి కోరేందుకు ప్రయత్నించాలని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఏటా కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ఇస్తున్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను సంపూర్ణంగా ఎత్తివేసేలా కేంద్రంపై ఒత్తిడి చేయాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల కాంటూరులో నిర్మించేందుకు గత జగన్ ప్రభుత్వం అంగీకరించింది. దీనివల్ల 115 టీఎంసీలను మాత్రమే నిల్వ చేసే అవకాశం ఉంది. దీంతో పూర్తి స్థాయిలో ప్రాజెక్టును నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. పోలవరం సహా ఇతర ప్రాధాన్య ప్రాజెక్టులపై ఈ నెల ఐదో తేదీన వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, పోలవరం ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ రామ్‌సుందర్ రెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వర రావు, కృష్ణా డెల్టా, పోలవరం, గోదావరి డెల్టా, ఒంగోలు ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశం మినిట్స్‌ను శుక్రవారం విడుదల చేశారు.

పోలవరం ప్రాజెక్టును 2027 మే నాటికి పూర్తి చేసేందుకు వీలుగా అత్యంత కీలకమైన కొత్త డయాఫ్రమ్ వాల్‌ను పాతవాల్‌కు సమాంతరంగా నిర్మిస్తున్నందున.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్‌ఎఫ్) నిర్మాణాన్ని ఎప్పటి నుంచి ప్రారంభించాలన్న విషయంపై కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి స్పష్టత కోరాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాలాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా డయాఫ్రమ్ వాల్‌తో సమాంతరంగా ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్‌ను నిర్మించుకోవచ్చా లేదా అనే సంశయాలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డయాఫ్రమ్ వాల్‌తో సమాంతరంగా ఈసీఆర్‌ఎఫ్ నిర్మించేందుకు కేంద్ర జల సంఘం ఆమోదం తెలిపితే అందుకు సంబంధించి పూర్తి ఆదేశాలను తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. డయాఫ్రమ్ వాల్ ఎంత పొడవు మేర నిర్మించాక ఈసీఆర్‌ఎఫ్ పనులు చేపట్టాలో వెల్లడించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈసీఆర్‌ఎఫ్ పనులు ప్రారంభించాలంటే ప్రధాన డ్యామ్ వద్ద గోదావరి జలాల నిల్వ ఎంత మేరకు ఉంచాలో కూడా కేంద్ర జల సంఘం నుంచి స్పష్టత కోరాలని సూచించారు. ఈసీఆర్‌ఎఫ్‌ను 30 మీటర్ల ఎత్తులో నిర్మించేంత వరకూ నీటిని నిల్వ చేయొచ్చా లేదా అనే అంశంపైనా కేంద్ర జల సంఘం నుంచి స్పష్టత తీసుకోవాలని సీఎం సూచించారు.

రక్షణ గోడల నిర్మాణానికి టెండర్లు

వరద జలాల రక్షణ గోడల నిర్మాణ పనుల కోసం టెండర్లను పిలవాలని జల వనరుల శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎడమ ప్రధాన కాలువ పనులను షెడ్యూల్ మేరకు పూర్తి చేయాలని సూచించారు. 41.15 మీటర్ల కాంటూరు దాకా భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సహాయ పునరావాస కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు అధికారులతో ప్యానల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

చకచకా పనులు

ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణానికి అవసరమైన రాళ్లు, ఇతర మెటీరియల్‌ను సేకరించేందుకు వీలుగా స్పిల్ చానల్‌కు కుడివైపున ఉన్న కొండను తవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యేందుకు వీలుగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని స్పష్టం చేశారు. పోలవరం కుడి ప్రధాన కాలువను విస్తరించేందుకు తగిన ఆప్షన్లను పరిశీలించాలని సూచించారు. 2027 మే నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల వేగాన్ని పెంచుతూనే చింతలపూడి, గోదావరి-పెన్నా అనుసంధానంపైనా దృష్టిసారించాలన్నారు. అలాగే రెండేళ్లలో రూ.2,211 కోట్లతో పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పనులను పూర్తి చేయాలని జల వనరుల శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు.

పోలీసు స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు..

» స్థాయీ నివేదిక ఇవ్వాలని సర్కారుకు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీసు స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుపై స్థాయీ నివేదిక (స్టేటస్ రిపోర్ట్) సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని పోలీసు స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు.. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని పోలీసు స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జులై 15న ధర్మాసనం ఆదేశాలిచ్చిన్న విషయాన్ని గుర్తు చేసింది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని స్పష్టం చేసింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాకపోవడంతో పిటిషనర్ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.

చిన్నారుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి: బుద్ధప్రసాద్

» ఘనంగా వీవీఐటీ బాలోత్సవ్ ప్రారంభం



బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పక్కన వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్-2024 గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభమైంది. 13 వేల మందికి పైగా పోటీదారులు పాల్గొనే ఈ వేడుకలు... 20 అంశాలు 61 విభాగాల్లో 3 రోజులపాటు 30 వేదికలపై జరగనున్నాయి. వేడుకలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నం వీవీఐటీ బాలోత్సవం అని కొనియాడారు. చిన్నారులకు కళలపట్ల సరియైన ప్రోత్సాహం అందించి ముందుకు తీసుకుపోవాలన్నారు. తెలుగుజాతికి ప్రత్యేక కళాసాంప్రదాయాలు ఉన్నాయని వాటిని మనం ప్రోత్సహించాలన్నారు. భాషను గౌరవించుకోవాలి, నేర్చుకోవాలి, మాట్లాడాలని చిన్నారులకు సూచించారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం వైపు పయనించాలని అన్నారు. విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అప్పుడే పరిపూర్ణమైన విద్యార్థిగా ఎదుగుతారని అన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారులు ఆనందంగా ఉంటే అందరం ఆనందంగా ఉంటామని అన్నారు.

యురేనియం తవ్వకాలకు బ్రేక్

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

కర్నూలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల అటవీ భూముల్లో యురేనియం నిక్షేపాల అంచనా కోసం 68 బోర్ల తవ్వకాల ప్రక్రియను ఆపేయాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌ను ఆదేశించింది. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా కప్పట్రాళ్ల సహా 15 గ్రామాల ప్రజలు కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఏ చర్యలు తీసుకోబోమని.. తవ్వకాల ప్రక్రియను ఆపేయాలని సీఎం చంద్రబాబు మంగళవారం అధికారులను ఆదేశించారు.

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని ఫాలో అవ్వండి @SCRailwayIndia అనుసరించండి
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

ఇ-టెండరు ప్రకటన నం.GEM/2024/B/5600576

PUB/1140

దిగువ పనుల కొరకు దిగువ సంతకందారు ద్వారా కాంట్రాక్టర్ల నుండి **06.12.2024**న 17.00 గం.వరకు ఇ-టెండర్లు కోరబడుతున్నవి.

క్ర.సం.01 టెండరు పేరు: GNT డివిజన్ - మూడు సంవత్సరాల కాలానికి SAP, NDKD, MRGA & CTYL TRD డిపోల కొరకు 6.0 టన్నుల కనీస సామర్థ్యం గల కేరియర్‌తో హెవీ డ్యూటీ లారీల అద్దె. టెండరు నిర్దేశ నం: GEM/2024/B/5600576 తేది: 13.11.2024. సుమారు విలువ: రూ.1,54,62,720/-, బయానా: రూ.2,27,400/-, టెండరు ఫారం ధర (వాపసు రానిది) రూ. : లేదు.

ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం: 06.12.2024న 17.00 గం.వరకు. ఏదేని సవివరమైన సమాచారం కొరకు 13.11.2024న 17.00 గం.నుండి 06.12.2024లకు లేదా ఆలోగా వెబ్‌సైట్ www.gem.gov.in కు లాగాన్ కాగలరు. ఏదేని తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్, గుంటూరు

ఇ-టెండరు ప్రకటన నం.ELS/BZA-ELS-BZAeTN-19-2024-25 తేది.13.11.2024

PUB/1141

భారత రాష్ట్రపతి తరపున, దిగువ సంతకందారు **05.12.2024**న **15.00** గం.ల వరకు దిగువ పని కొరకు ఇ-టెండర్‌ను కోరుచున్నారు.

క్ర.సం.1 టెండరు నం.: B/E.221/TRS/RC/522 ఇ-టెండరు No.ELS-BZA-eTN-19-2024-25, తేది.13.11.2024 పని పేరు విజయవాడ ఎలక్ట్రిక్ లోకోషెడ్ వద్ద రెండు (02) సంవత్సరాల కాలానికి బి.జి ఎలక్ట్రిక్ లోకో మోటివ్స్ యొక్క 5400 కెవిఎ లోకో మొయిన్ ట్రాన్స్‌ఫార్మర్ (కాపర్ వైండింగ్) యొక్క రిపేర్, రీవైండింగ్, రీకండిషనింగ్. పరిమాణం - 04 నం.లు. టెండరు విలువ: రూ.65,77,119.52/- (GST కలుపుకొని) బయానా (బిడ్ సెక్యూరిటీ): రూ.1,31,600.00/- టెండరు డాక్యుమెంట్ ధర: రూ. 0, పూర్తి చేయు కాలం : 24 నెలలు, టెండరు ముగింపు తేది & సమయం: 05.12.2024న 15.00 గం.లకు

1) కాగోరు టెండరరుదారులు ఏదైనా టెండర్ కొరకు ఏవైనా మార్పులు/సవరణలు గమనించడానికి టెండర్ ముగింపు తేదికి ముందు వెబ్‌సైట్ www.ireps.gov.in ను సందర్శించాలని సూచించడమైనది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS) ELS, విజయవాడ

టెండరు నం: GTL-EM-29&30-2024-25, తేది: 13.11.2024

PUB/1142

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్‌లను కోరుచున్నారు

టెండరు నం: GTL-EM-29- 2024-25. పని పేరు: GTL Divn: TPTY:- 2 సంవత్సరాల కాలానికి పవర్ కార్లలో M/s కమిన్స్ 500 KVA 750V DG సెట్ల యొక్క సమగ్ర వార్షిక నిర్వహణ మరియు ఎస్కార్టింగ్ EOG/HOG పవర్ కార్ల యొక్క బెటర్‌మెంట్. సుమారు విలువ: రూ.9,83,40,669.89/-, ముగింపు తేది & సమయం: 02.12.2024న 15.00 గం.లకు

టెండరు నం: GTL-EM-30-2024-25. పని పేరు: GTL Divn: TPTY:- 2 సంవత్సరాల కాలానికి పవర్ కార్లలో M/s KOEL 500 KVA DG సెట్ల యొక్క సమగ్ర వార్షిక నిర్వహణ మరియు ఎస్కార్టింగ్ EOG/HOG పవర్ కార్ల యొక్క బెటర్‌మెంట్. సుమారు విలువ: రూ.4,76,91,634.72/-, ముగింపు తేది & సమయం: 02.12.2024న 15.00 గం.లకు

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. టెండరుకు ఏదైనా సవరణ ఉంటే అది ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరు డాక్యుమెంట్‌ను టెండరుదారులు ఉచితంగా http://www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
గమనిక: ఇ-టెండరులో పాల్గొనుటకు/బిడ్ వేయుటకు టెండరుదారు చెల్లుబాటులో కలిగిన డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగియుండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (M), గుంతకల్

టెండరు నం: GTL-EM-32-2024-25, తేది: 13.11.2024

PUB/1143

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్‌లను కోరుచున్నారు

టెండరు నం: GTL-EM-32-2024-25. పని పేరు: గుంతకల్ డివిజన్-3సంవత్సరాల కాలానికి గుంతకల్ డివిజన్‌పై పంపుల కొరకు వార్షిక మరమ్మత్తు కాంట్రాక్టు. సుమారు విలువ: రూ.39,94,756.89/-, ముగింపు తేది & సమయం: 05.12.2024న 15.00 గం.లకు

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. టెండరుకు ఏదైనా సవరణ ఉంటే అది ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరు డాక్యుమెంట్‌ను టెండరుదారులు ఉచితంగా http://www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
గమనిక: ఈ ఇ-టెండరులో పాల్గొనుటకు/బిడ్ వేయుటకు టెండరుదారు చెల్లుబాటులో కలిగిన డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగియుండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (M), గుంతకల్

టెండరు ప్రకటన నం. 15-Mech-FIAT-TPTY-24-25, తేది: 12.11.2024

PUB/1144

భారత రాష్ట్రపతి తరఫున, చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి, దక్షిణ మధ్య రైల్వే వారు దిగువ పని కొరకు పేరొందిన కాంట్రాక్టర్ల నుండి ఐఆర్‌ఇపిఎస్ ద్వారా బహిరంగ టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.01 టెండరు నం: టెండరు ప్రకటన నం.15-Mech-FIAT-TPTY-24-25 తేది: 12.11.2024, పని వివరణ: తిరుపతి క్యారేజ్ రిపేర్ షాప్ వద్ద వివిధ షెడ్యూళ్లలో అటెండ్ అయ్యే సమయానికి "ఎల్‌హెచ్‌బి కోచ్‌లలో బోగి మరియు కోచ్ మధ్యన కనెక్షన్‌ల యొక్క స్ట్రిప్పింగ్ & FIAT బోగీల యొక్క స్ట్రిప్పింగ్ క్లీనింగ్ మరియు పెయింటింగ్" అంచనా విలువ: రూ.24,08,317.68 (రూపాయలు ఇరవై నాలుగు లక్షల ఎనిమిది వేల మూడు వందల పదిహేడు మరియు అరవై ఎనిమిది పైసలు మాత్రమే). బిడ్ సెక్యూరిటీ: రూ.48,200/-, (రూపాయలు నలభై ఎనిమిది వేల రెండు వందలు మాత్రమే) టెండరు ఫారం ధర: రూ. 0 (దిగువ గమనిక :1ని చూడగలరు) పూర్తి చేయాల్సిన కాలం: పని ప్రారంభ తేదీ నుండి 14 నెలలు.

గమనిక: 1. జిసిసి 2022 లోని భాగం-1, పేరా నం.3 ప్రకారం టెండరుదారులందరికీ ఇ-టెండరు ఫారాలు ఉచితంగా జారీ చేయబడతాయి. అందువలన, టెండరు డాక్యుమెంట్ ధర టెండరు డాక్యుమెంట్‌లో పేర్కొనబడలేదు. క్ర.సం.01 వివరణ: టెండరు బాక్స్ మూసివేత సమయం: 11.00 గం.లకు. తేది: 04.12.2024.

A1454 — చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్, CRS, తిరుపతి.

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

ANDHRA PRADESH POWER DEVELOPMENT COMPANY LIMITED

E-PROCUREMENT NOTIFICATION

APPDCL invites Tenders for the following supplies at SDSTPS through APGENCO e-procurement platform.

1.	610001724	Supply of Caustic Soda Lye
2.	610001733	Supply of LT Power and Control Cables.

For Further details, please visit: www.apgenco.gov.in OR https://etender.apgenco.gov.in/

Sd/-
CHIEF GENERAL MANAGER

Ro.No. 3302PP/CL/ADVT/1/1/2021-22, Date- 15.11.2024

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గ్యాస్‌చాంబర్

గాలి నాణ్యత ముప్పైఐదున్న వయనాడ్‌నుంచి గ్యాస్‌చాంబర్ లాగా ఉన్న ఢిల్లీలో ఇప్పుడే అడుగుపెట్టానంటూ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ ట్వీట్ చేశారు. అందులో బాధ ఉన్నదో, బాదుడు ఉన్నదో తెలియదు గానీ, ఢిల్లీకాలుష్యం ఉచ్ఛస్థితికి చేరి అందరినీ భయపెడుతోంది. పెద్దలు బయటకు రావద్దని, పిల్లలు స్కూలుకుపోవద్దని, టీచర్లు ఆన్‌లైన్‌లోనే పాఠాలు చెప్పాలని ఢిల్లీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రతీ ఏటా విద్యాసంస్థలకు సమ్మర్ హాలిడేస్ లాగా పొల్యూషన్ హాలిడేస్ కూడా ముందుగానే క్యాలండర్‌లో నిర్ణయించాల్సిన కాలం సమీపిస్తున్నదేమో. గ్రాప్–3 నిబంధనలను అమలులోకి తెచ్చి భవన నిర్మాణాలనుంచి వాహన వినియోగం వరకూ సమస్తమూ నియంత్రించే ప్రయత్నం సాగుతోంది. మార్నింగ్ వాక్ మానేసి చాలా రోజులైందనో, ఎదురుగా నిలబడినా తాజ్‌మహల్ కనిపించడం లేదనో సుప్రీంకోర్టు నుంచి సామాన్యుడి వరకూ బాధపడుతున్నారు. ఢిల్లీలో దిగాల్సిన విమానాలు మరెక్కడో నేలవాలుతున్నాయి, దారికనిపించక రైళ్ళు రాజధానికి ఆలస్యంగా చేరుతున్నాయి. దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతున్నామని చెబుతున్న పాలకులు, గాలినాణ్యత అథమస్థాయికి చేరి రికార్డులు రాస్తున్న రాజధానిని మాత్రం దాని ఖర్మానికి వదిలేశారు.

ఢిల్లీలో చాలాప్రాంతాలవారికి సరిగా ఊపిరి అందడంలేదు, కళ్ళు, ముక్కు మండిపోతూ, తీవ్రమైన తలనొప్పితో రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదు. నివాసయోగ్యం కాని ప్రాంతంగా ఢిల్లీని ప్రకటించడం ఎంతో దూరంలో లేదని ఓ పర్యావరణ ప్రేమికుడు చేసిన వ్యాఖ్యలో అతిశయోక్తి ఉన్నదేమో కానీ, ఆ ఆగ్రహాన్ని అర్థంచేసుకోవాలి. పలు ప్రాంతాల్లో గాలి నాణ్యతా సూచీ నాలుగువందల యాభై దాటి ఐదువందలను తాకుతూండటం ఆశ్చర్యంతో పాటు బాధ కలిగిస్తుంది. పాలకులు, ప్రజలు కాస్తంత బాధ్యతగా వ్యవహరిస్తే, అత్యున్నతస్థాయి సాంకేతికతలు అందుబాటులో ఉన్న ఈ కాలంలో కాలుష్యంపై యుద్ధం అంతకష్టమేమీ కాదన్నమాట నిజం. ఇదేమీ అకస్మాత్తుగా ముంచుకొచ్చిన కరోనా వంటి రోగం కాదు. ఏటా, మరీముఖ్యంగా శీతాకాలంలో ఢిల్లీ ఇలా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతూనే ఉంది. ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకంటూ కొన్ని వ్యవస్థలు, విధానాలు కూడా ఏర్పడ్డాయి. పొరుగు రాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం, ఢిల్లీలో వాహన, పారిశ్రామిక కాలుష్యాలు కలగలసి పరిస్థితిని తీవ్రం చేస్తున్న విషయం తెలిసిందే. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్‌ప్లాన్ (గ్రాప్) వంటి పద్ధతులున్నా, ప్రాణాల మీదకు వచ్చిన పరిస్థితుల్లో, తాత్కాలిక ఉపశమన చర్యలకే ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

గతంతో పోల్చితే ఢిల్లీ ఇప్పుడు శాశ్వత అత్యయికస్థితిని ఎదుర్కొంటోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏడాదిపాటూ చక్కని సమన్వయం కనుక ఉంటే, ఇలా శీతాకాలం సమీపించగానే ఉక్కిరిబిక్కిరి కావాల్సిన అవసరం ఉండదు. ఢిల్లీని కమ్మేస్తున్న పొగమంచుకు హర్యానా, పంజాబ్‌లలో రైతులు సరిగ్గా ఇదేకాలంలో పంటవ్యర్థాలను తగలబెట్టడం ఓ ముఖ్యకారణమవుతున్నప్పుడు అక్కడ ఏ పార్టీ ప్రభుత్వాలు ఉన్నాయన్నదానితో సంబంధం లేకుండా, ఆ ప్రక్రియను నిలువరించడానికి ఒక నిర్దిష్టమైన ప్రయత్నం జరగాలి. కానీ, కేంద్రంలో, ఢిల్లీలో, హర్యానాలో, పంజాబ్‌లో అధికారంలో ఉన్న పార్టీలను బట్టి రాజకీయయుద్ధం సాగుతూంటుంది. ఒకప్పుడు పంజాబ్‌ను కూడా తప్పుబట్టిన ఆప్, ఇప్పుడు అక్కడ తమ ప్రభుత్వమే ఉన్నందున దానిని వెనకేసుకొస్తూ హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్‌లను విమర్శిస్తున్నది. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతులకు అత్యంత సులువైన, ఆర్థికభారం లేని, ఓ అలవాటైన మార్గం. వారిని దానినుంచి మళ్ళించాలంటే, నిలువరించాలంటే పలురకాలుగా ఆదుకోవాలి. అంతేగానీ, న్యాయస్థానం గట్టిగా విమర్శించగానే పెనాల్టీలు రెట్టింపుచేసి భయపెట్టాలనుకోవడం సరికాదు. వారికి ఆర్థికసాయం, యంత్రసౌకర్యం కల్పించనంతకాలం వ్యర్థాలు ఇలా తగలబడుతూనే ఉంటాయి. వాహన, పారిశ్రామిక కాలుష్యాలు, వివిధ నిర్మాణాలూ కూల్చివేతల విషయంలోనూ ఏడాదిపాటూ వర్తించే సమగ్రమైన విధానం ఉండాలి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వినియోగం విస్తృత ప్రజానీకానికి నిత్యకృత్యం కావాలి. కాలుష్యం ఇంత తీవ్రంగా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వ ఆదేశాలు అత్యంత బలహీనంగా అమలు కావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తాత్కాలిక ఉపశమన చర్యలకంటే నిర్దిష్టమైన దీర్ఘకాలిక విధానాలతోనే ఢిల్లీ కాలుష్యాన్ని కొంతమేరకు నియంత్రించగలం. ఏటా సర్వోన్నతన్యాయస్థానంతో చీవాట్లు తినడం ప్రభుత్వాలకు కూడా అప్రదిష్ఠ.

వెలలేని మాగాణి మహారాష్ట్ర

మహారాష్ట్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది, అభివృద్ధి పరిచింది భారత జాతీయ కాంగ్రెస్. బొంబాయి రాష్ట్రం నుంచి విడివడి, మరాఠా ప్రజల స్వరాష్ట్రంగా మహారాష్ట్ర ఏర్పడిన నాటి (మే 1, 1960) నుంచి ఇప్పటిదాకా (64 సంవత్సరాలుగా) 20 మంది ముఖ్యమంత్రులు (వీరిలో కొందరు ఒకటి కంటే ఎక్కువ పర్యాయాలు ఆ ఉన్నత బాధ్యతలు నిర్వహించారు) మహారాష్ట్రను పరిపాలించారు. వారిలో ఐదుగురు మినహా అందరూ కాంగ్రెస్ పార్టీ నాయకులే (ఒకప్పుడు కాంగ్రెస్ చీలిక పక్షం ఐఎన్‌సి–సోషలిస్ట్‌కు ప్రాతినిధ్యం వహించిన శరద్ పవార్‌ను సైతం కాంగ్రెస్ ముఖ్యమంత్రిగానే నేను పరిగణిస్తున్నాను). కాంగ్రేసేతర ముఖ్యమంత్రులు మనోహర్ జోషి, నారాయణ్ రాణే, దేవేంద్ర ఫడ్నవీస్, ఉద్ధావ్ ఠాక్రే, ఏక్‌నాథ్ షిండే. ఈ 64 ఏళ్లలో కాంగ్రెస్ ప్రత్యర్థి పక్షాలకు చెందిన ఈ ఐదుగురు ముఖ్యమంత్రుల మొత్తం పరిపాలనా కాలం 15 సంవత్సరాల 6 నెలల, 17 రోజులు. మిగతా సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నాడు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

మహారాష్ట్ర శాసనసభకు చివరి ఎన్నికలు నవంబర్ 2019లో జరిగాయి. గత ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు ఆ రాష్ట్ర పరిపాలకులుగా ఉన్నారు. వారిలో ఇద్దరు –దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే– మహాయుతి కూటమిలో ఉన్నారు. ఉద్ధవ్ ఠాక్రే ఎమ్‌వీఏ కూటమిలో ఉన్నారు. భారతీయ జనతా పార్టీ అక్టోబర్ 31, 2014 నుంచి (నవంబర్ 2019, జూన్ 2022 మధ్య రెండు సంవత్సరాల 214 రోజులు మినహా) మహారాష్ట్రలో అధికారంలో ఉన్నది. ఆ మినహాయింపు కాలంలో శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీ భాగస్వాములుగా ఉన్న ఎమ్‌వీఏ కూటమి అధికారంలో ఉన్నది. శివసేన, ఎన్‌సీపీల నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించిన బీజేపీ, ఎమ్‌వీఏ కూటమి ప్రభుత్వాన్ని కూల్చివేసి తన సొంత కూటమి (మహాయుతి) ప్రభుత్వాన్ని గద్దె నెక్కించింది.

నవంబర్ 20, 2024న మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 'వ్యక్తుల మంచితనం వారి ఆస్తికలతో భూస్థాపితమవుతుంది' అన్న షేక్స్పియర్ సత్య వచనం ఈ సందర్భంగా నాకు గుర్తుకు వస్తుంది. నిజమే, గతకాలం వైభవాలకోసం ఎవరూ ఓటువేయరు. మహారాష్ట్ర ఇప్పుడు ఎలా ఉన్నది, ఎక్కడ ఉన్నది, దాని భవిష్యత్తు ఏమిటి? ఆ భవితవ్యం ఎలా ఉండాలి అన్న విషయాలే ప్రస్తుత ఎన్నికలలో జయాపజయాలను నిర్ణయించే అంశాలు.

ఆర్థిక వ్యవస్థకు సంబంధించినంతవరకు పారిశ్రామికీకరణలో మహారాష్ట్రను నెంబర్ 1 రాష్ట్రంగా అభివృద్ధిపరిచింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలే అనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఇప్పుడు ఈ అగ్రగామి రాష్ట్రం 'అభివృద్ధి'కి సంబంధించిన వివిధ ప్రమాణాల విషయంలో అధో స్థానాలకు జారిపోయింది. ఈ క్రింది గణాంకాలే అందుకు సాక్ష్యం. గత రెండు ఆర్థిక సంవత్సరాలలో వివిధ రంగాలు ఎలా ఉన్నాయో చూడండి: (నిర్దిష్ట అంశం ఎదురుగా ఉన్న అంకెలలో మొదటిది 2022–23, రెండో అంకె 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినది) వృద్ధిరేటు 9.4 శాతం, 7.6 శాతం; రెవెన్యూ లోటు: రూ.1,936 కోట్లు, రూ.19,531 కోట్లు; ద్రవ్యలోటు: రూ.67,602 కోట్లు, రూ.1,11,956 కోట్లు; మూలధన వ్యయం: రూ.85,657 కోట్లు, రూ.85,292 కోట్లు; వ్యవసాయ రంగ వృద్ధిరేటు: 4.5 శాతం, 1.9 శాతం; సేవల రంగ పెరుగుదల: 13 శాతం, 8.8 శాతం; రవాణా, వర్తకం, కమ్యూనికేషన్స్ రంగాల పెరుగుదల: 13 శాతం, 6.6 శాతం; నిర్మాణ రంగ వృద్ధిరేటు: 14.5 శాతం, 6.2 శాతం.



ఓటర్ (ఆమె/అతడు) పూర్తిగా ఒక ఆర్థిక జీవి (ఎకనామిక్ బీయింగ్) అయితే, మరే ఇతర అంశాల కంటే మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత సంపద్వంతం చేసే లక్ష్యానికి అగ్ర ప్రాధాన్యమిచ్చి ఆ విద్యుక్త ధర్మ నిర్వహణకు అంకితమయ్యే అభ్యర్థులు, పార్టీలకే ఓటు వేస్తాడు, వేయాలి కూడా. మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అపురూపమైనది. వెలలేని ఆస్తి అది. ఎటువంటి పరిస్థితులలోను దాన్ని అలక్ష్యం చేయకూడదు, కోల్పోకూడదు.

సరే, నిరుద్యోగిత గురించి చెప్పేదేముంది? అది పెచ్చరిల్లుతోంది. యువజనుల నిరుద్యోగిత 10.8 శాతం కాగా మహిళా నిరుద్యోగిత 11.1 శాతం; మహారాష్ట్రలో ఉద్యోగిత చాల వరకు స్వయం ఉపాధే. స్వల్ప సంఖ్యలో ఉన్న ప్రభుత్వోద్యోగాల భర్తీకి ప్రకటనలు వెలువడినప్పుడల్లా వేలు, లక్షల సంఖ్యలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. 18,300 పోలీస్ కానిస్టేబుల్ / డ్రైవర్ ఉద్యోగాలకు, 4,600 తలాఠి (గ్రామీణ ఉద్యోగి) ఉద్యోగాలకు 11 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఉద్యోగాలను సృష్టించే అంతర్జాతీయ కంపెనీలను మహారాష్ట్ర ప్రభుత్వం బాగానే ఆకట్టుకుంటున్నది. తమ కార్యాలయాలు లేదా ఫ్యాక్టరీలను మహారాష్ట్రలో ఏర్పాటు చేసుకునేందుకు ఒప్పందం చేసుకున్న తరువాత, సదరు కంపెనీలు గుజరాత్‌కు తరలిపోయేలా ఢిల్లీ పాలకులు వాటికి నచ్చచెప్పుతున్నారు! టాటా–ఎయిర్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ, వేదాంత–ఫాక్స్‌కామ్ సెమి–కాండక్టర్ ఫ్యాక్టరీ ఉదంతాలే అందుకు ఉదాహరణలు. భారతదేశ వాణిజ్య రాజధానిగా ముంబై ప్రపంచ ప్రసిద్ధమయింది. అయితే ఇప్పుడు ఆ మహానగరానికి ఆ ప్రతిష్ఠ లేకుండా చేసేందుకు 'గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్–టెక్' సిటీని ప్రత్యేక చట్టాలు, అద్వితీయ సదుపాయాలతో పనికట్టుకుని అభివృద్ధి పరుస్తున్నారు.

మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎంత ప్రమాదకర పరిస్థితిలో ఉన్నదో రెండు ఉదాహరణలతో వివరిస్తాను. మహారాష్ట్రలో నాలుగు భిన్న ప్రాంతాలు ఉన్నాయి. అభివృద్ధిలో వాటి మధ్య అసమానత పెరిగిపోతోంది. ముంబై, పూణే, థాణే జిల్లాలు మహా సంపద్వంతమైనవి. నదుర్‌బార్, వాషిమ్, గడ్చిరోలి, యవత్మాల్, హింగోలి, బల్దానా జిల్లాలో పేదరికం తాండవమాడుతోంది. సంపద్వంత జిల్లా నికర జిల్లా దేశియోత్పత్తి (ఎన్‌డీడీపీ), పేద జిల్లాల ఎన్‌డీడీపీ కంటే మూడు రెట్లు ఎక్కువ. తలసరి ఎన్‌డీడీపీలో వ్యత్యాసం 2011–12లో రూ.97,357 నుంచి 2022–23లో రూ.2.4 లక్షలకు పెరిగింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమరీతిలో అభివృద్ధిపరచడంలో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో మరి చెప్పాలా?

మరో ఉదాహరణ రైతుల దుస్థితి. 2023లో మహారాష్ట్రలో 2,851 మంది రైతుల ఆత్మహత్యలు నమోదయ్యాయి. కారణమేమిటి? ఉల్లిపాయలపై కేంద్ర ప్రభుత్వ విధానాన్నే తీసుకోండి. మొదట ఉల్లిపాయల ఎగుమతులను నిషేధించింది. దీనిపై నిరసనలు వెల్లువెత్తడంతో ఆ ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేశారు. అయితే కనీస ఎగుమతి ధరను విధించారు. ఎగుమతి సుంకాన్ని 40 శాతంగా నిర్ణయించారు. పర్యవసానంగా ఉల్లి రైతులు భారీ నష్టాలను చవిచూశారు. అంతర్జాతీయ విపణిలో భారత్ తన వాటాను కోల్పోయింది. ఏటా జూలై నాటికి 15 లక్షల టన్నుల ఉల్లిపాయలు ఎగుమతి చేయడం పరిపాటి. అటువంటిది ఈ ఏడాది 2.6 లక్షల టన్నుల ఉల్లిపాయలే ఎగుమతి అయ్యాయి.

మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దుర్నిర్వహణకు ఇంకా ఎన్నెన్నో ఉదాహరణలు ఇవ్వవచ్చు. డబుల్ –ఇంజిన్ ప్రభుత్వమనేది ఒక డొల్లమాట. ఎందుకని? మొదటి ఇంజిన్ అభివృద్ధి రైలును గుజరాత్‌కు మళ్లిస్తున్నది. రెండో ఇంజిన్ ఆర్థిక వ్యవస్థకు ఒక జడభారంగా పరిణమించింది.

ఓటర్ (ఆమె/అతడు) పూర్తిగా ఒక ఆర్థికజీవి (ఎకనామిక్ బీయింగ్) అయితే, మరే ఇతర అంశాల కంటే మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత సంపద్వంతం చేసే లక్ష్యానికి అగ్ర ప్రాధాన్యమిచ్చి ఆ విద్యుక్త ధర్మ నిర్వహణకు అంకితమయ్యే అభ్యర్థులు, పార్టీలకే ఓటు వేస్తాడు, వేయాలి కూడా. మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అపురూపమైనది. వెలలేని ఆస్తి అది. ఎటువంటి పరిస్థితులలోను దాన్ని అలక్ష్యం చేయకూడదు, కోల్పోకూడదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

గాంధీజీ గ్రామీణ జీవనం

సరిగ్గా నూట ఇరవై సంవత్సరాల క్రితం మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ దక్షిణాఫ్రికాలోని డర్బన్ నౌకాశ్రయానికి 14 మైళ్ల దూరంలో దాదాపు 100 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. ఈ భూస్వామ్యానికి పూర్వం ఆయన తన మొదటి మూడున్నర దశాబ్దాల జీవితమంతా పూర్తిగా పట్టణ ప్రదేశాలలోనే నివసించారు : పోర్‌బందర్, రాజ్‌కోట్ లాంటి చిన్న పట్టణాలలోను, డర్బన్, జోహన్నెస్‌బర్గ్ లాంటి పెద్ద పట్టణాలలోను, లండన్, బొంబాయి లాంటి మహానగరాలలోను మాత్రమే ఆయన ఉన్నారు. ఈ పట్టణ, నగర వాసాలలో గాంధీ కార్యకలాపాలు మేధో శ్రమ– వివేచన, విలేఖనం, (న్యాయస్థానంలో తన కక్షిదారుల తరఫున) వాదనకే పరిమితమయ్యాయి. హెన్రీ పోలక్ అనే స్నేహితుడు తనకు కానుకగా ఇచ్చిన జాన్ రస్కిన్ పుస్తకం 'Unto This Last' పఠనం ఆయన జీవితాన్ని ఒక మేలు మలుపు తిప్పింది. రస్కిన్ భావాల స్ఫూర్తితో, దైనందిన జీవితంలో కనీసం కొంత సమయాన్ని తన చేతులతో పనిచేసే మట్టి మనిషిగా జీవించాలని గాంధీ నిర్ణయించుకున్నారు. 'ఇండియన్ ఒపీనియన్' అనే బహుభాషా వార్తా పత్రికను కూడా ఆయన ప్రారంభించారు. దక్షిణాఫ్రికాలో స్థిరపడిన భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, భయాందోళనలను వ్యక్తం చేసేందుకు ఉద్దేశించిన పత్రిక అది.



గాంధీ తాను కొనుగోలు చేసిన స్థిరాస్తికి, చేరువలోనే ఉన్న రైల్వే స్టేషన్ పేరిట ఫీనిక్స్ ఫామ్ అని పేరు పెట్టారు. ఫీనిక్స్ ఫామ్ 120వ వార్షికోత్సవం సందర్భంగా దక్షిణాఫ్రికా విదుషీమణి ఉమా ధూపేలియా –మెస్త్రియె ఆ సెటిల్‌మెంట్ (కొత్తగా ఏర్పడిన గ్రామం) చరిత్ర (Gandhi's African Legacy: Phoenix Settlement 1904 to 2024)ను ప్రచురించారు. ఫీనిక్స్ ఫామ్ మొదటి పదేళ్ల (దక్షిణాఫ్రికాలో గాంధీ నివసించిన చివరి పది సంవత్సరాలు) చరిత్ర గురించి విపుల కథనంతో ఆ పుస్తకం ప్రారంభమవుతుంది. ఆ తరువాత తొమ్మిది అధ్యాయాలలో, గాంధీ శాశ్వతంగా భారత్‌కు తిరిగి వచ్చిన తరువాత ఫీనిక్స్ చరిత్రను తెలియజేసే (ఎంపిక చేసిన) లేఖలను తన వివరణలు, వ్యాఖ్యలతో ఉమా ప్రతిభావంతంగా నివేదించారు. ప్రస్తుతం ఫీనిక్స్ స్థితిగతుల గురించిన భరత వాక్యంతో ఆ ఆసక్తికరమైన పుస్తకం సమాప్తమవుతుంది.

గాంధీ తన మొదటి మూడున్నర దశాబ్దాల జీవితమంతా పూర్తిగా పట్టణ ప్రదేశాలలోనే నివసించారు. పట్టణ వాసంలో గాంధీ కార్యకలాపాలు మేధో శ్రమ– వివేచన, విలేఖనం, (న్యాయస్థానంలో తన కక్షిదారుల తరఫున) వాదనకే పరిమితమయ్యాయి. జాన్ రస్కిన్ పుస్తకం 'Unto This Last' స్ఫూర్తితో దైనందిన జీవితంలో కనీసం కొంత సమయాన్ని తన చేతులతో పనిచేసే మట్టి మనిషిగా జీవించాలని గాంధీ నిర్ణయించుకున్నారు.

జోహన్నెస్‌బర్గ్‌లోని ఒక శాకాహార భోజనశాలలో గాంధీకి పరిచయమై, ఆ తరువాత ఆప్తమిత్రుడు అయిన ఆల్బెర్ట్ వెస్ట్ అనే ఒక ఇంగ్లీష్ జాతీయుడి గురించి ఉమ సముచిత ప్రాధాన్యంతో రాశారు. ఇండియన్ ఒపీనియన్ నిర్వహణలోను, ఫీనిక్స్ సెటిల్‌మెంట్‌ను ఒక స్వతస్సిద్ధ, సమకాలీన సామాజిక సమూహంగా రూపొందించడంలో కీలక పాత్ర వహించారు. దైనందిన కార్యకలాపాలలో ఒకటిగా గాంధీ ప్రవేశపెట్టిన సర్వ మత ప్రార్థనల గురించి వెస్ట్ ఇలా వ్యాఖ్యానించారు: 'హిందువులు, ముస్లింలు, పార్సీలు, క్రైస్తవులు భక్తిగీతాలు ఆలపించి, తమ మత గ్రంథాలలోని ఉపదేశాలను వివిధ భాషలలో చదివేవారు. ఇది సార్వజనీన సామూహిక ఆరాధనకు అద్వితీయ ఉదాహరణ. ఈ ప్రార్థనా సమావేశంలో ఏ నిర్దిష్ట మతానికి ఇతర మతాల కంటే కించిత్ ఎక్కువ ప్రాధాన్యం లభించదు. సత్యం, ప్రేమను భగవంతుని సర్వవ్యాపక గుణ విశేషాలుగా అంగీకరించడమే ఆ ఉమ్మడి ప్రార్థనలు'.

1914లో గాంధీ భారత్‌కు తిరిగి వచ్చేసిన తరువాత ఫీనిక్స్ ఆశ్రమాన్ని కొనసాగించేందుకు వెస్ట్ చాలా పాటు పడ్డారు. ఫీనిక్స్ పునరుద్ధరణకై 1917లో గాంధీ తన రెండవ కుమారుడు మణిలాల్‌ను దక్షిణాఫ్రికాకు పంపించారు. ఉమా ధూపేలియా ఇలా రాశారు: 'జీవితంలో ఒక సమున్నత లక్ష్యాన్ని కనుగొనేందుకు, దాని పరిపూర్తికి అంకితమయ్యేందుకు ఫీనిక్స్ మణిలాల్‌కు ఒక అవకాశాన్ని కల్పించింది'. 1919 డిసెంబర్‌లో మణిలాల్ తన తండ్రికి రాసిన ఒక లేఖలో ఇలా పేర్కొన్నారు: 'ఇప్పుడు భారత్‌కు రావడం ఒక సౌఖ్యదాయక విషయంగా నేను భావించడం లేదు. ఇక్కడే నేను మరింత మనశ్శాంతితో పనిచేసుకుంటూ జీవించదలుచుకున్నాను. కనుక ఇక్కడే ఉండిపోయి ఇండియన్ ఒపీనియన్‌ను నిర్వహిస్తూ అధ్యయన వ్యాపకాలలో మునిగిపోవాలని నిర్ణయించుకున్నాను. అయితే నేను భారత్‌కు రావాలని మీరు అభిలషిస్తే దాన్ని నెరవేర్చేందుకు సంసిద్ధంగా ఉన్నాను'.

ఫీనిక్స్ ఫామ్ బాధ్యతలు చేపట్టిన తరువాత దాని నిర్వహణ వ్యయాలకు తోడ్పడేందుకు గాను చెరకు, మొక్కజొన్న పంటల సాగును మణిలాల్ ప్రారంభించారు. మహారాష్ట్రలోని అకోలాకు చెందిన సుశీలా మష్రువాలాను 1927లో మణిలాల్ వివాహం చేసుకున్నారు. వారిది ఆదర్శ దాంపత్యం. ఇరువురూ ఉత్తమ జీవన సహచరులు. ఫీనిక్స్ ఫామ్ నిర్వహణలోను, ఇండియన్ ఒపీనియన్‌ను నడపడంలోను సుశీల కీలకపాత్ర వహించారు. 'సతీమణిగా, మాతృమూర్తిగా, పత్రిక ముద్రాపకురాలుగా ఆమె తన పాత్రలను ఎంతో నైపుణ్యంతో సమతుల్యపరిచారు' అని ఉమా వ్యాఖ్యానించారు. మణిలాల్–సుశీల మనవరాలే ఉమా ధూపేలియా. అయితే ఈ పుస్తకంలోను, వేరే రచనలలోను ఆమె వ్యాఖ్యలు, అభిప్రాయాలు కుటుంబ ప్రేమను కాకుండా వృత్తి నిబద్ధ చరిత్రకారుడి దృక్కోణాన్నే ప్రతిబింబిస్తాయి.

గాంధీ సంపాదకత్వంలో వలే, ఆయన కుమారుడి సారథ్యంలో కూడా ఇండియన్ ఒపీనియన్ దక్షిణాఫ్రికా భారతీయుల వ్యవహారాలు, భారత్‌లో ప్రధాన పరిణామాలకు సంబంధించిన వార్తలు, వ్యాఖ్యల కలగలుపుగా ఉండేది. అయితే ముద్రణా వ్యయాలు పెరిగిపోవడం, చందాదారులు తగ్గిపోవడంతో పత్రికను కొనసాగించడం తలకు మించిన భారమై పోయింది. 1938లో మణిలాల్ తన స్నేహితుడు బాబర్ చావ్డాకు ఇలా రాశారు: 'ఇండియన్ ఒపీనియన్'ను కొనసాగించేందుకుకై తలా 25 పౌండ్ల చొప్పున ఆర్థిక సహాయమందించాలని 200 మంది దక్షిణాఫ్రికా భారతీయులకు విజ్ఞప్తి చేశాను. ఈ సహాయమందకపోతే ఇండియన్ ఒపీనియన్ కొనసాగవలసిన అవసరం లేదని నేను భావించకతప్పదు. అదే జరిగితే పత్రికను మూసివేసి భారత్‌కు తిరిగి వెళ్లిపోతాను'. సెప్టెంబర్ 1942లో క్విట్ ఇండియా ఉద్యమం, బ్రిటిష్ పాలకులు దానిని అణచివేసిన తీరుతెన్నులపై ఒక ప్రత్యేక సంచికను ప్రచురించడానికి మణిలాల్ పూనుకున్నారు. పత్రిక కవర్‌పై సముచిత బొమ్మను సృజించగల చిత్రకారుడిని సూచించమని చావ్డాను ఆయన అడిగారు. బొమ్మ ఎలా ఉండాలో కూడా మణిలాల్ సూచించారు: చిత్ర నేపథ్యంలో భారతదేశ రేఖాపటం ఉండాలి. దానిలో భారతమాత శృంఖలాలలో ఉన్నట్టు చూపించాలి. కుడివైపు బ్రిటన్ రేఖాపటం ఉండాలి. దాని నుంచి ప్రజ్వరిల్లుతున్న మంటలు భారత్‌ను చుట్టుముట్టుతున్నట్టు చూపించాలి. ఆ మంటలపై సామ్రాజ్యవాదం అని రాసి ఉండాలి. ఆకాశం నుంచి ఐదుగురు కీర్తిశేషులు అయిన దేశభక్తులు బాల్‌గంగాధర్ తిలక్, దాదాభాయి నౌరోజీ, రవీంద్రనాథ్ టాగోర్, అబ్బాస్ త్యాబ్జీ, మహదేవ్ దేశాయిలు ప్రస్తుతం కారాగారంలో ఉన్న దేశభక్తులపై పువ్వులు జల్లుతుండడాన్ని దృశ్యమానం చేయాలి'.



■ రామచంద్ర గుహ

గతానుగతం

గాంధీ నెలకొల్పిన ఐదు ఆశ్రమాలలో ఫీనిక్స్ ఫామ్ మొదటిది. ఆ తరువాత దక్షిణాఫ్రికాలోనే టాల్‌స్టాయ్ ఫామ్; భారత్‌కు తిరిగివచ్చిన తరువాత అహ్మదాబాద్‌లో కొచ్రాబ్, సబర్మతి; మహారాష్ట్రలోని వార్ధా సమీపంలో సేవాగ్రామ్ ఆశ్రమాన్ని ఆయన వ్యవస్థాపించారు. ఫీనిక్స్ ఫామ్ మిగతా అన్ని ఆశ్రమాలకు ఒరవడి అయింది.

1948లో దక్షిణాఫ్రికాలో నేషనల్ పార్టీ అధికారంలోకి వచ్చింది. జాతి వివక్ష విధానాన్ని మరింతగా ప్రోత్సహించింది, కఠినంగా అమలుపరిచింది. ఆగస్టు 1951లో మణిలాల్ జాతి వివక్షను తీవ్రంగా ఆక్షేపిస్తూ ప్రధానమంత్రి డి.ఎఫ్. మలాన్‌కు ఇలా రాశారు: 'మీ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి చర్యా యూరోపియనేతరులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. యూరోపియనేతరుల పట్ల మీ ప్రభుత్వ విద్వేషానికి చిహ్నాలుగా ఆ చర్యలు కనిపిస్తున్నాయి.. అపార్థీడ్ (జాతి వివక్ష) విధానం ఈ దేశ యూరోపియనేతర పౌరుల ఆర్థిక, రాజకీయ హక్కులను కాలరాచివేయడమే కాకుండా వారు భగవంతుడి సంతానంగా తమ వ్యక్తిత్వాన్ని, ఆధ్యాత్మిక అస్తిత్వాన్ని పరిపూర్ణంగా వికసింప చేసుకునే అవకాశాలను నిరాకరిస్తుంది. రాజకీయాలలోకి రాక ముందు క్రైస్తవ మతాచార్యుడుగా ఉన్న మీరు భగవంతుని బోధనల నేపథ్యంలో మీ ప్రభుత్వ విధానాలను పునః పరిశీలించి సముచిత నిర్ణయం తీసుకోవాలి'. రెండు సంవత్సరాల అనంతరం జాతి వివక్షకు వ్యతిరేకంగా ఒక పౌర ప్రతిఘటన ఉద్యమంలో పాల్గొన్నందుకు అరెస్టయిన మణిలాల్ నెల రోజులకు పైగా కారాగారవాసం చేశారు.

మణిలాల్ 1956లో మరణించారు. సుశీల మరో ఐదు సంవత్సరాల పాటు ఇండియన్ ఒపీనియన్‌ను కొనసాగించి ఆగస్టు 1961లో ఆ పత్రిక ప్రచురణను శాశ్వతంగా నిలిపివేశారు. తదుపరి సంవత్సరాలలో ఆమె కుమార్తె ఎలా, అల్లుడు మేవా అత్తగారితో పాటు ఫీనిక్స్ ఫామ్‌లోనే ఉండేవారు. ఈ ఇరువురూ జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీలంగా ఉండేవారు. నిత్యం పోలీసు వేధింపులకు గురవుతుండేవారు. మణిలాల్, సుశీల రాసిన లేఖలలో ఆనాడు దక్షిణాఫ్రికాలోని భారతీయుల వ్యవహారాలలో ప్రధానపాత్ర వహించిన ఉదారవాద రాజనీతిజ్ఞుడు విఎస్ శ్రీనివాసశాస్త్రి, ప్రభవిస్తున్న యువ కమ్యూనిస్టు డాక్టర్ యూసుఫ్ దాదూ గురించి ఆసక్తికరమైన ప్రస్తావనలు ఉన్నాయి. భార్యాభర్తలిరువురు ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించిన ఒక ప్రముఖుడు నవలా రచయిత అలన్ పేటన్. తన స్నేహితుడు మణిలాల్ మరణానంతరం ఫీనిక్స్ ఫామ్ నిర్వహణలో సుశీలకు కీలక సహాయసహకారాలను ఆయన సమకూర్చారు.

1985లో ఫీనిక్స్ ఫామ్ పరిసరాలలో తీవ్ర హింసాకాండ చోటుచేసుకున్నది. పోలీసుల చేతుల్లో ఒక నల్లజాతి ఉద్యమకారుడు మరణించడమే ఆ హింసాకాండకు దారి తీసింది. దీంతో ఫీనిక్స్ సెటిల్‌మెంట్ వాసులు అక్కడి నుంచి వెళ్లిపోవడం ప్రారంభమయింది. ఫీనిక్స్‌లోని గాంధీ గృహం కిటికీలను ధ్వంసం చేశారని, ఆయన జీవితానికి సంబంధించిన ఫోటోలు అన్నిటినీ బయటకు విసిరివేసి వాటిని తొక్కివేసి పూర్తిగా రూపుమాపారని ఒక పత్రికా వార్త వెల్లడించింది. ఒకప్పుడు పాడిపంటలతో, నాగరిక విలువలను ఔదలదాల్చిన సంస్కారవంతులతో వర్థిల్లిన ఫీనిక్స్ ఫామ్ కబ్జాదారుల పాలయింది. ఫీనిక్స్ విధ్వంసం సుశీలను సహజంగానే అమితంగా కృంగదీసింది. 1988లో ఆమె మరణించారు. ఇరవై సంవత్సరాల అనంతరం ఆమె కుమార్తె ఎలా (దక్షిణాఫ్రికా బహుళ జాతుల తొలి పార్లమెంటు సభ్యురాలు) నన్ను తన కారులో ఫీనిక్స్ ఫామ్‌కు తీసుకువెళ్లారు. గాంధీ వ్యవస్థాపించిన వంద ఎకరాలకు పైగా ఫీనిక్స్ ఫామ్ నేను సందర్శించిన నాటికి కేవలం మూడు ఎకరాల స్థిరాస్తిగా మిగిలిపోయి ఉన్నది. దక్షిణాఫ్రికాలో గాంధీ జీవితానికి సంబంధించిన ఫోటోలు, ఇతర వివరాలతో అక్కడ ఒక మ్యూజియం ఉన్నది. ఒకప్పటి వైభవాన్ని కోల్పోయినప్పటికీ ఆ మ్యూజియం ఇప్పటికీ సందర్శకులకు స్ఫూర్తిదాయకంగానే ఉన్నది.

గాంధీ నెలకొల్పిన ఐదు ఆశ్రమాలలో ఫీనిక్స్ ఫామ్ మొదటిది. ఆ తరువాత దక్షిణాఫ్రికాలోనే టాల్‌స్టాయ్ ఫామ్; భారత్‌కు తిరిగివచ్చిన తరువాత అహ్మదాబాద్‌లో కొచ్రాబ్, సబర్మతి; మహారాష్ట్రలోని వార్ధా సమీపంలో సేవాగ్రామ్ ఆశ్రమాన్ని ఆయన వ్యవస్థాపించారు. ఫీనిక్స్ ఫామ్ మిగతా అన్ని ఆశ్రమాలకు ఒరవడి అయింది. సర్వ మతాల, సకల జాతుల, సమస్త కులాల ప్రజల పరస్పర సహజీవనానికి ఆ ఆశ్రమాలు అన్నీ ఆలవాలంగా ఉండేవి. గాంధీ ఆశ్రమాలలో, మేధోశ్రమకు సమున్నత విలువ ఇచ్చినట్టుగానే భౌతిక శ్రమకూ ప్రాముఖ్యత ఉండేది. ఫీనిక్స్ ఆశ్రమంలోనే గాంధీ తన తొలి వార్తాపత్రిక ఇండియన్ ఒపీనియన్‌ను ముద్రించేవారు. గాంధీ ఆశ్రమాలకు ఫీనిక్స్ ఎలా ఒరవడి అయిందో భారత్‌లో ఆయన సమస్త పాత్రికేయ వ్యాసంగాలకు ఇండియన్ ఒపీనియన్ అలా ఒక మార్గదర్శిగా ఉండేది. ఫీనిక్స్ ఆశ్రమం లేనిపక్షంలో మనకు మహాత్ముడు ఉండేవారే కాదు. ఉమా ధూపేలియా తన పుస్తకంలో ఫీనిక్స్ సెటిల్‌మెంట్ సమున్నత చరిత్రకు మళ్లీ ఒక స్ఫూర్తిదాయక సజీవత్వం కల్పించారు.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

నైపుణ్యాలే ఉద్యోగాలకు కీలకం

ప్రపంచ వ్యాప్తంగా 2027 నాటికి 6.9 కోట్ల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని, అదే సమయంలో 8.3 కోట్ల ఉద్యోగాలు మాయమవుతాయని ఈ మధ్య ప్రపంచ ఆర్థిక నివేదిక అంచనా వేసింది. అంటే ప్రత్యేక నైపుణ్యాలు ఉన్నవారికే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నమాట. డిమాండ్‌కి తగిన సంఖ్యలో నిపుణులు దొరక్క అనేక సంస్థలు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు లేకపోలేదు. సాంకేతిక నైపుణ్యం, వ్యక్తిగత కౌశలం మేళవించిన వారు మాత్రమే ఉద్యోగాలు దక్కించుకోగలుగుతున్నారు. వివిధ కంపెనీలు ప్రాంగణ నియామకాల్లో నైపుణ్యానికే పెద్దపీట వేస్తున్నాయి. వీటితో పోలిస్తే విద్యార్థులు పరీక్షల్లో సాధించిన మార్కులు, చేసిన ప్రాజెక్టులు, సిఫారసులను అవి పెద్దగా పరిగణనలోకి తీసుకోవడం లేదు.

దేశవ్యాప్తంగా ఏటా కొత్తగా పట్టాలు పుచ్చుకుని దాదాపు 15 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఉపాధి వేటలో పడుతున్నారు. వీరిలో చాలా మందికి ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు ఉండడం లేదనేది నిజం. భారతీయ యువతలో దాదాపు సగం మందికి వివిధ రంగాలకు అవసరమైన కనీస నైపుణ్యాలు కూడా లేవని యునెస్కో తన నివేదికలో పేర్కొన్నది. భారతదేశ నైపుణ్యాల నివేదిక 2022 సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఇంజినీర్లకు సంబంధించిన జాతీయ ఉపాధి అవకాశాల నివేదిక–2019 అయితే దేశంలో వివిధ సాంకేతిక కోర్సులు పూర్తిచేసిన వారిలో 80 శాతం మంది విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థలో ఏ ఉద్యోగమూ చేయడానికి అర్హులు కారని తేల్చేసింది. ముఖ్యంగా ప్రపంచస్థాయి ఉద్యోగాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన డిజిటల్ నైపుణ్యాలు ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొరవడుతున్నాయని అది విశ్లేషించింది. దీనిని బట్టి ప్రజలకు, ముఖ్యంగా యువతరానికి, ఉన్నత స్థాయి విద్య, నైపుణ్యాలను అందించిన దేశాలు మాత్రమే మానవ వనరులను శక్తివంతమైన మూలధనంగా మలుచుకుని ఆర్థికశక్తిగా ఎదుగుతాయని అర్థమవుతుంది.

జీడీపీ మెరుపులకు సమాంతరంగా జన జీవితాల్లోనూ వెలుగులు నిండాలంటే ఉపాధి సహిత అభివృద్ధి విధానాలను ప్రభుత్వాలు అనుసరించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యలో వృత్తి శిక్షణను అంతర్భాగం చేయాలి. ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విద్యను దేశ యువతకు అందించాలి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపైన ప్రత్యేక దృష్టి పెట్టి యువత వలసలు పోకుండా స్థానికంగానే ఉండి ఆర్థికంగా నిలదొక్కుకునే ఏర్పాటు చేస్తుండడం అభినందనీయం.



ఇండియాలో విభిన్న రంగాల్లో పది కోట్ల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నా వాటిని చేజిక్కించుకోగలిగే నైపుణ్యం ఉన్న యువత కరువైందని అఖిల భారత సాంకేతిక విద్యామండలి గతంలోనే ఆవేదన వ్యక్తపరిచింది. జపాన్, జర్మనీ, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి దేశాలు యాభై శాతానికి పైగా శ్రామిక శక్తికి వ్యవస్థాగతంగా మేలైన ఉపాధి శిక్షణ అందిస్తున్నాయి. దేశీయంగా అది ఐదు శాతానికి మించడం లేదు. అందుకే మన దగ్గర ఉన్నత విద్య అభ్యసించినవారు ఉన్నా వారూ చిన్నాచితకా పనులతో జీవితాలను భారంగా వెళ్లదీస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే– తుపానులు, వరదల లాంటి ప్రకృతి విపత్తుల కంటే రాష్ట్రానికి పెనుముప్పు రాబోతున్నది నిరుద్యోగంతోనే. గత ప్రభుత్వ నిర్వాకం వలన రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది యువత ఉపాధి కోసం వివిధ రాష్ట్రాలకు తరలిపోతున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి "నైపుణ్య కళాశాలల్లో అంతర్జాతీయ శిక్షణ ఇస్తాం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కోర్సులు రూపొందిస్తాం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాం, అందుకు తగినట్లు శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకుంటాం" అంటూ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖలో చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. అంతర్జాతీయ ప్రమాణాలు అంటూ తన హయాంలో మాటలు మాత్రమే చెప్పిన మాజీ సీఎం జగన్‌రెడ్డి కనీసం నైపుణ్య కళాశాలలకు భవనాలనే నిర్మించలేక నిధులు లేవంటూ చేతులెత్తేశారు. మరోపక్క అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను మూసివేసి నిరుద్యోగ యువతకు నైపుణ్యాన్ని దూరం చేశారు. 2016–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం మూడేళ్లలో 2,72,198 మందికి శిక్షణ ఇస్తే, వారిలో 64,444 మంది ఉద్యోగాలు సంపాదించారు. అదే జగన్‌రెడ్డి హయాంలో నాలుగున్నరేళ్లలో 2019–24 మధ్య 83,273 మంది శిక్షణ పొందితే, 21,270 మంది మాత్రమే ఉద్యోగాలు సాధించారు. చంద్రబాబు గారు నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసిన తర్వాత 2016 నుండి 2019 వరకు ఏటా ఆంధ్రప్రదేశ్ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. నైపుణ్య గణన గురించి గొప్పలు చెప్పిన జగన్ ప్రభుత్వంలో ఒక్కసారి కూడా ఏపీకి మొదటి స్థానం లభించిన దాఖలాలు లేవు. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పించినందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థకు 2018లో జాతీయ పురస్కారం కూడా లభించింది. దీన్ దయాళ్ గ్రామీణ కౌశల్ కింద నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి కల్పించడంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. 2017–18లో 17,292 మంది గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వగా 10,923 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయి. అదే సమయంలో జిల్లాకు ఐదు చొప్పున ఎంపిక చేసి, 65 కళాశాలల్లో బీఎస్సీ వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు అవసరమయ్యే శిక్షణ ఇచ్చారు. తర్వాత మరో 525 కళాశాలల్లో ఆంగ్ల భాష వ్యక్తీకరణ వంటి కోర్సులను నిర్వహించారు. వీటి మూలంగా 4,176 మందికి టీసీఎస్, ఇన్ఫోసిస్, క్యాప్ జెమినీ, విప్రో లాంటి సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. ఇది 2014–19 మధ్య టీడీపీ సాధించిన ఘనత. ఆ తర్వాత వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వ నిర్వాకం వలన రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు లేక అల్లాడిపోయారు.

జీడీపీ మెరుపులకు సమాంతరంగా జన జీవితాల్లోనూ వెలుగులు నిండాలంటే ఉపాధి సహిత అభివృద్ధి విధానాలను ప్రభుత్వాలు అనుసరించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యలో వృత్తి శిక్షణను అంతర్భాగం చేయాలి. తయారీ, ఆరోగ్య సేవలు, పునరుత్పాదక ఇంధన వనరులు, నిర్మాణం, రవాణా, చిల్లర విపణి, బీమా, పర్యాటకం, ఫొటోగ్రఫీ, బ్యాంకింగ్ రంగాల్లో భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు అందిరానున్నాయి. వాటిని ఒడిసిపట్టుకునే విధంగా నవతరాన్ని ముందుకు నడిపించాలి. వీటిలో మన యువతను తీర్చిదిద్దుకోవాలి. ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే విద్యను దేశ యువతకు అందించాలి. భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించే కృత్రిమ మేధ, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డేటా సైన్స్ వంటి అధునాతన కోర్సులను ప్రవేశపెట్టాలి. నైపుణ్య విద్యకు పాఠశాల స్థాయిలోనే పునాది వేయాలి. ప్రపంచీకరణ యుగంలో నైపుణ్య శిక్షణే ఆర్థికాభివృద్ధికి సోపానం. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపైన ప్రత్యేక దృష్టి పెట్టి యువత వలసలు పోకుండా స్థానికంగానే ఉండి ఆర్థికంగా నిలదొక్కుకునే ఏర్పాటు చేస్తుండడం అభినందనీయం. ఈ క్రమంలో పరిశ్రమల అవసరాలు, యువత నైపుణ్యాల నడుమ అంతరాలను గుర్తించేందుకు కూటమి ప్రభుత్వం 'నైపుణ్య గణన'కు సిద్ధమౌతుండడం ఆహ్వానించదగ్గ విషయం.

■ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి



దుర్గగుడిలో కోటి దీపోత్సవం



దుర్గాఘాట్‌లో భక్తుల పుణ్యస్నానాలు

దేదీప్యమానం

కార్తీక పౌర్ణమి శోభతో జిల్లా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శుక్రవారం వేకువజామునే కృష్ణాతీరాలు పుణ్యస్నానాలతో కిటకిటలాడగా, శైవక్షేత్రాలు భక్తులతో నిండిపోయాయి. ఇంద్రకీలాద్రిపై కోటి దీపోత్సవం ఘనంగా జరిగింది. జ్వాలాతోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాత శివాలయం, యనమలకుదురు శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



నింగి నుంచి నిఘా



కమిషనరేట్‌లో డ్రోన్ కాప్స్

- పైలెట్లుగా మహిళా పోలీసులకు శిక్షణ
- డీజీపీ కార్యాలయం వద్ద శిక్షణ ప్రారంభం
- తొలుత 500 మందికి..
- ఇకపై నగరంపై విరివిగా డ్రోన్ల విహారం



డ్రోన్లపై మహిళా పోలీసులు పొందుతున్న శిక్షణను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖరబాబు

> పోలీసు కమిషనరేట్ అధికారులు ఆపరేషన్ డ్రోన్ అమలు చేస్తున్నారు. ఒక డ్రోన్ 1,000 సీసీ కెమెరాలతో సమానమని భావిస్తున్నారు. బుడమేరు వరదల సమయంలో డ్రోన్లు ఇచ్చిన ఫలితాలతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మూడు అంశాల్లో డ్రోన్లను విరివిగా ఉపయోగిస్తున్న అధికారులు వాటిని ఆపరేట్ చేయడానికి సిబ్బందిని కూడా సమాయత్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పోలీసు కమిషనరేట్‌లో మహిళా పోలీసులను డ్రోన్ ఆపరేషన్‌కు ఉపయోగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. వారికి దశలవారీగా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుళ్లకు ఈ శిక్షణ జరుగుతోంది. కమిషనరేట్‌లో మొత్తం 4,500 మంది సిబ్బంది ఉండగా, 500 మందిని డ్రోన్ పైలెట్లుగా తయారు చేయాలని చూస్తున్నారు. డ్రోన్ ఎగురవేయడమే కాకుండా.. దాన్ని ఏవిధంగా తిప్పాలి, ఏయే కోణాల్లో పంపాలి.. అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని మహిళా సిబ్బంది.. డీజీపీ కార్యాలయం వద్ద ఉన్న బెటాలియన్‌లో ఈ శిక్షణ పొందుతున్నారు.

సత్ఫలితాల కారణంగానే..

ప్రభుత్వం 2018లో పోలీసు కమిషనరేట్‌కు పెంటాన్ 4ప్రో మోడల్‌కు చెందిన తొమ్మిది డ్రోన్లను ఇచ్చింది. వీటి కాలపరిమితి ముగిసింది. దీంతో అప్‌డేట్ వెర్షన్ కలిగిన ఎయిర్3 డ్రోన్లను మూడు విధాలుగా ఉపయోగిస్తున్నారు. అస్త్రం డాష్‌బోర్డుకు వచ్చిన ట్రాఫిక్ అప్‌డేట్స్‌ను డ్రోన్లకు పంపుతున్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రామవరప్పాడు రింగ్, బెంజిసర్కిల్, వారధి ప్రాంతాల్లో నిత్యం డ్రోన్లను ఎగురవేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఈ డ్రోన్లన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ ఆగిపోవడానికి కారణం ఏమిటన్న విషయాన్ని దీనిద్వారా తేలిగ్గా తెలుసుకుంటారు. ఆ తర్వాత ఆ పరిధిలోని ట్రాఫిక్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. తాజాగా ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై నిఘాకు డ్రోన్లను ఉపయోగించారు. వరుస ఫలితాలను చూసిన పోలీసు కమిషనరేట్ అధికారులు ప్రతి స్టేషన్‌కు ఒక్కో డ్రోన్‌ను సమకూర్చితే మంచి ఫలితాలను చూడవచ్చన్న ఆలోచనలో ఉన్నారు. కీలకమైన కేసుల్లో ఈ డ్రోన్లు ఉపయోగకరంగా ఉంటాయని భావిస్తున్నారు. ప్రస్తుతం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిత్యం డ్రోన్లను గాల్లోకి పంపుతున్నారు. వీటిని ఆపరేట్ చేయడమే కాకుండా వాటికి రిపేర్లు వచ్చినా చేయగలిగేలా మహిళా పోలీసులను తయారు చేయాలని భావిస్తున్నారు.



గౌతంరెడ్డి ఎక్కడ?

తీవ్రంగా గాలిస్తున్న మూడు ప్రత్యేక బృందాలు

కడప, నెల్లూరు జిల్లాల్లో ఉన్నట్టు అనుమానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పూనూరు గౌతంరెడ్డి... కమ్యూనిస్టు నేతగా ఎదిగి వైసీపీలో ట్రేడ్ యూనియన్ నేతగా ఓ వెలుగు వెలిగాడు. గండూరి ఉమామహేశ్వరశాస్త్రిపై హత్యాయత్నం కేసులో ప్రస్తుతం పలాయనం చిత్తగించాడు. ఈ కేసులో ఏ1గా ఉన్న గౌతంరెడ్డి కోసం పోలీసు బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. మూడు ప్రత్యేక బృందాలు ఊరూరు తిరుగుతున్నాయి. గౌతంరెడ్డి సామాజిక బలం ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై పోలీసులు దృష్టి పెట్టారు. దీని ప్రకారం చూస్తే ఆయన నెల్లూరు, కడప జిల్లాల్లో ఎక్కడో ఒకచోట ఉండి ఉండొచ్చని భావిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో ఉంటే వైసీపీ నేతలే ఆయనకు ఆశ్రయం కల్పిస్తారు. అదే కడప జిల్లాలో అయితే కుమార్తె తరఫు బంధువులు ఆశ్రయం కల్పించే అవకాశం ఉంది. ఈ కేసులో ఉమామహేశ్వరశాస్త్రిపై దాడి చేసిన నలుగురు యువకులను పోలీసులు ఇప్పటికే జైలుకు పంపారు. గౌతంరెడ్డితో పాటు మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ ఐదుగురి కోసం వేట సాగుతోంది. సాంకేతిక దర్యాప్తు కూడా కొనసాగుతోంది.

ప్రతిపాదనలు ఉన్నా ఓపెన్ కాని షీట్

గౌతంరెడ్డికి 1988 నుంచి నేరచరిత్ర ఉంది. కమిషనరేట్‌లో 42 కేసులు నమోదయ్యాయి. ఇందులో రెండు హత్యలు, రెండు హత్యాయత్నాలు, ఒక డెకాయిటీ, రెండు దోపిడీ, రెండు చీటింగ్‌లు ఉన్నాయి. అతడిపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. దీన్ని 2003లో తీసేశారు. తర్వాత 2004-2005లో గౌతంరెడ్డిపై రౌడీషీట్ తెరవడానికి అప్పటి ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలు ముందుకు కదల్లేదు. దీనికి కారణాలు ఏమిటన్నది పోలీసులు పరిశీలిస్తున్నారు. రౌడీషీట్ ఎందుకు తీసేశారు, తర్వాత తయారు చేసిన ప్రతిపాదనలు ఎందుకు మిగతా 6లో..

వీలునామాను కూడా మార్చేసి..

ఉమామహేశ్వరశాస్త్రి స్థలాన్ని నకిలీ వీలునామా ద్వారా గౌతంరెడ్డి కాజేశాడు. ఉమామహేశ్వరశాస్త్రి తండ్రి రాసిన వీలునామా మొత్తంగా మార్చే పత్రాన్ని తయారు చేశాడు. దీనికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదు. దీన్ని అడ్డుపెట్టుకుని మొత్తం స్థలాన్ని గౌతంరెడ్డి మింగేశాడు. దీని గురించి తెలుసుకున్న బాధితుడు అప్పుడే సత్యనారాయణపురం పోలీసుల వద్దకు వెళ్లాడు. తన వద్ద అసలు వీలునామా ఉందని, గౌతంరెడ్డి వద్ద ఉన్నది నకిలీదని పదేపదే చెప్పాడు. దీనికి సంబంధించిన ఆధారాలు పోలీసులకు అందజేశాడు. దీనిపై చీటింగ్ కేసు నమోదు చేసి పోలీసులు వదిలేశారు. ఉమామహేశ్వరశాస్త్రి ఇచ్చిన వీలునామాలను పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపితే నాడే అసలు నిజాలు బయటకు వచ్చేవంటున్నారు. అప్పటి పోలీసులు ఈ పని ఎందుకు చేయలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది.



● భళా.. బాలకా.. 8లో

అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ శుక్రవారం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను బాలోత్సవ్ గౌరవాధ్యక్షుడు చలువాది మల్లికార్జునరావు ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పాత కాంట్రాక్టర్‌కే కొత్త టెండర్

వివాదాస్పదంగా గన్నీ బ్యాగుల రవాణా టెండర్ వ్యవహారం

- వైసీపీ హయాంలో అడ్డగోలుగా టెండర్లు
- తాజాగా గన్నీ బ్యాగుల టెండర్‌లోనూ అంతే..
- సివిల్ సప్లయిస్ అధికారుల తీరుపై ఆరోపణలు

విజయవాడ, ఆంధ్రజ్యోతి : గన్నీ బ్యాగుల రవాణా టెండర్లను సివిల్ సప్లయిస్ అధికారులు తమ ఇష్టానుసారంగా కట్టబెట్టేస్తున్నారు. జాయింట్ కలెక్టర్‌కు కూడా సమాచారం ఇవ్వకుండా టెండర్లను అపహాస్యం చేస్తున్నారు. టెండర్లు రాకపోతే.. మళ్లీ మళ్లీ టెండర్లు పిలవాలి కానీ, వాటిని రద్దుచేసి వైసీపీ హయాంలోని పాత కాంట్రాక్టర్‌నే కొనసాగించడం వెనుక అనేక ఆరోపణలు వస్తున్నాయి.

టెండర్ సరిగ్గా లేదని..

గోనె సంచుల రవాణా కోసం అక్టోబరు 18వ తేదీన సివిల్ సప్లయిస్ సంస్థ అధికారులు టెండర్లు పిలిచారు. 2024-25 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి జిల్లా పరిధిలో సవిల్ సప్లయిస్ గోడౌన్లలో నిల్వ చేసిన కొత్త గోనె సంచుల బేళ్లు, పాత గోనె సంచులు, పీపీ బ్యాగ్‌లను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు, రైతు సేవా కేంద్రాలకు, రైస్ మిల్లులకు తరలించటంతో పాటు కొనుగోలు కేంద్రాల నుంచి రైతు సేవా కేంద్రాలు, కళ్లాల వరకు రవాణా చేయటానికి ఆసక్తి కలిగిన సంస్థలు, వ్యక్తుల నుంచి సీల్డ్ టెండర్లను సివిల్ సప్లయిస్ డీఎం కార్యాలయం పిలిచింది. వీటికి ఒకే ఒక వ్యక్తి టెండర్ వేశాడు. అతడిని సివిల్ సప్లయిస్ అధికారులు పక్కన పెట్టేశారు. టెండర్ బిడ్ సరిగ్గా లేదని కారణం చూపారు. ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందని సదరు కాంట్రాక్టర్ అధికారులను ప్రశ్నించగా, టెండర్ సరిగ్గా వేయలేదని సమాధానమిచ్చారు. సింగిల్ టెండర్ పడినా.. టెండర్ బిడ్ సరిగ్గా పడకపోయినా.. రీ టెండర్లు పిలవాలి. ఆ పని కూడా అధికారులు చేయలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కాంట్రాక్టర్‌కే మళ్లీ పనులు అప్పగించారు. అతను పాత కాంట్రాక్టర్ అని, టెండర్లకు స్పందన లేకపోవటం వల్ల జాయింట్ కలెక్టర్ చెబితేనే చేసినట్టుగా అధికారులు సమాధానమిచ్చారు. పాత కాంట్రాక్టర్‌కే టెండర్ ఇవ్వడం వెనుక ముడుపులు అందుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

చాంపియన్స్‌కే.. మళ్లీ కృష్ణవేణి మోటెల్

- గతంలో కరెంట్ బిల్లు ఎగ్గొట్టిన సంస్థ
- ఏపీటీడీసీ ఆదాయానికి భారీగా గండి
- తాజాగా 33 ఏళ్ల లీజు పెత్తనం

విజయవాడ, ఆంధ్రజ్యోతి : విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించకుండా ఎగ్గొట్టిన చాంపియన్స్ సంస్థకే మళ్లీ కృష్ణవేణి మోటెల్‌ను పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులు కట్టబెట్టేశారు. గతంలో ఈ సంస్థకు కృష్ణవేణి మోటెల్‌ను కేటాయించగా, సరిగ్గా నిర్వహించలేదు. ఏపీటీడీసీకి బకాయిలు కూడా పెట్టింది. తాజాగా మళ్లీ అదే సంస్థకు పీపీపీ విధానంలో దీర్ఘకాలానికి కట్టబెట్టారని తెలుస్తోంది. ఇది జరిగి దాదాపు నెల అవుతున్నా సంబంధిత సంస్థ ఇప్పటి వరకు పనులు మొదలుపెట్టలేదు. విజయవాడ నుంచి అమరావతికి వెళ్లేటప్పుడు ప్రకాశం బ్యారేజీ చివరన కృష్ణవేణి మోటెల్ ఉంటుంది. ఇది ఖాళీగా ఉండటాన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆరా తీసింది. దీంతో అసలు విషయం బయటపడింది. ఈ మోటెల్‌ను పీపీపీ విధానంలో పాత సంస్థకే అప్పగించినట్టు ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి తెలిపినట్టుగా తెలుస్తోంది. పాత సంస్థకే మళ్లీ కట్టబెట్టడం వెనుక అనేక విమర్శలు వస్తున్నాయి. గతంలో ఈ మోటెల్ ఏపీటీడీసీ ఆధీనంలో ఉండేది. అప్పట్లో బాగానే నడిచేది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రైవేటుపరం చేశారు. అనేక సంస్థలు ఈ మోటెల్‌ను లీజుకు తీసుకుని వ్యాపారం చేసినా ఏపీటీడీసీకి అదనంగా ఒరిగిన ప్రయోజనమేమీ లేదు. కిందటిసారి చాంపియన్స్ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ రూ.లక్షన్నర వరకు విద్యుత్ బిల్లులను చెల్లించకుండా ఎగ్గొట్టింది. అంతేకాదు.. ఏపీటీడీసీ బోటింగ్ ఆదాయానికి గండికొట్టింది. ఈ కృష్ణవేణి మోటెల్‌లో హోటల్, రెస్టారెంట్, బార్, కాన్ఫరెన్స్ హాల్ తదితరాలు వంటివి నిర్వహించటానికి మూడు దశాబ్దాల కాలానికి చడీచప్పుడు కాకుండా లీజుకు ఇచ్చినట్టుగా తెలుస్తోంది.

డిజిటల్ అరెస్టు.. రూ.1.25 కోట్లు హాంఫట్

- నగరంలో సైబర్ మోసంలో చిక్కుకున్న మహిళ

విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : *వందలు కాదు.. వేలు కాదు.. లక్షలు కూడా కాదు.. ఏకంగా రూ.కోటి 25 లక్షలకు సైబర్ మోసం డిజిటల్ అరెస్టులో చిక్కుకున్న ఓ మహిళ చివరికి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించింది. గురునానక్ కాలనీకి చెందిన ఈ మహిళ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కొద్దిరోజుల క్రితమే ఆమె నగరానికి వచ్చింది. శుక్రవారం ఉదయం ఆమెకు గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ముందుగా అవతలి వ్యక్తి ఆమె ఆధార్ కార్డు నెంబరు చెప్పాడు. అది తనదేనని ఆమె బదులిచ్చింది. తర్వాత ఫోన్ నెంబర్‌ను నిర్ధారించుకుంది. అది కూడా తనదేనని ఆమె ఒప్పుకొంది. ఆ తర్వాత వీడియో కాల్ చేశాడు. దుబాయి నుంచి ముంబయికి ఆమె పేరిట ఓ పార్శిల్ వచ్చిందని, అందులో పాస్‌పోర్టులు, సిమ్‌కార్డులు, 180 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ ఉందని చెప్పాడు. దీనిపై కేసు నమోదైందని, విచారణకు ముంబయి రావాలన్నాడు. భయపడిపోయిన ఆమె శుక్రవారం ఉదయం 11 నుంచి వరుసగా వీడియోకాల్స్ వచ్చేసరికి నిజమేనని భావిం చింది. గాయత్రీ నగర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఎన్ఆర్ఐ బ్రాంచ్‌కు వెళ్లి ఆర్టీజీఎస్ రూ.1.25 కోట్లను ఆన్‌లైన్‌లో అతడి అకౌంట్‌కు పంపింది. తర్వాత లబోదిబోమంటూ సైబర్ క్రైం పోలీసుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.*

భక్తజన సంద్రం

» మంగినపూడిలో లక్ష మంది సముద్ర స్నానాలు » కిటకిటలాడిన శైవ ఆలయాలు



శివోహం..



మంగినపూడి బీచ్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



మచిలీపట్నం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. కృష్ణాజిల్లాతో పాటు ఎన్టీఆర్, కాకినాడ, రేపల్లె, తెనాలి తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తెల్లవారుజామున మంగినపూడి బీచ్‌కు చేరుకుని పవిత్ర స్నానాలు చేశారు. కృష్ణా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు సముద్ర స్నానాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రి కొల్లు రవీంద్ర ఉదయాన్నే సముద్ర స్నానం చేసి సముద్రుడికి మంగళహారతులిచ్చారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, సనాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా బీచ్‌లో పుణ్యస్నానాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రానున్న కాలంలో బీచ్‌ను పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంద్రకీలాద్రి దుర్గమ్మ, మోపిదేవి, తదితర ఆలయాల నుంచి పెద్ద ఎత్తున పులిహోర, చక్రపొంగలిని భక్తులకు పంపిణీ చేశారు. పిల్లలు, వృద్ధులకు పాలు అందజేశారు. డీపీవో అరుణ, ఆర్డీవో స్వాతి, ఏఎస్పీ సత్యనారాయణ, డీఎస్పీ సుబాన్, బందరు ఎంపీడీవో వెంకటేష్, తహసీల్దార్ మదన్‌మోహన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కూటమి నేతలు గొర్రెపాటి గోపీచంద్, లంకే శేషగిరి, లంకే హరికృష్ణలు బీచ్‌లో ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. కుంచే నాని, పిప్పళ్ల కాంతారావు, పీవీ ఫణికుమార్‌లు పాల్గొన్నారు. పోలీసు ఔట్ పోస్టు ఏర్పాటు చేసి మైకులో ఎప్పటికప్పుడు సూచనలిస్తూ పర్యవేక్షించారు. పోలీసు వ్యానులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తీరం వెంబడి గజ ఈతగాళ్లతో అప్రమత్తత పాటించారు. భక్తులు దీపారాధనలు చేశారు. కూష్మాండ దానాలు జరిపారు.

పాండురంగని సేవలో కలెక్టర్ దంపతులు

మచిలీపట్నం టౌన్ : పాండురంగని బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ జిల్లాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కుబడులు సమర్పించుకున్నారు. కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. కలెక్టర్ దంపతులకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆర్డీవో స్వాతి, డీఎస్పీ సుబాన్, ఆర్‌పేట సీఐ నబీ, ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు, ఆర్‌పేట సీఐ ఏసుబాబు, తహసీల్దార్ మదన్‌మోహనరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రుక్మిణి అమ్మవారికి కుంకుమ పూజ, పల్లకి ఉత్సవం, గోపాలకుల ఉత్సవం నిర్వహించారు. భక్తులకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు అన్నదానం చేశారు.

పాలకాయితిప్ప బీచ్ వద్ద..

కోడూరు : కార్తీకపౌర్ణమి సందర్భంగా కోడూరు మండల పరిధిలోని పాలకాయితిప్ప బీచ్ వద్ద భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. శుక్రవారం వేకువజాము నుంచే భక్తులు సాగర తీరానికి చేరుకుని స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రత్యేక వైద్యశిబిరం, దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం అల్పపీడనం కొనసాగుతున్న క్రమంలో సముద్ర పోటు ఎక్కువగా ఉండి అలల వేగం కారణంగా భక్తుల సంఖ్య తగ్గిందన్నారు. గతేడాది సుమారు 20 వేలమంది రాగా.. ఈసారి 10 వేల మంది వరకు వచ్చినట్టు సమాచారం.



సముద్రుడికి మంత్రి రవీంద్ర పూజలు



మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలుచేశారు. తీరం వద్దకు బస్సులు, కార్లు అనుమతించకపోవటంతో సముద్రపు కరకట్ట నుంచి బీచ్ వరకు సుమారు 2 కిలోమీటర్లు కాలి నడకన వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సముద్ర ఉధృతి కారణంగా తీర ప్రాంతం ఉప్పునీటిమయంగా మారింది. డాల్ఫిన్ భవనం చుట్టూ ఉప్పునీరు నిలిచిపోయింది. మెరైన్, ఫిషరీస్, పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా భక్తులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ యువకుమార్, కోడూరు ఎస్ఐ చాణిక్య, అవనిగడ్డ, నాగాయలంక ఎస్ఐలు రాజేష్, శ్రీనివాస్, 60 మంది పోలీసు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక నదీ దీపోత్సవం

పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక మునేటిలో కార్తీక దీపం నదీ హారతులను శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేద పండితులు అర్చకుల వేదమంత్రోచ్ఛారణలతో దీపోత్సవాన్ని శాస్త్రోక్తంగా మునేటిలో నిర్వహించారు. ముందుగా అమ్మవారి దేవస్థానంనుంచి తిరుపతమ్మ గోపయ్య స్వాముల ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా మునేటి వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేక పూజలు అనంతరం గంగామాతకు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ధర్మకర్తలు, డిప్యూటీ కమిషనర్ బీవీఎస్ఎస్.కిషోర్ కుమార్, సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





కోటి దీపోత్సవం వెలుగుల్లో ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం స్వర్ణ కాంతులతో ధగధగలాడింది.



కట్టలేరులో కొట్టుకుపోతున్న బాలుడు, రక్షించి ఒడ్డుకు చేరుస్తున్న స్వాములు (ఇన్‌సెట్‌లో)

కట్టలేరులో బాలుడి మునక.. రక్షించిన స్వాములు

నందిగామ రూరల్, నవంబరు 15 : దాములూరు గ్రామానికి చెందిన తెలుగుయువత నేత నేలవెల్లి సిద్దార్థ, అతడి స్నేహితులు కలిసి వైరా కట్టలేరులో కొట్టుకుపోతున్న బాలుడిని రక్షించి ప్రాణాలు కాపాడారు. సేకరించిన వివరాల మేరకు.. దాములూరు గ్రామానికి చెందిన కుంచం కృష్ణ కుమారుడు ప్రవీణ్ కొణతమాత్మకూరు జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రవీణ్ స్నేహితులతో కలిసి వైరాకట్టలేరులో స్నానానికి వచ్చారు. ఏటిలో దిగిన వారు లోతు ఎక్కువ ప్రదేశంలో ఈత కొడుతుండగా ప్రవీణ్ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ఆలయ సమీపం అయ్యప్ప దీక్షలో ఉన్న సిద్ధార్థ, అతడి స్నేహితులు గోపీచంద్, కనకయ్య, నరసింహారావు, మురళిలు ప్రవీణ్‌ను గమనించి తాడు సాయంతో కాపాడి ఒడ్డుకు తెచ్చారు. బాలుడిని రక్షించిన స్వాములను గ్రామస్థులు అభినందించారు.



హైవేపై ఆటోనగర్ క్రాసింగ్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఆటోనగర్ రోడ్డు క్రాసింగ్ వద్ద రక్షణ చర్యలు

జగ్గయ్యపేట, : జగ్గయ్యపేట సమీపంలో జాతీయరహదారిపై ఆటోనగర్ రోడ్డు క్రాసింగ్ వద్ద ఎట్టకేలకు అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనిగండ్లపాడుకు చెందిన వ్యవసాయకూలీ దోసపాటి బిక్ష్యాలు మృతి చెందటంతో పెద్ద ఎత్తున రోడ్డు క్రాసింగ్‌ను మూసివేయాలన్న డిమాండ్ వచ్చింది. పోలీస్ రికార్డుల ప్రకారం అదే ప్రాంతంలో జరిగిన ప్రమాదాల్లో 16మంది ప్రాణాలు కోల్పోయారు. ఎంతో కాలంగా ఆటోనగర్ వద్ద రోడ్డు క్రాసింగ్ మూసివేయాలని కోరుతూ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య హైవే అథారిటీ అధికారులకు లేఖ రాశారు. గురువారం ప్రమాద ఘటనతో తాతయ్య అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. వైసీపీకి చెందిన వ్యక్తి రెస్టారెంట్ వ్యాపార ప్రయోజనాలు దెబ్బతింటాయని క్రాసింగ్‌ను మూసే సాహసం అధికారులు చేయలేదు. హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి శాశ్వత ంగా డివైడర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణంలోకి ప్రవేశించే ప్రదేశాల్లో లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

గౌతంరెడ్డి ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

మూలనపడ్డాయి అనే అంశాలను బయటకు తీస్తున్నారు. కేసులను పరిశీలించాక తిరిగి షీట్ తెరిచే అవకాశాలు ఉన్నాయని సమాచారం. దీనిపై న్యాయనిపుణులతో చర్చించాక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రెండు లా అండ్ ఆర్డర్ బృందాలు, ఒక టాస్క్‌ఫోర్స్ బృందం గౌతంరెడ్డి ఆచూకీని తెలుసుకునే పనిలో ఉంది. కాగా, ఉమామహేశ్వర శాస్త్రి కేసుతో గౌతంరెడ్డి బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. తామంతా గౌతంరెడ్డి బాధితులమేనని చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఆయన ఎన్నో అరాచకాలు చేశాడని వారంతా ఆరోపిస్తున్నారు.

వైసీపీ రివర్స్ కేసులు

మొహం చాటేసిన పలువురు నేతలు

రాణిగారితోట/ఆటోనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వైసీపీ అధ్యక్షుడు జగన్, ఆ పార్టీ నేతలపై ఐటీడీపీ, టీడీపీ నేతలు తప్పుడు పోస్టులు పెట్టడం పై చర్యలు తీసుకోవాలని కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో వైసీపీ నేతలు కేసులు పెట్టారు. వైసీపీ పెద్దల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కృష్ణలంకలోని పలు డివిజన్ల నుంచి కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. 15వ డివిజన్ నుండి మాజీ కార్పొరేటర్ అళ్ల చల్లారావు పటమట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిగిలిన డివిజన్ల నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి కార్పొరేటర్లు, గత ఐదు సంవత్సరాలు వివిధ పదవులు అనుభవించిన నేతలు ముఖం చాటేశారు. ద్వితీయ శ్రేణి నాయకులు, పార్టీలో కొత్తగా వచ్చిన వారు కొందరు కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు వచ్చారు. అయితే అంతా కలిపి పట్టుమని పది మంది కూడా రాకపోవడంతో అక్కడికి వచ్చిన వారు తమనేందుకు దీనిలో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇంక అక్కడిదాకా వెళ్ళిన తరువాత చేసేదిలేక, తప్పక ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిసింది.

గత ప్రభుత్వంలో దళితులపైనా వేధింపులు

టీడీపీ గ్రీవెన్స్‌లో వైసీపీ బాధితుల ఫిర్యాదులు

అమరావతి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): దళితులమైన తమనూ గత ప్రభుత్వంలో వేధింపులకు గురి చేశారని వైసీపీ బాధితులు వాపోయారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రజావినతులు స్వీకరించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన గంటిపోగు స్టీవెన్‌బాబు అర్జీ ఇచ్చి, దళితుడనైన తనపై గతంలో వైసీపీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తప్పుడు కేసు పెట్టి వేధించారని వాపోయారు. తప్పుడు కేసు అని తెలిసినా సీఐ చార్జీషీట్ దాఖలు చేశారని, తనపై పెట్టిన అక్రమ కేసులను తొలగించాలని కోరారు. వైసీపీ నేతల దౌర్జన్యాలను ఎదిరించి, పార్టీ కోసం పని చేసి, జైలుకు వెళ్లిన తనను కులం పేరుతో దూషిస్తూ దౌర్జన్యం చేస్తున్నారని పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన దాసరి అజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే అండతో జే. రాములు అనే వ్యక్తి శ్రీశైలంలోని వడియరాజుల సత్రంలోకి ఇతరులను తెస్తూ, ఇదేమని అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తున్నాడని సత్రానికి చెందిన సభ్యులు ఫిర్యాదు చేశారు. తాము కొనుగోలు చేసిన స్థలాన్ని పిల్లల పెళ్లిళ్ల కోసం అమ్ముకోవాలని చూస్తే.. వైసీపీ నేతలు ఆక్రమించి, తమపైనే దౌర్జన్యం చేస్తున్నారని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన దాసరి బోడయ్య, లక్ష్మమ్మ వాపోయారు. కబ్జా దారుల నుంచి భూమిని తమకు ఇప్పించాలని కోరారు. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, కూటమి ప్రభుత్వంపై నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన మునగాల హరీష్‌రెడ్డి వైసీపీ సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నారని నంద్యాల జిల్లా గోస్పాడు మండల టీడీపీ కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు. హరీష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదనపు కట్నం కోసం తన మనవరాలిని చంపిన అత్తింటి వారిపై కేసు పెడితే పోలీసులు పట్టించుకోలేదని గుంటూరు జిల్లా రావెలకు చెందిన షేక్ మౌలాలీ ఫిర్యాదు చేశారు. నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

17న చెన్నైలో దక్షిణ భారత న్యాయవాదుల సదస్సు

నూతన క్రిమినల్ చట్టాలపై పోరాటం

విజయవాడ లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై ఒకటి నుంచి అమలులోకి తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేయాలని కోరుతూ నవంబరు 17వ తేదీ ఆదివారం చెన్నై నగరం, తెనియంపేట్‌లోని కామరాజర్ హాలులో తమిళనాడు, దక్షిణ భారత న్యాయవాదుల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్, అడ్వకేట్స్ జేఏసీ నేతలు వై.కోటేశ్వరరావు, నల్లూరి మాధవరావులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన 'భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్షా అధినియం' చట్టాలు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే విధంగా వున్నాయన్నారు. న్యాయవ్యవస్థలో పోలీసు యంత్రాంగానికి యథేచ్ఛగా అధికారాలను కల్పిస్తూ, న్యాయవ్యవస్థకు వున్న అధికారాలను కుదిస్తూ, న్యాయవ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఈ చట్టాల అమలు ప్రజలకు నష్టదాయకం అని దేశవ్యాప్తంగా న్యాయవాదులు ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. వెంటనే నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ అధ్వర్యంలో దక్షిణ భారత దేశ న్యాయవాదుల సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక, రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున న్యాయవాదులు పాల్గొనే సదస్సులో ఆంధ్రప్రదేశ్ నుంచి న్యాయవాదులు పెద్దసంఖ్యలో పాల్గొనవలసిందిగా సుంకర విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ సీనియర్ సిటిజన్లకు 25 శాతం రాయితీ

బస్సుస్టేషన్ : ఆర్టీసీ బస్సుల్లో 60 సంవత్సరాలు దాటిన ప్రయాణికులు చార్జీలలో 25 శాతం రాయితీ పొందవచ్చునని ఆర్టీసీ ఈడీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆధార్, ఓటరు, సీనియర్ సిటిజన్ ఐడీ, పాస్‌పోర్టు, పాన్, రేషన్ కార్డులలో ఏదైనా డిజిటల్‌లో గాని, భౌతికంగా గాని కండక్టర్‌కు చూపించి రాయితీ పొందవచ్చునని తెలిపారు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ధృవీకరణలతో రాయితీ పొందవచ్చునని తెలిపారు. .

డిసెంబరు 10న సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ

అమరావతి: సీపీఎస్, జీపీఎస్ విధానాలకు వ్యతిరేకంగా మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 10న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్రఅధ్యక్ష, కార్యదర్శులు సతీష్, దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ధర్నా చౌక్‌లో సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేస్తామని మంత్రి లోకేష్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

నరకదారి..!

గుంతలమయంగా మైలవరం-నూజివీడు రోడ్డు గుంతలు, ధూళితో ప్రయాణికులు విలవిల



అధ్వాన రహదారిపై అడుగడుగునా గుంతలను తప్పించే క్రమంలో రోడ్డు ప్రమాదాలకు గురై వాహన చోదకులు మృత్యువాత పడుతున్నారు. ఐదేళ్లుగా పాలకుల నిర్లక్ష్యంతో చిన్నపాటి మరమ్మతులకు కూడా నోచని రహదారులు ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. వైసీపీ పాపం ప్రజలకు శాపంగా మారిందని రోడ్డు ప్రమాద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం-నూజివీడు రోడ్డు దుస్థితిపై ప్రత్యేక కథనం..

(మైలవరం, ఆంధ్రజ్యోతి)

మైలవరం-నూజివీడు రోడ్డు అంటేనే వాహనచోదకులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మైలవరం పట్టణం బుడమేరు వంతెన వద్ద నుంచి గణపవరం అడ్డరోడ్డు వరకు అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. వెల్వడం ఊరి చివర బుడమేరు వంతెనకు సమీపంలో రహదారి మార్జిన్ 50 మీటర్లకు పైగా కోతకు గురైంది. గణపవరం అడ్డ రోడ్డు సమీపంలో దుమ్ము-ధూళి లేస్తు ప్రజలు నరకం చూస్తున్నారు. రహదారిపై గుంతల్లో ఇటుక బట్టీల యజమానులు బట్టీల్లో పనికి రాని ఇటుకలతో పూడ్చడం వల్ల దుమ్ము ధూళి పైకి లేచి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడంలేదని వాహనదారులు చెబుతున్నారు. చెక్‌పోస్టు ఎదురు పైపులైన్ లీకేజీతో రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. ఇటీవల గుంతలను తప్పించే క్రమంలో టిప్పర్ ఢీకొని వెల్వడంకు చెందిన రైతు మృతి చెందాడు. ప్రతి రోజు రోడ్డు ప్రమాదాలు ఇక్కడ సర్వసాధారణమైంది. అయినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.



కోతకు గురైన మైలవరం-నూజివీడు రోడ్డు(పైన), గణపవరం వద్ద రోడ్డుపై గుంతలు



వాహనాల రాకపోకలతో దుమ్ము-ధూళి

తండ్రిని కోల్పోవాల్సి వచ్చింది


- ప్రత్తిపాటి కిరణ్



గణపవరం అడ్డరోడ్డు వద్ద గుంతలపై పలుమార్లు సోషల్ మీడియాలో పెట్టి, అధికారులకు ఫిర్యాదులు కూడా చేశాం. దురదృష్టవశాత్తు నా తండ్రినే గుంతలు మింగేశాయి. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయాం. మరో కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు తక్షణం గుంతలను పూడ్చేందుకు ఉన్నతాధికారులు స్పందించాలి.

పనులు చేయలేం..

ఏడుకొండలు ఆర్‌అండ్‌బీ ఈఈ



మైలవరం-నూజివీడు రహదారి మరమ్మతులకు ఎస్‌డీఎమ్ఎఫ్ నుంచి రూ.7.5 లక్షలు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనిచేయడం లేదు. అతడి కాంట్రాక్టు రద్దుచేసి మరలా కొత్త వారికి అవకాశం కల్పిస్తే తప్ప పనులు చేయలేని పరిస్థితి. కాంట్రాక్టు రద్దు చేసి కొత్తవారికి ఇస్తే రహదారి భద్రత కల్పించగలం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 115, 124, 135
చికెన్ విత్ స్కిన్ 216
చికెన్ స్కిన్‌లెస్ 226
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550



ఆటో యజమానులపై ఫైనాన్సర్ల వేధింపులు ఆపాలి

ధర్నాచౌక్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఆటో, మోటార్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఆటో యజమానులపై ప్రైవేట్ ఫైనాన్సర్ల వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ స్థానిక ధర్నాచౌక్‌లో సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కే.దుర్గారావు, ఎం.హనుమంతరావు, రూబేన్, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం
మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికీ, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

భారతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు ఎస్.చంటి, వి.ఎల్. రెడ్డి, చిన్నా,సూర్య ఆధ్వర్యంలో శుక్రవారం గురునానక్ రోడ్డులోని కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో సూపర్‌స్టార్ కృష్ణ వర్ధంతి వేడుకులు జరిగాయి. తొలిత పార్కులోని కృష్ణ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పార్కులో మొక్కలు నాటేరు. అనంతరం పేద మహిళకు తోపుడు బండిని అందజేశారు.

ఎనీ టైం మద్యం

- ఎమ్మార్పీపై వంద ఎక్స్‌ట్రా..
- అర్ధరాత్రి కూడా అమ్మకాలు
- వైన్ షాపులతో కుదేలైన బార్ల వ్యాపారం
- సీజ్ చేసినా తీరు మారని వైనం

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

తూర్పు నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. రాత్రి 10 గంటలు దాటితే మంచినీరు దొరకని ప్రాంతాలు ఉన్నాయేమో గానీ మందు దొరకని ప్రదేశం లేదనడం అతిశయోక్తి కాదు. క్వార్టర్ సీసాకు రూ.100 అదనంగా చెల్లిస్తే సమయంతో సంబంధం లేకుండా అమ్మేస్తారు. ఈస్ట్ డివిజన్‌లో 42, పటమటలో 18 బార్లు ఉన్నాయి. నిబంధనలు ప్రకా రం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వీటికి అనుమతి ఉంటుంది. అయితే దాదాపుగా అన్ని చోట్లా 12 దాటే వరకు అమ్మకాలు జరుపుతున్నారు. ఒక్క ఆటోనగర్‌లో మాత్రం అర్ధరాత్రి 2 గంటల వరకూ అమ్మకాలు సాగుతాయి. 50 శాతం పైగా బార్లలో ఉదయం 4 గంటల నుంచే విక్రయాలు సాగుతున్నాయి. నగరం మధ్యలో రద్దీ ప్రాంతాల్లోనే ఇంత జరుగుతున్నా అటు పోలీసులు, ఇటు ఎక్సైజ్ శాఖలు పట్టించుకోవడం లేదు.



ఆటోనగర్ సమీపంలోని ఓ బార్ వద్ద అర్ధరాత్రి అమ్మకాలు

వైన్ షాపులతో కుదేలు

కూటమి ప్రభుత్వం వైన్ షాపులకు పర్మిషన్ ఇవ్వడంతో బార్లకు గిరాకీ తగ్గింది. అన్నీ రకాల మద్యం తక్కువ ధరలకు వైన్ షాపులో అందుబాటులో ఉండడంతో బార్ల వైపు చూసేవారే కరువయ్యారు. దీంతో వైన్ షాపులు తెరవడానికి ముందు, అవి మూసిన తర్వాత బార్ల వ్యాపారం లాభసాటిగా మారింది. ప్రతి బాటిల్ మీద వంద అదనంగా తీసుకుంటున్నారు. అర్ధరాత్రి మద్యం ఆటోనగర్ ప్రాంతంలోనే దొరుకుతుందని ఎవర్ని అడిగినా చెబుతారు. ఆటోనగర్ ప్రాంతంలో రోజువారీ పనులకు వెళ్లే కార్మికులే వీరి టార్గెట్‌గా పెట్టుకున్నారు. గతంలోనూ ఇదే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపును మూసేసిన చరిత్ర ఈ బార్లకు ఉందని సమాచారం.

ఎన్నిసార్లు సీజ్ చేసినా మారని వైనం

ఆటోనగర్ సమీపం వద్ద ఉన్న బార్లల్లో 24 గంటలూ మద్యం దొరుకుతుంది. క్వార్టర్‌కు అదనంగా వంద తీసుకుంటున్నారు. ఇక్కడ పగటి వ్యాపారం కంటే రాత్రి అమ్మకాలే విపరీతంగా జరుగుతాయి. ఉదయం 4 గంటల నుంచే బహిరంగంగా తెరిచి అమ్మకాలు సాగిస్తుంటారు. గతంలో నిబంధనలు ఉల్లంఘించినందుకు ఇక్కడ ఉండే ఓ బార్‌ను మూడు సార్లుపైనే సీజ్ చేయడం గమనార్హం. అయినా తీరు మార్చుకోకుండా విక్రయాలు కొనసాగిస్తున్నారు.

షెల్టర్ హోంలో సౌకర్యాలపై కమిషనర్ ఆరా



రాణిగారితోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న షెల్టర్ హోమ్స్‌ను మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం పరిశీలించారు. రాణిగారితోటలోని షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వారిని అడిగి సమస్యలు తెలుసుకోవడంతో పాటు హోంలోని సౌకర్యాలు పరిశీలించారు. ఆశ్రయం పొందుతున్న వారి వివరాలు తెలుసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి కోసం వచ్చే కుటుంబ సభ్యులు ఉండడానికి పాత గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద నూతనంగా షెల్టర్ హోం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇతర ప్రదేశాల నుంచి పనికోసం వచ్చే వర్కర్లకు లేబర్ డిపార్ట్‌మెంట్ వారి సమన్వయంతో సంయుక్త పరిశీలన చేసి లేబర్ చౌక్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఈఈ జి.సామ్రాజ్యం, యూసీడీ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ సుజాత పాల్గొన్నారు.

RUNNING VERY SUCCESSFULLY at NAVRANG A/c
GLADIATOR II
(IN TELUGU) DAILY 4 SHOWS
11-45AM, 3-00PM
6-45 PM, 9-45PM
ADVANCE BOOKING OPEN ONLINE " BOOK MY SHOW"

నేడే చూడండి
అప్సర సినిమా
కంగువా
రోజూ 4 ఆటలు :
11-15AM, 2-30PM, 6-15PM, 9-30PM
www.justickets.in
www.bookmyshow.com

Capital CINEMAS 4K
TRENDSET MALL, BENZ CIRCLE
Book Online Tickets : Paytm TICKETNEW
NOW SHOWING
KANGUVA (U/A) (3D) (TEL)
10:00 AM,4:10 PM,7:15 PM,10:20 PM
GLADIATOR II (U/A) (2D) (TEL) 10:10 AM, 10:45 PM
KANGUVA (U/A) (2D) (TEL) 10:40 AM,12:05 PM
1:50 PM,3:10 PM,6:15 PM,9:20 PM
AMARAN (U/A) (TEL)
10:15 AM,1:10 PM,4:20 PM,7:30 PM,10:40 PM
LUCKY BASKHAR (U/A) (TEL) 10:20 AM,
1:20 PM,4:30 PM,7:40 PM,10:00 PM,10:55 PM
KA 2024 (U/A) (TEL)
10:50 AM,1:05 PM,4:45 PM
MATKA (U/A) (TEL)
1:30 PM,4:40 PM,7:50 PM,11:00 PM
GLADIATOR II (U/A) (2D) (ENG) 1:45 PM, 7:45 PM
THE SABARMATI REPORT (U/A) (HIN) 4:50 PM, 7:20 PM
*NOTE: Timings are subject to change without any prior notice.





రాణిగారితోటలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న కమిటీ సభ్యులు. పటమట శివాలయంలో పూజలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

రాణిగారితోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట కోదండ రామాలయంలో కార్తీకపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీగా ఆలయానికి వచ్చిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జ్వాలా తోరణం ఏర్పాటు చేసి వెలిగించారు. ఈ కార్యక్రమాన్ని మొదటిసారిగా నిర్వహించడంతో తిలకించడానికి భక్తులు భారీగా విచ్చేశారు. టీడీపీ నాయకులు కొప్పోలు శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. నాయకులు వేముల దుర్గారావు, పల్లా సాగర్ పాల్గొన్నారు.

పటమట: పటమట శివాలయంలో భక్తులు వేకువ జామునుంచే పెద్ద ఎత్తున పరమశివుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయి మేధా కోచింగ్ సెంటర్ విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ ఆధ్వర్యంలో శివయ్యకు పూజలు, అభిషేకాలు చేశారు. సాయిమేధా గ్రూప్ ఆఫ్ చైర్మన్ జి రమా నేతృత్వంలో మహాశివునికి పూజలు చేశారు.

త్రిశక్తిపీఠంలో మహాలింగార్చన అలంకారం

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత ఆలయంలో అర్ధనారీశ్వర అలంకారంలో మహాలింగార్చన అలంకారం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల మాలధారణలు

శరత్ గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం కృష్ణలంక మెట్లబజారులోని కోదండ రామాలయంలో అయ్యప్ప స్వాములకు మాలధారణలు నిర్వహించారు. అయ్యప్ప దీక్షదారులకు ఇరుముడులు కట్టి అనంతరం చద్ది (అన్నప్రసాదం) చేశారు. ఈ కార్యక్రమంలో శరత్ గురుస్వామి, దీపక్ గురుస్వామి, సురేష్ గురుస్వామి, ఎన్.సుబ్బారావు గురుస్వామి శిష్య బృందం పాల్గొన్నారు.







అర్ధనారీశ్వర అలంకారంలో మహాలింగార్చన అలంకారం, చద్ది స్వీకరిస్తున్న స్వాములు

ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖాళీ స్థలాలను ప్రజలకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు ఏపీఐఐసీ కాలనీలోని పార్కు స్థలంలో త్వరలోనే వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం 11వ డివిజన్‌లో ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజార్ పక్కన ఉన్న కార్పొరేషన్ స్థలంలో రూ.12 లక్షల 50వేల అంచనా వ్యయంతో చేపట్టిన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే పనులకు శుక్రవారం ఎమ్మెల్యే గద్దె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ ఏపీఐఐసీ కాలనీలోని మున్సిపల్ శాఖకు చెందిన ఎకరం స్థలాన్ని భద్ర పరిచేందుకు ఈ ఫెన్సింగ్ పనులను చేపట్టామన్నారు. తర్వలోనే ఈ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడేలా పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమలో కోనేరు రాజేష్, గొల్లపూడి నాగేశ్వర రావు, ముమ్మనేని ప్రసాద్, పామర్తి కిషోర్‌బాబు, కోడూరు వాసు, వీరాంజనేయులు, బెజవాడ నజీర్ కాలనీ వాసులు, అధికారులు పాల్గొన్నారు.

రాణిగారితోట: డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం రాణిగారితోట 18వ డివిజన్‌లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఈ డివిజన్‌లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డివిజన్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కుంచాల పార్వతికి ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి టిఫిన్ బండిని డివిజన్ అధ్యక్షుడు వేములు దుర్గారావు చేతుల మీదుగా అందజేశారు. కొక్కిరి తిరుపతయ్య, షైలుమూరి పీరుబాబు, గంద్ర రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

అగ్నికుల క్షత్రియ సంఘం నూతన కార్యాలయం ప్రారంభం

పటమట: 12వ డివిజన్ అయ్యప్పనగర్ శాంతి రోడ్డులో శుక్రవారం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం నూతన కార్యాలయం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. టీడీపీ ఎప్పుడూ ప్రజలతోనే, ప్రజల మధ్యలోనే ఉంటుందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటిని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే టీడీపీ నాయకుల లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బుర్రిప్రసాద్, పొట్లూరి సాయిబాబు, శాయన సత్యనారాయణ, సైకం భాస్కర రావు, చిలకలపూడి పాపారావు, మేదరమెట్ల నారాయణలు పాల్గొన్నారు.





సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులతో ప్రిన్సిపాల్, ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం ఏవీఆర్ సుబ్బారావు

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచుకోవాలి

- సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్పన

లబ్బీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, పుస్తకం ఒక జ్ఞానభాండాగారమని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన అన్నారు. 57వ జాతాయ గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ఎన్‌డీఎల్ఐ, విద్యార్థి వికాస వాహిని సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గంథ్రాలయాలకు వెళ్లి పుస్తకాలు చదవాలని, ముఖ్యంగా కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గ్రంథాలయాలకు వెళితే మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలు కళాశాలల విద్యార్థులకు క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వికాస వాహిని అధ్యక్షుడు వి.కేశవరావు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జి.ఎస్.పద్మ దాస్, కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి పాల్గొన్నారు

ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

గవర్నర్‌పేట: గ్రంథాలయాలను వినియోగించుకోవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ ఏవీఆర్ సుబ్బారావు కోరారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శన ఆయన మాట్లాడుతూ పుస్తకం ఎంతో విలువైనదని, దాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా జీవితంలో ఎన్నో విజయాలు సాధించవచ్చని సూచించారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె. రమాదేవి, ఎస్‌బీఐ మేనేజర్ విజయకుమార్, సిబ్బంది, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కరెంటు బావి స్థలానికి ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



ప్రారంభమైన ప్రహరీ నిర్మాణ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొగల్రాజపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కరెంటు బావి స్థలానికి చుట్టు ప్రహరి నిర్మాణానికి వీఎంసీ టెండర్లు పిలిచి శుక్రవారం పనులు ప్రారంభించింది. గత నెల 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గంజాయిబాబులు, పార్కింగ్‌కు అడ్డా కథనానికి అధికారులు స్పందించారు. 7వ డివిజన్‌లో జమ్మిచెట్టు సెంటర్ నుంచి శివాలయానికి వెళ్లే వీధిలో ఉన్న ఖాళీ స్థలం పాడైన వాహనాల పార్కింగ్‌కు, రాత్రి వేళ గంజాయి, మద్యం బాబులకు అడ్డాగా మారింది. 2015లో టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సమస్యను గుర్తించి ఫెన్సింగ్, లైట్లు ఏర్పాటు చేశారు. తరువాత అవి శిథిలం అయ్యాయి. ఎన్నికల ముందు వైసీపీ నాయకులు పర్యటనకు వచ్చినపుడు స్థానికులు విన్నవించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ సమస్యపై గత నెల కథనం ప్రచురితం కావడంతో ఎట్టకేలకు వీఎంసీ అధికారులు నాలుగున్నర లక్షలతో టెండర్లు పిలిచి ప్రహరి నిర్మాణం పనులు ప్రారంభించారు.

సమసమాజ స్థాపనకు గొప్ప ఆచరణవాది గోరా

- అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావు



పుస్తకావిష్కరణలో నాగేశ్వరరావు, సమరం తదితరులు

పటమట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కులమత నిర్మూలనకు, సమ సమాజ స్థాపనకు గొప్ప ఆచరణవాది గోరా అని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌ఆఫ్ ఫిజిక్స్ డాక్టర్ జె నాగేశ్వరరావు పేర్కొన్నారు. నాస్తిక కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గోరా 122వ జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాస్తికత్వమే తన ఊపిరిగా జీవించిన వ్యక్తి గోరా అని కొనియాడారు. సమరం అధ్యక్షత వహించిన సభలో గోరా ఆంగ్లంలో రచించిన పాజిటివ్ ఎథీజం న్యూ ఎడిషన్‌ను నాగేశ్వరరావు ఆవిష్కరించారు.కార్యక్రమంలో నియంత రశ్మి, సకల, డాక్టర్ మారు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జాతీయ పవర్‌లిఫ్టింగ్‌కు పీబీ సిద్ధార్థ విద్యార్థులు



విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఈ నెల 10న జరిగి రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల విద్యార్థులు పలువురు పతకాలతో సత్తా చాటారు. ఇందులో నాగశివస్వామి, ఏసీహెచ్ రామకృష్ణ, సీహెచ్ గురుబ్రహ్మం, సీహెచ్ శుభాకర్, ఎ.కాంచన్‌లు డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగి జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. రమేష్, యాజమాన్యం, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డిలు అభినందించారు.

అబాకస్‌లో పటమట విద్యార్థుల సత్తా

పటమట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతాలో ఈ నెల 10న నిర్వహించిన 21వ అంతర్జాతీయ సిప్ అబాకస్ పోటీల్లో తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారని సిప్ అబాకస్ పటమట హెడ్ మానస తెలిపారు. ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులను సిప్ అబాకస్ నిర్వాహకులు అభినందించారు. ఈ పోటీల్లో ఐదవ లెవల్‌లో డి. ఖ్యాతి చరిత శ్రీ(5వ తరగతి), ఆరవ లెవల్‌లో ఎస్ హన్విక్ సాయి(4వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచారని, ఆరవ లెవల్‌లో జె అర్జున్, ఏడవ లెవల్‌లో జి సూర్యవర్ధన్‌లు బెస్ట్ పెర్ఫార్మెన్స్ బహుమతులు పొందినట్లు మానస తెలిపారు.

యూబీఐ ఆధ్వర్యంలో నేషనల్ విజిలెన్స్ అవేర్నెస్ వీక్

ఆటోనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా కానూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో నేషనల్ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2024ను జ్ఞానోదయ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఉపాధ్యాయులు, విద్యార్థులతో బ్యాంకు సిబ్బంది పౌరుల సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎం.కృష్ణారావు, సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కానూరు బ్యాంకు మేనేజర్ ఎం. కృష్ణారావు తదితరులు

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
» బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ సంప్ర : 88024 89999
AJB-194339

» బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి. ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును స్పాట్ క్యాష్. (100% జెన్యూన్) సంప్ర. సెల్ : 945 945 3338.
AJB-194336

FLAT FOR SALE
» విజయవాడ, అయోధ్యనగర్‌లో New 3 BHK (1450 S.ft) ఫ్లాట్స్ అన్ని సౌకర్యములతో గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. 2nd, 4th & 5th ఫ్లోర్స్. 9559010777, 8008875721
AJB - 4713

PLOT FOR SALE
» VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కుచికవర్లలో DTCP, APCRDA ప్లాట్స్ చ.గ 1900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర. 93985 76997.
AJB -110

WANTED
» విజయవాడ, ఆటోనగర్‌లో, ఫుడ్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసులో పనిచేయుటకు 10th చదివి 2 వీలర్ లైసెన్స్ కల్గిన డెలివరి బాయ్స్ కావలెను. 98487 08484
AJB - 4712

» ఉద్యోగ అవకాశాలు : ఎలక్ట్రికల్ పని తెలిసి అనుభవం లేకపోయినా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కానూరులో పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. సంప్ర. సెల్ : 89858 11818
AJB - 194367

BUSINESS OFFER
» నిత్యం రద్దీగా ఉండే విజయవాడ, రాజీవ్ గాంధీ పార్క్‌లో ఫుడ్ స్టాల్స్ & షాప్స్ బిజినెస్ కొరకు సంప్రదించండి. 903 007 1111, 961 837 1111
AJB-194343

VEHICLE FOR SALE
» Renault Duster RXE DCI, Model - 2015, TS - 09 EG 7779 వాహనము దీ. 21-11-2024 న ఉదయం 10.30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్. 98665 63339, 89772 30929
AJB - 943

TO - LET
» VJA ఏలూరు రోడ్, కొత్త వంతెన సెంటర్ దుర్గా అగ్రహారం కాట్రగడ్డవారి వీధిలో D.No. 30-13/1 - 14లో 3 B/R ఇండిపెండెంట్ హౌస్ 1st ఫ్లోర్ A/C లు, గీజర్స్‌తో అద్దెకు. 94409 93388.
AJB - 4669

TO-LET COMMERCIAL
» NTR కాలనీ, మహానాడు రోడ్డులో కాకతీయ JEWEL APPT. లో 4250 చ.అ. కమర్షియల్ కాంప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్, షోరూమ్స్, బ్యాంకులకు, సూపర్ మార్కెట్స్‌కు అద్దెకు ఇవ్వబడును. సెల్ : 92464 78333
AJB - 194292

» నూరంపల్లి - నూజివీడు రోడ్డులో ALEAP ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో 8,400 S.Ft. 3 స్టేర్స్ బిల్డింగ్ కమర్షియల్ లిఫ్ట్‌తో గోడౌన్స్‌కు అద్దెకు సంప్ర. 94401 74206, 98854 61108
AJB - 194342

EDUCATION
» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-225654

REAL ESTATE
» రిషి కన్సల్టెన్సీ : మా వద్ద ఇల్లు, ఇళ్ళ స్థలములు, అపార్ట్‌మెంట్స్ అందుబాటు ధరల్లో అమ్మకమునకు కలవు. కావలసినవారు సంప్రదించగలరు. సెల్ : 73969 11007
AJB - 194284

SERVICES
» షెడ్ ఫ్యాబ్రికేటర్స్ న్యూ ఆటోనగర్, విజయవాడ, అన్ని రకముల షెడ్లు వేయబడును. జిందాల్ రేకులు, MS పైపులు, Whole Sale, Poly Corbonate Sheets, HP Screws Available. Cont: 95422 23449
AJB - 632

ACS వాటర్ ప్రూఫింగ్
★ టెర్రస్, బేస్మెంట్, బాత్రూమ్, ట్యాంక్ లీకేజీ మరియు వాల్ డ్యాంప్ శాశ్వత పరిష్కారం. నాణ్యతకు గ్యారంటీ, ఖర్చు తగ్గింపు, తక్కువ సమయంలో చేయబడును. సంప్రదించండి: Ph: 8688052198 AJH-896

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ. 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట, పెనమలూరు : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

వనం..జనం

కొండపల్లి రిజర్వు ఫారెస్టులో వీరాంజనేయుడి చెంత వనభోజనాలు..కార్తీక పూజలు


వీరాంజనేయస్వామి ఆలయం


దొంగమర్లబావి వద్ద వనభోజనాలు చేస్తున్న భక్తులు



ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తిక పౌర్ణమి సందర్భంగా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు - త్రిలోచనాపురం అటవీ ప్రాంతంలో కొండపల్లి రిజర్వు ఫారెస్టులో (దొంగమర్ల బావి)లోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పచ్చని వనాల మధ్య అడవిలో ఉన్న ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి, కార్తీక దీపాలు వెలిగించారు. ఊటలు ఊరుతున్న వాగుల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. వందల సంఖ్యలో భక్తులు దొంగమర్ల బావి సందర్శనకు వెళ్లారు.

పర్యాటక కేంద్రంగా దొంగమర్ల బావి


వాగులు దాటుకుంటూ వెళ్తున్న పర్యాటకులు




నాగపుట్టకు పూజలు చేస్తున్న భక్తురాలు



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నుంచి, ఇబ్రహీంపట్నం మూలపాడు బటర్‌ఫ్లై పార్క్ వైపు నుంచి 8 కిలో మీటర్ల దూరంలో కొండపల్లి రిజర్వు ఫారెస్టులోని దొంగమర్ల బావి పర్యాట కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇది మూలపాడు, కొండపల్లి, జుజ్జూరు, దుర్గిరాలపాడు ఫారెస్టు బీట్స్‌కు మధ్యలో ఉంటుంది. కార్తీక మాసంలో అధిక సంఖ్యలో పర్యాటకులు దొంగమర్ల బావి వద్దకు వెళుతుంటారు. ఒక దారి మూలపాడు మీదుగా ఉంటే మరో దారి జి.కొండూరు మండలం గడ్డమణుగులోయ మీదుగా ఉంది. వందల ఏళ్ల నాటి ఘాట్ రోడ్ల మీదుగా ఇక్కడకు చేరుకోవాల్సి ఉంటుంది. అత్యధికులు గడ్డమణుగు మీదుగానే వెళుతుంటారు. ఇటునుంచి ఊటలు ఉన్న మూడు వాగులు దాటి అందమైన వనాల మధ్య అహ్లాదంగా ఉంటుంది. గడ్డమణుగు లోయ నుంచి వెళ్లినా 8 కిలోమీటర్ల దూరం. కార్తీక మాసంలోనే కాక ప్రతి ఆదివారం దొంగమర్ల బావి వద్దకు పర్యాటకులు వెళుతుంటారు. అక్కడున్న వీరాంజనేయ స్వామి కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల విశ్వాసం. సరైన దారి సౌకర్యం లేకపోవడంతో అతి కష్టం మీద అక్కడకు చేరుకుంటున్నారు. ఆహ్లాదకరమైన వాతావ రణం మధ్య గడపడంతో వెళ్లేందుకు పడిన ఇబ్బందులన్నీ మర్చిపోతుంటారు.

దొంగమర్ల బావి అని ఎందుకంటారంటే..

బ్రిటీష్ కాలంలో దోపిడీ దొంగలు చుట్టు పక్కల గ్రామాల్లో దోపిడీలకు పాల్పడి, వారు దోచుకున్న సొమ్మును అక్కడకు వెళ్లి అక్కడున్న బావిలో తాగి, వాటాలు పంచుకుని రోజంతా అక్కడగడిపే వారు. అందుకనే ఆ బావికి దొంగమర్ల బావి అని పేరు వచ్చింది. ప్రస్తుతం ఆబావి పాడుపడి ఉంది.


'బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష' పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

68 లక్షల మంది విద్యార్థులకు

ఉచిత వైద్యపరీక్షలు

» బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష ప్రారంభంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్

మొగల్రాజపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం ద్వారా 18 ఏళ్ల లోపు పిల్లల్లో 44 ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి పరీక్షలు చేసి, ఉచిత చికిత్స అందిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు, పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 68 లక్షల మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. చిన్నతనంలోనే పిల్లల్లో వ్యాధులు, లోపాలను గుర్తించి సత్వర చికిత్స అందించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం.' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. పటమట కోనేరు బసవయ్యచౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ద్వారా 639 భవిత సెంటర్ల ద్వారా పిల్లల్లో గ్రహణమొర్రి, కంటి, గుండె సంబంధిత వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తామని మంత్రి తెలిపారు. బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమంపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, పాఠశాల విద్యా డైరెక్టర్ వి.విజయ్‌రామరాజు, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వాకాటి కరుణ, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో పౌరసరఫరాల అధికారులు

268 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

మొగల్రాజపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ పాడుబడిన గోదాములో రేషన్ బియ్యం భారీ డంప్‌ను గురువారం రాత్రి పౌరసరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్టేట్ 2వ రోడ్డులో కొందరు గొడవ పడుతున్నారని, పటమట పోలీసులకు సమాచారం వచ్చింది. సిబ్బందితో ఎస్ఐ రేవతి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి గొడవ పడుతున్న వారు పరారయ్యారు. అక్కడ పరిశీలిస్తే గోదాములో బియ్యం బస్తాలు కనిపించాయి. వెంటనే డీఎస్వో పాపారావుకు ఆమె సమాచారం ఇచ్చారు. డీఎస్వో తన సిబ్బందితో వచ్చి పరిశీలిస్తే 26,890 కిలోల బియ్యం(268 క్వింటాళ్లు) తెల్ల సంచుల్లో ప్యాకింగ్ చేసి రవాణాకు సిద్ధంగా ఉన్నాయి. గోత్రపు రమేష్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు గుర్తించారు. అతనిపై 6ఏ కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కొండపల్లిలో ఉన్న బీఎస్ ఆగ్రోస్ రైస్ మిల్లులో భద్రపరిచారు.

ఖజానాకు భారంగా మారారని

ఏడుగురు అదనపు పీపీల తొలగింపు

విజయవాడ లీగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భారతీయ నాగరిక సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్) చట్టం అమల్లోకి రావడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులు మనుగడలో లేవు. దీంతో అందులో పని చేస్తున్న కృష్ణాజిల్లాకు చెందిన ఏడుగురు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ప్రభుత్వ ఖజానాకు భారంగా మారారని, వారిని తొలగిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. వీరితో పాటు తిరుపతిలో ఎర్రచందనం కేసులను చూసే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కూడా తొలగిస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసే మురాల లక్ష్మీ వెంకటేష్‌బాబు, విజయవాడలోని 5వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ చామర్తి శ్రీరామచంద్రమూర్తి, విజయవాడలోని 4వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ సంకా పరమేశ్వరరావు, విజయవాడలోని 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అదనపు పీపీ జి.మాలతి, గుడివాడలోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ నీలం బెంజిమన్, నూజివీడులోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ జంగం దేవదాస్ గాంధీ, అవనిగడ్డలోని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పీపీ చిట్టిప్రోలు వెంకట కృష్ణప్రసాద్, తిరుపతిలోని ఎర్రచందనం కేసులను చూసే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.నగేష్‌ను తొలగిస్తూ డీపీపీ ఆదేశాలు జారీ చేశారు.


గిరిప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈవో రామారావు దంపతులు

వైభవంగా గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన గంగ, పార్వతి, మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల గిరి ప్రదక్షిణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో వైభవంగా సాగింది. మహిళా భక్తుల లలితా సహస్రనామ పారాయణం, జై దుర్గ, జైజై దుర్గ నినాదాలు, మంగళవాయిద్యాలు, జయజయ ధ్వానాల మధ్య 8 కిలోమీటర్ల పొడవునా గిరి ప్రదక్షిణ కొనసాగింది. మార్గం మధ్యలో భక్తులు పసుపు జలాల వారు పోసి, టెంకాయలు కొట్టి, పూలు, పండ్లు, హారతులు సమర్పించారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ వద్ద ఉత్సవమూర్తులకు లఘుపూజ చేశాక, ఈవో రామారావు దంపతులు, ముఖ్య అర్చకుడు శ్రీనివాసశాస్త్రి కొబ్బరికాయల బలిహరణలు ఇచ్చారు. ఉత్సవమూర్తులు కొలువైన ప్రత్యేక వాహనాన్ని ఈవో దంపతులు, ముఖ్య అర్చకులు భక్తులు లాగారు. కార్తీక పౌర్ణమి, శుక్రవారం దృష్ట్యా లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గగుడిలో అన్నవితరణ నిమిత్తం శుక్రవారం గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన దామినేని హర్ష, విజయవాడ మాచవరం ప్రాంతంలోని గులాం మొహీద్దీన్‌నగర్‌కు చెందిన అవాల సూర్యారావు, ఆయన కుటుంబ సభ్యులు రూ.లక్ష చొప్పున విరాళం ఇచ్చారు. దుర్గమ్మను మహిళా ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కొల్లా లలితకుమారి దర్శించుకున్నారు.

విద్యారంగ సమస్యలు

పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

ధర్నాచౌక్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభ హనుమాన్‌పేటలోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలని, నిత్యావసర ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ మెస్‌బిల్లులు పెంచాలని, కాస్మోటిక్, మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కె.శివారెడ్డి, దోనేపూడి శంకర్, జి. కోటేశ్వరరావు, రావుల రవీంద్రనాథ్, పరుచూరి రాజేంద్ర, లంకా గోవింద్, సాయికుమార్ పాల్గొన్నారు.

బాలోత్సవం ప్రారంభం

మొగల్రాజపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో అమరావతి బాలోత్సవం 7వ పిల్లల పండుగ మూడు రోజుల కార్యక్రమాన్ని శుక్రవారం బాలోత్సవ్ గౌరవాధ్యక్షుడు ప్రముఖ విద్యావేత్త, పారిశ్రామికవేత్త చలువాది మల్లికార్జునరావు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు పాల్గొన్నారు. మొదటి రోజు కార్టూన్, పోస్టర్ ప్రజంటేషన్, వ్యాసరచన (ఇంగ్లీషు, తెలుగు), మట్టిబొమ్మల తయారీ, తెలుగు డిక్టేషన్, అంతర్జాలంలో అన్వేషణ, కవితా రచనా, స్పెల్ బీ, ఉత్తరం రాయడం, జానపదనృత్యం, ఫాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ; క్లాసికల్ డాన్సు, లఘు నాటిక, దేశభక్తి గీతం వంటి అంశాల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించారు. 20 వేదికలపైన 60 అంశాల్లో 200 పాఠశాలలకు చెందిన 12వేల మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారని బాలోత్సవ్ అధ్యక్షుడు రామారావు కార్యదర్శి కొండలరావు తెలిపారు. ఎస్‌బీఐ డీజీఎం మనీష్ కుమార్‌సింగ్, క్రెడాయ్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, విదార్థులు, పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నగరంలో దేవకీనందన వాసుదేవ సందడి


హీరోయిన్ మానస వారణాసి, హీరో అశోక్ గల్లా

పటమట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నటుడు మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటించిన దేవకీనందన వాసుదేవ చిత్ర యూనిట్ ప్రమోషన్‌లో భాగంగా నగరంలో సందడి చేసింది. ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించింది. హను మాన్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ అందించిన కథతో దర్శకుడు అర్జున్ జంధ్యాల నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అశోక్ గల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన టీజర్, పాటలకు విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. హీరోయిన్‌గా మానస వారణాసిని పరిచయం చేస్తున్నామని, ఆమె నటన ఆకట్టుకుందని తెలిపారు. ఈ చిత్రంలో తన మేనమామ మహేష్‌బాబు కృష్ణుడి పాత్రలో నటించాడని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని అశోక్ గల్లా తెలిపారు. నిర్మాత బాలకృష్ణ సోమినేని పాల్గొన్నారు.


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు

వ్యవసాయ పనిముట్లకు నష్టపరిహారం ఇవ్వాలి

» మంత్రి అచ్చెన్నాయుడుకు కౌలు రైతుల సంఘం వినతి

గవర్నర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది, బుడమేరు వరదల కారణంగా పాడైపోయిన వ్యవసాయ పనిముట్లకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నేతలు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడిని కోరారు. శుక్రవారం ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. పాడైన మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను ఎన్యూమరేషన్ చేసి, మరమ్మతులు చేసుకునేందుకు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంట పొలాలను వ్యవసాయానికి అనుకూలంగా తీసుకురావడానికి, మేటలు వేసిన ఇసుక, మట్టిని తొలగించుకునేందుకు కౌలురైతులకు వరికి ఎకరానికి రూ. 25 వేలు, పసుపు, కంది వాణిజ్య పంటలకు పెట్టుబడి మేరకు రూ.60 వేల నుంచి రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఉమ్మడి కృష్ణా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్త్రీ, పురుష జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. స్త్రీలు 75 కిలోల లోపు, పురుషులు 85 కేజీల లోపు ఉండాలని, క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డులతో ఎంపిక చేసే ప్రాంగణానికి హాజరు కావాలని ఆయన సూచించారు. వివరాలకు 97040 63555 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరల్డ్ రికార్డు కోసం జానపద నృత్యం నేడు

గవర్నర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఏషియన్ వరల్డ్ రికార్డు సంస్థల సమక్షంలో శనివారం విజయవాడలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో విద్యార్థులు జానపద నృత్యం నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 400 మంది విద్యార్థులు భారతదేశపటం ఆకారంలో 28 రాష్ట్రాలకు సంబంధించిన సంప్రదాయ జానపద నృత్యాలు చేసి వరల్డ్ రికార్డును సాధించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, రాజ్‌భవన్ జాయింట్ సెక్రటరీ జె.సూర్యప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

ఎంఆర్ఐ మిషన్లకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సర్వజనాసుపత్రిలో ఎట్టకేలకు ఎంఆర్ఐ మిషన్లు పని చేయడం ప్రారంభించాయి. 'మొరాయిస్తున్న ఎంఆర్ఐ యంత్రాలు' పేరుతో ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించారు. ఎంఆర్ఐ మిషన్లకు మరమ్మతులు చేయించారు. దీంతో అవి పని చేయడం ప్రారంభించాయి. రోగుల ఇబ్బందులు తొలగిపోయాయి.


జీవన మంజూష పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెస్తా

» గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

విజయవాడ కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి, మూడు నెలల్లో గాడిన పెడతానని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నవమల్లెతీగ మాసపత్రిక-కామ్రేడ్ జీఆర్‌కే-పోలవరపు సాంస్కృతిక సమితి అధ్వర్యంలో బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంజు యనమదల రచించిన 'జీవన మంజూష' వ్యాస సంపుటిని గోనుగుంట్ల ఆవిష్కరించారు. సమాజాన్ని చదివిన రచయితల రచనలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని మంజు యనమదల రాసిన ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ ఆ కోవకు చెందినవేనని సభకు అధ్యక్షత వహించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు. రచయిత డాక్టర్ ఎం.ప్రభాకర్, గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

26న జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు

» రైతులు, కార్మికులు జయప్రదం చేయాలి

» వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపు

ధర్నాచౌక్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రైతు, కార్మిక ప్రదర్శనలు, సభలు, ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 'డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ 2' పథకం ద్వారా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌పరం చేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, రైతు నేత కేశవరావు, రైతుకూలీ సంఘం అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, పి.జమలయ్య పాల్గొన్నారు.



ధ్వంసం చేసిన అనధికార అంతస్తులోని ఓ భాగం

జోజినగర్‌లో అదనపు అంతస్తు ధ్వంసం

భవానీపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : 45వ డివిజన్‌లోని జోజినగర్‌లోని స్టిల్టు జీ ప్లస్ 2కు అనుమతి తీసుకుని అదనంగా నిర్మించిన అంతస్తును ధ్వంసం చేశారు. 'నాడు సక్రమం..నేడు అక్రమం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. సిటీ ప్లానర్ ప్రసాద్ ఆదేశాల మేరకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీగౌడ్ పర్యవేక్షణలో సిబ్బంది పలుచోట్ల భవనాన్ని ధ్వంసం చేశారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని మురళీ హెచ్చరికలు జారీ చేశారు.

బాడీ బిల్డింగ్ ప్రపంచ పోటీల్లో

వరప్రసాద్‌కు రజతం


వరప్రసాద్‌ను అభినందిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్‌లో ఈనెల 9, 10 తేదీల్లో యునైటెడ్ వరల్డ్ స్పోర్ట్స్, ఫిట్‌నెస్, ఫిట్‌నెస్ చాంపియన్‌షిప్ ఫెడరేషన్లు నిర్వహించిన శరీర సౌష్టవ పోటీల్లో విజయవాడ రైల్వే ఆఫీసర్ల క్లబ్ జిమ్ హెల్పర్ తుమ్మల వరప్రసాద్ రజత పతకం గెలుచుకున్నారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, ఏడీఆర్ఎం పి.ఎడ్విన్ శుక్రవారం వరప్రసాద్‌ను అభినందించారు. వరప్రసాద్ ఇప్పటికే రాష్ట్ర, జాతీయస్థాయిల్లో అనేక పతకాలు పొందారు. ఇటీవల 50 ప్లస్ మిస్టర్ ఆంధ్రా పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. వరప్రసాద్‌ను సీనియర్ డీపీవో కట్టా అనంద్, పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, రైల్వే అధికారులు అభినందించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 16 నవంబరు 2024
cinema@andhrajyothy.com

'డాకు మహారాజ్'గా బాలకృష్ణ



నందమూరి అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురు చూస్తున్న చిత్రం పేరు 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకొని, సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. శుక్రవారం ఈ చిత్రం టైటిల్‌ని ప్రకటించి, టీజర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి 'డాకు మహారాజ్' అనే టైటిల్‌ని పెట్టారు. టైటిల్‌కి తగ్గట్టుగానే టీజర్ అద్భుతంగా ఉంది. 'ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది. గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మ రాజుది. మరణాన్ని వణికించిన మహారాజుది' అంటూ 'డాకు మహారాజ్'గా బాలకృష్ణను పరిచయం చేసిన తీరు అదిరిపోయింది. మునుపెన్నడూ చూడని సరికొత్త రూపంలో గుర్రంపై బాలకృష్ణ ఎంట్రీ ఇచ్చారు. టీజర్‌లోని ప్రతి ఫ్రేమ్‌లో భారీతనం కనిపిస్తుంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. తమన్ నేపథ్య సంగీతం టీజర్‌ని మరోస్థాయికి తీసుకెళ్లింది. ఈ సందర్భంగా దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ 'టీజర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. మీరు చూసిన టీజర్‌లో డూపులు లేరు. బాలకృష్ణనే నిజంగా చేశారు. గుర్రం ఎక్కింది ఆయనే, నడిపింది ఆయనే, యుద్ధానికి వచ్చేది కూడా ఆయనే. మీరు చూసినవన్నీ ఒరిజినల్ షాట్స్ తమన్ అద్భుతమైన సంగీతం అందించారు' అని అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'బాలకృష్ణని చాలా కొత్తగా చూపించాలని నేనూ, దర్శకుడు బాబీ ముందు నుంచి అనుకుంటున్నాం. టీజర్‌లో మీరు చూసింది చాలా చిన్నది. సినిమాలో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి' అని అన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ 'బాబీ చాలా గొప్ప సినిమా తీశారు. బాలయ్యతో ఇది నా ఐదో సినిమా. ఆయనతో పని చేయడం సంతోషంగా ఉంది' అని అన్నారు. 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

మ్యూజిక్ స్కూల్ ఏర్పాటు చేస్తా

- తమన్



సంగీత దర్శకుడు తమన్ వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. రీసెంట్‌గా 'పుష్ప-2' బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పనుల్ని పూర్తి చేశారు. ప్రస్తుతం 'ఓజీ, రాజాసాబ్, గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్' వంటి చిత్రాలతో తమన్ ఫుల్ బిజీగా ఉన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ విశేషాలు...

- ఒకప్పుడు రొటీన్ చిత్రాలు వచ్చేవి. కానీ ఇప్పుడు డిఫరెంట్ కథలు, రకరకాల కాన్సెప్ట్‌లు వస్తున్నాయి. కాబట్టి డిఫరెంట్ మ్యూజిక్ ఇస్తున్నాను. 'తెలుసు కదా', 'ఓజీ', 'గేమ్ ఛేంజర్', 'డాకు మహారాజ్' ఇలా దేనికవే డిఫరెంట్‌గా ఉన్నాయి.
- 'డాకు మహారాజ్' చిత్రంలో మూడు పాటలే ఉంటాయి. గేమ్ ఛేంజర్‌లో ఏడు పాటలు ఉంటాయి. ఏడు సంవత్సరాల తర్వాత శంకర్ ఒక ప్రాపర్ కమర్షియల్ మూవీ చేస్తున్నారు. 15 రోజుల్లో 'పుష్ప-2' సినిమా కంప్లీట్ చేయమన్నారు. అది సాధ్యం కాదు. అందుకే నాకున్న టైమ్‌లో ఫస్ట్ హాఫ్‌ను దాదాపుగా కంప్లీట్ చేశాను.
- ఏ.ఆర్.రెహ్మాన్ స్థాయికి వెళ్లాలి అనేది నా కల. 'బాయ్స్' టైమ్‌లో డైరెక్టర్ శంకర్ నాలో యాక్టర్‌ని చూశారు. నేను మంచి మ్యూజిక్ డైరెక్టర్‌ని అని గుర్తించేందుకు ఇన్నేళ్లు పట్టింది. ఒకప్పుడు మూస ధోరణిలో ఉన్న సినిమాలకు కంటిన్యూగా మ్యూజిక్ ఇస్తూ వచ్చాను. ఆ టైమ్‌లో కాపీ క్యాట్, కాపీ గోట్ అని ట్రోల్ చేశారు. మళ్లీ అలాంటి చిత్రాలను సెలెక్ట్ చేసుకోవడం లేదు.
- మ్యూజిక్ స్కూల్ నిర్మించాలని నా కోరిక. మూడేళ్లలో వరల్డ్‌క్లాస్ స్కూల్‌ని హైదరాబాద్‌లో కడతాను. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా సంగీతం నేర్పించాలని అనుకుంటున్నాను. మ్యూజిక్ ఉన్న చోట క్రైమ్ రేట్ తక్కువగా ఉంటుంది. నేను క్రికెట్ ఆడి వస్తే... వెంటనే ఓ ట్యూన్ వస్తుంది. క్రికెట్ ఆడటంలో నాకు చాలా ఆనందం ఉంది.




సూర్య కెరీర్‌లో అత్యధిక వసూళ్లు

- నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా

దర్శకుడు శివ, హీరో సూర్య కాంబినేషన్‌లో తెరకెక్కిన మూవీ 'కంగువ'. ఇటీవలే విడుదలైన ఈ సినిమా మంచి ప్రేక్షకాదరణను పొందుతోంది. ఈ నేపథ్యంలో 'కంగువ' సక్సెస్ గురించి చిత్ర నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా మీడియాతో మాట్లాడుతూ 'మేము పడిన మూడేళ్ల కష్టానికి ఫలితంగా ప్రేక్షకులు ఘన విజయాన్ని అందించారు. మంచి చిత్రాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకుల టేస్ట్ మరోసారి వెల్లడైంది. 'తమిళ్ కంటే తెలుగులో 'కంగువ'కు కలెక్షన్స్ వస్తున్నాయి. ఇప్పటి వరకు సూర్య సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'కంగువ' నిలుస్తుంది. 'కంగువ-2' సినిమాలో దీపిక పదుకొనేను హీరోయిన్‌గా తీసుకుంటున్నామనే వార్తలో నిజం లేదు. ఇంకా ఆ మూవీ వర్క్ స్టార్ట్ చేయలేదు. సూర్య చేసిన డిఫరెంట్ రోల్స్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది" అని అన్నారు

అభ్యుదయ వాది.. ఎందరికో మార్గదర్శి!

తాతినేని ప్రకాశరావు శత జయంతి సంవత్సరం పూర్తి



తెలుగు సినిమా స్వర్ణయుగానికి చెందిన దర్శకుల్లో ఒకరు, ఉత్తమాభిరుచితో విజయవంతమైన చిత్రాలను అందించిన వ్యక్తి తాతినేని ప్రకాశరావు. కృష్ణాజిల్లా కపిలేశ్వరపురం గ్రామంలో 1924 నవంబర్ 16న జన్మించిన ప్రకాశరావు ప్రజానాట్యమండలి కళాకారుడు. అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి. నికార్సయిన కమ్యూనిస్ట్. సినిమాల ద్వారా తన భావాలను ప్రజలకు చెప్పాలనీ, వారిని చైతన్యవంతుల్ని చేయాలనే ఉద్దేశంతో 1947లో చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. ఎల్వీ ప్రసాద్ దగ్గర శిష్యుడిగా చేరి 'ద్రోహి', 'మనదేశం' చిత్రాలకు పని చేశారు. ఆ తర్వాత విజయా సంస్థలోని దర్శకత్వ శాఖలో చేరారు. 'పాతాళభైరవి', 'పెళ్లి చేసి చూడు' చిత్రాలకు పని చేశారు. 'పెళ్లి చేసి చూడు' చిత్రానికి పని చేస్తున్న సమయంలోనే 'పల్లెటూరు' (1952) చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది. ఇక అప్పటి నుంచి 30 ఏళ్ల పాటు దర్శకుడిగా, నిర్మాతగా ప్రకాశరావు సినీజీవితం విజయవంతంగా సాగింది. రాశి కంటే వాసికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ 30 ఏళ్ల కాలంలో కేవలం 30 చిత్రాలు మాత్రమే రూపొందించగలిగారు ప్రకాశరావు. ఇందులో తెలుగు చిత్రాలే కాదు తమిళ, హిందీ చిత్రాలు కూడా ఉన్నాయి. కుటుంబ సంబంధాలకు, ఆ నాటి సమాజంలోని సమస్యలకు అద్దం పట్టిన చిత్రాలనే ఎక్కువగా ఆయన రూపొందించారు. అందుకే ఆయన సామాన్య ప్రేక్షకుడికి దగ్గర కాగలిగారు. తను అనుకున్న లక్ష్యం సాధించగలిగారు. ప్రకాశరావు దర్శకత్వం వహించిన చిత్రాలు అధిక శాతం విజయం సాధించడం గమనార్హం. శనివారంతో ప్రకాశరావు శత జయంతి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఆయన సినీ జీవిత చిత్రంలోని కొన్ని రీళ్లు..

- తాతినేని ప్రకాశరావు దర్శకత్వం వహించిన రెండో చిత్రం 'పిచ్చిపుల్లయ్య'. ఇది నిర్మాతగా ఎన్టీఆర్‌కు తొలి సినిమా కావడం విశేషం. మాస్ హీరోగా ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తి విభిన్నంగా ఉండే పల్లెటూరి బైతు పాత్రను ఎన్టీఆర్ ఇందులో పోషించడం విశేషం.
- ఆ రోజుల్లోనే ఆయన మల్టీస్టారర్ చిత్రాలకు దర్శకత్వం వహించారు. - ఎన్టీఆర్, ఏయన్నార్ కలసి నటించిన రెండు చిత్రాలు 'చరణదాసి', 'పరివర్తన' తాతినేని ప్రకాశరావు దర్శకత్వంలో రూపుదిద్దుకున్నాయి. 'చరణదాసి' చిత్రంలోని ఓ స్వప్న సన్నివేశంలో ఎన్టీఆర్ శ్రీరాముడిగా, అంజలీదేవి సీతగా కనిపిస్తారు. ఎన్టీఆర్ తొలిసారిగా శ్రీరాముడి గెటప్ వేసుకుంది ఈ చిత్రంలోనే. అలాగే 'పరివర్తన' చిత్రంలో ఏయన్నార్ హీరో అయితే, విలన్‌గా ఎన్టీఆర్ నటించడం మరో విశేషం. ఇందులో అక్కినేనికి చెల్లెలిగా, ఎన్టీఆర్‌కు భార్యగా సావిత్రి నటించారు.
- హిందీలో దాదాపు పది చిత్రాలకు దర్శకత్వం వహించారు ప్రకాశరావు. తెలుగు, తమిళ సినిమాల జోలికి పోకుండా ఆయన ఎనిమిదేళ్ల పాటు హిందీ చిత్రాల మీదే దృష్టి పెట్టడం గమనార్హం.
- ముగ్గురు ముఖ్యమంత్రులు ఎమ్జీఆర్, ఎన్టీఆర్, జయలలితలను డైరెక్ట్ చేసిన ఘనత తాతినేని ప్రకాశరావుదే.
- ఎన్టీఆర్‌ను 'బావగారు' అని పిలిచేవారు ప్రకాశరావు. ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు మద్దతు పలికారు. తెలుగుదేశం పార్టీకి కోశాధికారిగా వ్యవహరించిన ప్రకాశరావు ఒక దశలో ఎన్టీఆర్‌తో విభేదించి, ఆయనకు వెన్నుపోటు పొడిచిన నాదెళ్ల భాస్కరరావుకు మద్దతు పలకడం ఆసక్తికర పరిణామం.
- ప్రకాశరావు తనయుడు ప్రసాద్ కూడా దర్శకుడై తండ్రికి తగ్గ తనయుడనిపించుకున్నారు. ప్రసాద్ కుమారుడు సత్య కూడా దర్శకుడిగా మారడం గమనార్హం. ఇలా ఒకే కుటుంబంలో మూడు తరాలకు చెందిన వాళ్లు దర్శకులు కావడం అరుదైన విషయమే.

రాజీ కోసం ప్రయత్నించండి

చెన్నై కోర్టు సూచన



తన భార్య ఆర్తి నుంచి విడాకులు కోరుతూ తమిళ హీరో జయం రవి దాఖలు చేసిన విడాకుల పిటిషన్ శుక్రవారం చెన్నై ఫ్యామిలీ కోర్టులో విచారణకు వచ్చింది. ఆ సమయంలో కోర్టుకు జయం రవి నేరుగా హాజరు కాగా, ఆర్తి మాత్రం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులోకి వచ్చారు. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన న్యాయస్థానం.. రాజీ కోసం మరోసారి ఇద్దరూ కలిసి మాట్లాడుకోవాలని, ఇందుకోసం మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయించాలని సూచించింది. అంతేగాక కచ్చితంగా విడిపోవాలని నిర్ణయించుకుంటే అందుకు స్పష్టమైన కారణం చూపాలని పేర్కొంది.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)



రానా సెలబ్రిటీ షో

సెలబ్రిటీల జీవితాల్లో ఎవరికీ తెలియని కోణాలను ఆవిష్కరించే వెబ్ సిరీస్ 'ద రానా దగ్గుబాటి షో' ఈనెల 23 నుంచి ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. రామానాయుడు స్టూడియోలో శుక్రవారం ఈ 'షో'కు సంబంధించిన ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. స్పిరిట్ మీడియా బేనర్‌పై రానా నిర్మించి హోస్ట్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ 'ఈ షో ఎనిమిది ఎపిసోడ్లు ఉంటుంది. 240 దేశాల్లో ప్రైమ్ వీడియో ద్వారా స్ట్రీమింగ్ అవుతుంది. ఇది పూర్తిగా అన్‌స్క్రిప్టెడ్ ఒరిజినల్ సిరీస్' అని తెలిపారు.

బిజినెస్

పెళ్లిళ్ల ఖర్చులకు రుణాలు

మ్యాట్రిమోని.కామ్

చెన్నై: పెళ్లిళ్లు కుదర్చడమే కాదు. ఆ పెళ్లిళ్లకు అయ్యే ఖర్చులకూ రుణాలు ఇస్తామంటోంది ప్రముఖ మ్యాచ్‌మేకింగ్ సేవల సంస్థ మ్యాట్రిమోని.కామ్. ఇందుకోసం ఏకంగా వెడ్డింగ్‌లోన్స్.కామ్ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభించింది. ఈ రుణాల కోసం ఐడీఎఫ్‌సీ, టాటా క్యాపిటల్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ వంటి ఆర్థిక సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. తమ ద్వారా రుణాలు తీసుకునే జంటలకు వెడ్డింగ్ ప్లానింగ్, బడ్జెట్, వీలైనంత తక్కువ ఖర్చుతో పెళ్లి తంతు ముగిసేందుకు అవసరమైన సేవలు, వారి ఆర్థిక భద్రతకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా ఇస్తామని కంపెనీ సీఈఓ జానకీరామన్ తెలిపారు.

యూనిఫై అసెట్ మేనేజ్‌మెంట్‌కు సెబీ ఆమోదం

చెన్నై: యూనిఫై క్యాపిటల్ పూర్తి అనుబంధ విభాగమైన యూనిఫై అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్.. మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నుంచి అమోదం తెలిపింది. పోర్ట్‌ఫోలియో మేనేజర్‌గా 2001లో ప్రస్థానాన్ని ప్రారంభించిన యూనిఫై క్యాపిటల్ ఈ అక్టోబరు 31 నాటికి ఈక్విటీ, డెట్ పోర్ట్‌ఫోలియోల్లో మొత్తం రూ.27,000 కోట్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తోంది.

మరింత తగ్గిన ఫారెక్స్ నిల్వలు

ముంబై: ఈనెల 8తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు మరో 647.7 కోట్ల డాలర్లు తగ్గి 67,565.3 కోట్ల డాలర్లకు పడిపోయినట్లు ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 267.5 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. సెప్టెంబరు చివర్లో 70,488.5 కోట్ల డాలర్ల వద్ద సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసిన ఫారెక్స్ నిల్వలు.. గత కొన్ని వారాలుగా మళ్లీ తగ్గుతూ వచ్చాయి.

మార్కెట్ దారెటు..?

ఇప్పటికే 10 శాతం పతనమైన సూచీలు .. మున్ముందు మరింత క్షీణించేనా..?

మళ్లీ పుంజుకునే సమయం వచ్చేసిందా..?



మన స్టాక్ మార్కెట్ పతనం ఎందాకా..? ప్రస్తుతం ఈక్విటీ మదుపరుల మదిని తొలచి వేస్తున్న ప్రశ్న ఇదే. ఎందుకంటే, రెండు నెలల క్రితం వరకు అలుపెరుగని పరుగులో రోజుకో రికార్డు సృష్టించిన సెన్సెక్స్, నిఫ్టీ.. అనూహ్యంగా తిరోగమన బాట పట్టాయి. ఎంత వేగంగా ఎగబాకాయో.. అంతే త్వరగా జారుకుంటున్నాయి. సూచీలకు పట్టు దొరికేదెప్పుడు...? మళ్లీ ఎగిసేదెప్పుడు..? అని ఇన్వెస్టర్లు నిశితంగా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

> మార్కెట్ మరింత దిద్దుబాటుకు లోనుకావచ్చు. ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు ప్రస్తుత స్థాయిలో కొనసాగితే ఈ ఏడాది చివరినాటికి నిఫ్టీ మరో 10 శాతం మేర క్షీణించే ప్రమాదం ఉంది.
> **- జై బాల, క్యాష్‌దికావోస్.కామ్**

ముంబై: ఈ ఏడాది సెప్టెంబరు 27న నమోదైన సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిలతో పోలిస్తే, స్టాక్ మార్కెట్ సూచీలు ఇప్పటికే 10 శాతానికి పైగా క్షీణించాయి. సెన్సెక్స్ 8,400 పాయింట్లు కోల్పోయి 77,580 వద్దకు, నిఫ్టీ 2,750 పాయింట్లు నష్టపోయి 23,532 వద్దకు జారుకున్నాయి. అంతేకాదు, దాదాపు రూ.50 లక్షల కోట్ల మార్కెట్ సంపద హరించుకుపోయింది. ఇందుకు కారణాలనేకం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, మార్కెట్లో చాలా కంపెనీల షేర్ల ధరలు సహేతుక స్థాయిని మించిపోవడం, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గత 6 వారాలుగా మన మార్కెట్లో పెద్దఎత్తున అమ్మకాలకు పాల్పడుతుండటం వంటి పరిణామాలు సూచీలను కుప్పకూల్చాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపర్చే అంశాలేమీ లేకపోవడంతో సూచీల పతనం ఇప్పట్లో ఆగకపోవచ్చని కొందరు ఈక్విటీ నిపుణులు అభిప్రాయపడగా.. మార్కెట్ ఇప్పటికే 10% దిద్దుబాటుకు లోనైనందున గతంలో లాగే వాల్యూ బైయింగ్‌తో సూచీలు మళ్లీ అప్‌టర్న్ తీసుకునే అవకాశాల్లేకపోలేవన్న అంచనాలూ వ్యక్తమవుతున్నాయి.

ఎందుకంటే.. 2022 సెప్టెంబరు, 2023 మార్చిలోనూ నిఫ్టీ 10% పతనమై మళ్లీ వెంటనే పుంజుకుంది. ప్రస్తుతం నిఫ్టీ 23,500 స్థాయిలో ట్రేడవుతోంది. ఈ స్థాయిలో నిలదొక్కుకోగలిగితే గనక సూచీ మళ్లీ ర్యాలీ తీయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ 23,500 స్థాయినీ కోల్పోతే, సూచీ క్రమంగా 23,000-22,500 స్థాయిల వరకు జారుకోవచ్చన్న అంచనాలున్నాయి.

మళ్లీ భారత్ పైకి సీఎల్ఎస్ఏ దృష్టి

అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ అనూహ్యంగా యూటర్న్ తీసుకుంది. తన దృష్టిని చైనా నుంచి తిరిగి భారత్ పైకి మళ్లించింది. చైనాలో పెట్టుబడులను తగ్గించుకుని, భారత మార్కెట్లో పెట్టుబడుల కేటాయింపును 20 శాతానికి పెంచాలని నిర్ణయం తీసుకుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో చైనా వాణిజ్యపరమైన సవాళ్లు ఎదుర్కోవచ్చన్న అంచనాల నేపథ్యంలో తన దృష్టిని భారత్ వైపు మళ్లించినట్లు తాజా నివేదికలో పేర్కొంది. గత నెల తొలివారంలో చైనా ఆర్థిక వ్యవస్థకు, స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చేందుకు భారీ ఉద్దీపన చర్యలు ప్రకటించింది. దాంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను భారత మార్కెట్ నుంచి చైనాకు తరలించారు. సీఎల్ఎస్ఏ సైతం భారత మార్కెట్ కేటాయింపులను 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించి, చైనా మార్కెట్ కేటాయింపులను 5 శాతానికి పెంచింది. కానీ, ట్రంప్ విజయం అనంతరం సీఎల్ఎస్ఏ మళ్లీ తన వ్యూహాన్ని మార్చుకోవాల్సి వచ్చింది.

అక్టోబరు నుంచి ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు మన మార్కెట్ నుంచి రూ.1.14 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. మున్ముందు మరిన్ని పెట్టుబడులను తరలించే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనూ సీఎల్ఎస్ఏ తన వైఖరిని మార్చుకోవడం గమనార్హం. చైనా ఇప్పటికే ప్రతి ద్రవ్యోల్బణం, యువతలో పెరుగుతున్న నిరుద్యోగత, స్థిరాస్తి రంగంలో సంక్షోభం వంటి సమస్యలు ఎదుర్కొంటోందని.. ఇందుకు తోడు ట్రంప్ 2.0 పాలనలో చైనా ఎగుమతులపై ఆంక్షలు పెరిగే అవకాశాలున్నాయని ఈ బ్రోకరేజీ సంస్థ భావిస్తోంది. ఇక భారత్ విషయానికొస్తే, ట్రంప్ వాణిజ్య విధానాలు పెద్దగా ప్రభావం చూపేందుకు అవకాశాల్లేని మార్కెట్లలో భారత్ ఒకటని సీఎల్ఎస్ఏ భావిస్తోంది. అంతేకాదు, డాలర్ క్రమంగా పుంజుకుంటున్న తరుణంలో ముడి చమురు ధరలు స్థిరంగా కొనసాగినంత వరకు భారత విదేశీ మారక నిల్వలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంటోంది.

> స్వల్పకాలంపాటు సూచీలు మరింత క్షీణించే అవకాశాలున్నాయి. నిఫ్టీకి 23,000-22,500 స్థాయిలో గట్టి మద్దతు కన్పిస్తోంది. ఒక వేళ సూచీ ఏడాది చివరి నాటికి ఈ స్థాయికి జారితే దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లకు పాల్పడవచ్చు. ప్రస్తుతం తరలిపోతున్న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులూ కొత్త ఏడాదిలో మళ్లీ భారత బాట పట్టవచ్చు.
> **- సునీల్ సుబ్రమణియమ్, మార్కెట్ నిపుణులు**

> మార్కెట్ ఇప్పటికే సహేతుక స్థాయికి దిగివచ్చిన నేపథ్యంలో సూచీలు మళ్లీ పుంజుకునేందుకు అవకాశాల్లేకపోలేవు. అయితే, భవిష్యత్ ర్యాలీలో మదుపరులు మెరుగైన వృద్ధి అవకాశాలున్న రంగాలు, కంపెనీల షేర్లను ఎంచుకోవడం మేలు.
> **- వీకే విజయ్ కుమార్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్**



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,760 ▲	69,450 ▲	99,000 ▼
ముంబై	73,739 ▼	67,545 ▼	87,103 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	103
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	91
కర్నూలు	90	నెల్లూరు	91
విశాఖపట్నం	103	అనంతపురం	91
గోదావరి	109		

ఐసీక్యూసీసీలో ఆర్ఐఎన్ఎల్‌కు అవార్డులు

నేవల్ డాక్ యార్డ్‌కు కూడా

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, విశాఖ ఉక్కు).. ఇంటర్నేషనల్ కన్వెన్షన్స్ ఆన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్-2024 (ఐసీక్యూసీసీ) నుంచి మూడు గోల్డ్ అవార్డులు గెలుచుకుంది. ఐసీక్యూసీసీ కొలంబోలో నిర్వహించిన సదస్సులో ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన ఆర్మోర్, తరంగిణి, సాధన బృందాలు ఈ అవార్డులు దక్కించుకున్నాయి. స్టీల్ తయారీలో నాణ్యత పెంచేందుకు ఈ బృందాలు చేసిన సూచనలకు ఈ అవార్డులు లభించాయని ఆర్ఐఎన్ఎల్ వెల్లడించింది. అంతర్జాతీయ స్థాయిలో ఈ అవార్డులు సాధించటం పట్ల ఉద్యోగులను కంపెనీ సీఎండీ ఎకే సక్సేనా ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఇదే కార్యక్రమంలో విశాఖ నేవల్ డాక్‌యార్డు గోల్డ్ అవార్డును దక్కించుకుంది. యుద్ధ నౌక ఇంజన్‌లో ఇబ్బంది తలెత్తితే...ఆ సమస్యను వేగంగా ఎలా పరిష్కరించవచ్చనే అంశంపై ఉద్యోగులు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందుకోసం తక్కువ ఖర్చుతో ఓ పరికరాన్ని తయారుచేశారు. డాక్‌యార్డు ఉద్యోగులు 'ట్రయిల్ బ్లజర్' పేరుతో ఈ పోటీల్లో పాల్గొన్నారు.

- బంగారం, వెండి వ్యాపారంలోని ముత్తూట్ పప్పచన్ గ్రూప్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా కంపెనీ అనుబంధ సంస్థ ముత్తూట్ ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎంఈపీఎల్).. వరంగల్, గుంటూరుల్లో గోల్డ్ పాయింట్ పేరుతో బంగారం విక్రయ సెంటర్లను ప్రారంభించింది. సంస్థకిది ఏపీలో నాలుగో శాఖ కాగా, తెలంగాణలో మూడో శాఖ. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం సెంటర్ల సంఖ్య 33కి చేరుకుంది.

మెర్సిడెస్ కార్ల ధరలు 3% పెంపు

న్యూఢిల్లీ: పెరిగిన ఉత్పత్తి వ్యయాలు, నిర్వహణ వ్యయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిడుల కారణంగా తమ కార్ల ధరలు మూడు శాతం పెంచుతున్నట్టు జర్మన్ లగ్జరీ కార్ల దిగ్గజడం మెర్సిడెస్ బెంజ్ ప్రకటించింది. వచ్చే జనవరి 1వ తేదీ నుంచి ఈ పెంపు వర్తిస్తుంది. ఈ ధరల పెంపుతో జీఎల్‌సీ మోడల్ కారు ధర రూ.2 లక్షలు కనిష్ఠంగా పెరుగుతుంది. మేబాక్ ఎస్ 860 లగ్జరీ లిమోసిన్ ధర గరిష్ఠంగా రూ.9 లక్షల మేరకు పెరుగుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. గత మూడు త్రైమాసికాలుగా ద్రవ్యోల్బణ ఒత్తిడులున్నప్పటికీ పెరిగిన నిర్వహణ వ్యయాలను తామే భరిస్తూ వచ్చామని, ఇప్పుడు ఆ భారం కస్టమర్లకు పంచక తప్పడంలేదని మెర్సిడెస్ బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు.

ఆడి క్యూ7 బుకింగ్స్ షురూ: ఆడి ఇండియా.. సరికొత్త ఆడి క్యూ7 బుకింగ్స్‌ను ప్రారంభించింది. 3 లీటర్ వీ 6 టీఎఫ్ఎస్ఐ ఇంజన్‌తో కూడిన ఈ కారును ఈ నెల 28న మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఆడి ఇండియా వెబ్‌సైట్, మై ఆడి కనెక్ట్ యాప్ ద్వారా రూ.2 లక్షలు చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవచ్చని ఆడి వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల నుంచి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ అదనపు సర్వీసులు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శీతాకాల సర్వీసుల్లో భాగంగా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడ నుంచి అదనపు సర్వీసులను ప్రకటించింది. దీంతో ఈ మూడు నగరాల నుంచి వారంలో నడిచే సర్వీసుల సంఖ్య 173 నుంచి 250కి పెరిగాయి. సీజన్ మొత్తం మీద ఈ నగరాల నుంచి సర్వీసుల సంఖ్య 45 శాతం పెరిగినట్టు కంపెనీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అంకుర్ గార్గ్ చెప్పారు. కొత్తగా ప్రకటించిన సర్వీసుల్లో హైదరాబాద్-గ్వాలియర్ డైరెక్ట్ సర్వీస్, విశాఖపట్టణం-విజయవాడ సర్వీస్ ఉన్నాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరు, కోచికి సర్వీసుల సంఖ్య పెంచారు. హైదరాబాద్ నుంచి 17 దేశీయ గమ్యాలు, సౌదీ అరేబియాలోని మూడు ప్రధాన విమానాశ్రయాలకు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులు నడుపుతున్నట్టు చెప్పారు. అలాగే విజయవాడ నుంచి అంతర్జాతీయ గమ్యాలకు విమాన సర్వీసు నడుపుతున్న ఏకైక సంస్థ తమదేనని అంకుర్ గార్గ్ వెల్లడించారు.

రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు సెబీ ఝలక్

న్యూఢిల్లీ: మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మరోసారి షాకిచ్చింది. రూ.26 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని 15 రోజుల్లో చెల్లించాలని స్పష్టం చేసింది. లేకపోతే కంపెనీ ఆస్తులు, బ్యాంకు డిపాజిట్లను జప్తు చేస్తామని హెచ్చరించింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధుల దారి మళ్లింపునకు సంబంధించి సెబీ గత నెలలో రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు రూ.25 కోట్ల జరిమానా విధించింది. కంపెనీ ఆ మొత్తాన్ని చెల్లించక పోవడంతో ఈ డిమాండ్ నోటీసు జారీ చేసింది.



1
ఒకే క్యాలెండర్ ఏడాదిలో మూడు టీ20 శతకాలు బాదిన ఏకైక బ్యాటర్‌గా శాంసన్.

రెండు శాశ్వత సభ్య దేశాల మధ్య జరిగిన టీ20 మ్యాచ్‌లో రెండు సెంచరీలు నమోదవడం ఇదే తొలిసారి.

భారత్ తరఫున టీ20ల్లో ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం (210) నమోదు చేసిన తిలక్-శాంసన్

2
టీ20ల్లో రెండో అత్యధిక స్కోరు సాధించిన భారత్. ఈ ఏడాది అక్టోబరు 12న బంగ్లాదేశ్‌పై భారత్ అత్యధికంగా 297 పరుగుల స్కోరు చేసేంది.

భారత్ తరఫున రెండు వరుస టీ20 సెంచరీలు కొట్టిన రెండో బ్యాటర్‌గా తిలక్.

తమ టీ20ల్లో తొలి పది ఓవర్లలో రెండో అత్యధిక స్కోరు (129/1) సాధించిన భారత్. బంగ్లాదేశ్‌పై ఎక్కువ పరుగులు (152/1) చేసింది.

అద్భుతం.. అపూర్వం. టీ20 మ్యాచ్‌లో ఒక సెంచరీయే అరుదనుకుంటే.. ఇక్కడ ఒకే ఇన్నింగ్స్‌లో రెండు నమోదయ్యాయి. ఓ వైపు తిలక్ వర్మ, మరో వైపు సంజూ శాంసన్ పూనకం వచ్చిన మాదిరి సఫారీ బౌలర్లపై విరుచుకుపడగా వాండరర్స్ మైదానంలో పరుగుల జడివానే కురిసింది. దక్షిణాఫ్రికా బౌన్సీ పిచ్‌లపై బౌండరీలు కొట్టడం ఇంత సులువా అన్నట్టుగా ఈ జోడీ చెలరేగింది. ఈ వీర బాదుడుతో తెలుగు తేజం తిలక్ వర్మ వరుసగా రెండో శతకం అందుకోగా.. శాంసన్ రెండు డకౌట్ల నుంచి తేరుకుని సిరీస్‌లో మరో సెంచరీతో దుమ్మురేపాడు. రెండో వికెట్‌కు 210 పరుగుల అజేయ భాగస్వామ్యంలో వీరు 19 సిక్సర్లు, 15 ఫోర్లు బాదడం విశేషం. అటు భారీ స్కోరును ఛేదించలేక దక్షిణాఫ్రికా సిరీస్‌ను సమర్పించుకుంది.

సంజూ శాంసన్ (56 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 109 నాటౌట్)

శతక తాండవం

తిలక్, శాంసన్ సెంచరీల మోత

3-1తో భారత్‌దే సిరీస్

నాలుగో టీ20లో 135 రన్స్‌తో దక్షిణాఫ్రికా చిత్తు



తిలక్ వర్మ (47 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్సర్లతో 120 నాటౌట్)

జొహాన్నెస్‌బర్గ్: నాలుగు టీ20ల సిరీస్‌ను భారత్ అదిరిపోయే రీతిలో ముగించింది. యువ బ్యాటర్లు తిలక్ వర్మ (47 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్సర్లతో 120 నాటౌట్), సంజూ శాంసన్ (56 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 109 నాటౌట్) అజేయ శతకాలతో మోత మోగించారు. అటు బౌలర్లు ఎప్పటిలాగే రాణించడంతో శుక్రవారం జరిగిన నాలుగో టీ20లో భారత్ 135 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే సిరీస్‌ను 3-1 తేడాతో కైవసం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 283 పరుగుల భారీ స్కోరు సాధించింది. అభిషేక్ (18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 36) రాణించాడు. సిపామ్లకు ఏకైక వికెట్ దక్కింది. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 18.2 ఓవర్లలో 148 పరుగులకు కుప్పకూలింది. స్టబ్స్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 43), మిల్లర్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 36), జాన్సెన్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 29 నాటౌట్) మాత్రమే ఆకట్టుకున్నారు. అర్ష్‌దీప్‌నకు మూడు, వరుణ్.. అక్షర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా.. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా తిలక్ నిలిచాడు.

పోరాటమే లేకుండా..

కళ్లముందు భారీ లక్ష్య ఛేదన ఉండడంతో సఫారీలు ఆరంభం నుంచే తడబడ్డారు. పేసర్లకు పిచ్ అనుకూలించడంతో చక్కటి స్వింగ్‌తో అర్ష్‌దీప్ చెలరేగాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ హెన్‌డ్రిక్స్‌ను డకౌట్ చేయగా.. హార్దిక్ తర్వాతి ఓవర్‌లోనే రికెల్టన్ (1)పనిబట్టాడు. ఇక వరుస బంతుల్లో మార్‌క్రమ్ (8), క్లాసెన్ (0)లను అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో 10/4 స్కోరుతో సఫారీలు ఏ దశలోనూ కోలుకోలేకపోయారు. ఆ తర్వాత స్టబ్స్, మిల్లర్ ఐదో వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యం అందించడం మినహా వీరి ఇన్నింగ్స్‌లో చెప్పుకోదగిందేమీ లేదు. 12వ ఓవర్‌లో మిల్లర్ 6,4,6తో బ్యాట్ ఝుళిపించి వరుణ్ చేతికి చిక్కగా.. తర్వాతి ఓవర్‌లోనే స్టబ్స్‌ను బిష్ణోయ్ అవుట్ చేయడంతో ఇక చేసేదేమీ లేకపోయింది. టెయిలెండర్లలో జాన్సెన్ భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు.

దుమ్మురేపిన తిలక్-శాంసన్

సిరీస్‌లో తొలిసారి టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. దీనికి తగ్గట్టుగానే ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఇన్నింగ్స్‌ను వాయువేగంతో ఆరంభించారు. ఆ తర్వాత తిలక్ వర్మ తానేం తక్కువ కాదన్నట్టు గత మ్యాచ్ ఫామ్‌ను ఈసారీ ప్రదర్శించాడు. దీంతో భారత్ స్కోరు ఆకాశమే హద్దుగా దూసుకెళ్లింది. ఆరంభంలో ఓపెనర్లు ప్రతీ బౌలర్‌ను వేటాడుతూ పరుగుల వరద పారించారు. తొలి ఓవర్‌లోనే అభిషేక్ క్యాచ్‌ను స్లిప్‌లో రీజా వదిలేశాడు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ అభిషేక్ ఐదో ఓవర్‌లో 6,6,4,6తో చెలరేగి 23 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో సిపామ్లకు చిక్కడంతో తొలి వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పవర్‌ప్లేలో దక్షిణాఫ్రికాపై టీమిండియాకు ఇది రెండో అత్యధిక స్కోరు. వన్‌డౌన్‌లో తిలక్ రాకతో సఫారీ బౌలర్ల కష్టాలు రెట్టింపయ్యాయి. తొమ్మిదో ఓవర్‌లో అతను రెండు సిక్సర్లు బాదడంతో స్కోరు వంద పరుగులు దాటింది. అటు శాంసన్ సహజశైలిలో చెలరేగి పదో ఓవర్‌లో రెండు సిక్సర్లతో 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. తిలక్ సైతం ఇదే ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించడంతో 21 పరుగులు వచ్చాయి. పేసర్ సిపామ్లను లక్ష్యంగా చేసుకుని శాంసన్ రెండు, తిలక్ మరో సిక్సర్‌తో 20 పరుగులు రావడంతో 12వ ఓవర్‌లోనే జట్టు స్కోరు 160 దాటింది. ఇక మార్‌క్రమ్ ఓవర్‌లో అయితే తిలక్ వరుసగా 4,6,6,4తో 22 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ జోడీ ధాటికి ఆతిథ్య బౌలర్లకు ఎలా బంతులు వేయాలో కూడా అర్థం కాలేదు. ఇక, శాంసన్ 51 బంతుల్లో సిరీస్‌లో రెండో శతకం సాధించాడు. తన 95 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తిలక్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను బౌండరీ లైన్ దగ్గర జాన్సెన్ వదిలేశాడు. దీంతో 40 బంతుల్లోనే తిలక్ కూడా వరుసగా రెండో సెంచరీని పూర్తి చేశాడు. 19వ ఓవర్‌లో తిలక్ 4,6,4తో దక్షిణాఫ్రికాలో అత్యధిక టీ20 స్కోరు (258)ను భారత్ దాటేసింది. ఆఖరి ఓవర్‌లో తిలక్ 4, శాంసన్ 6తో జట్టు 280+ స్కోరుతో అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (నాటౌట్) 109, అభిషేక్ (సి) క్లాసెన్ (బి) సిపామ్ల 36, తిలక్ (నాటౌట్) 120, ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 20 ఓవర్లలో 283/1; వికెట్ పతనం: 1-73; బౌలింగ్: జాన్సెన్ 4-0-42-0; కొట్జీ 3-0-43-0; సిపామ్ల 4-0-58-1; సిమెలానె 3-0-47-0; కేశవ్ మహరాజ్ 3-0-42-0; మార్‌క్రమ్ 2-0-30-0; స్టబ్స్ 1-0-21-0.

దక్షిణాఫ్రికా: రికెల్టన్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 1, హెండ్రిక్స్ (బి) అర్ష్‌దీప్ 0, మార్‌క్రమ్ (సి) బిష్ణోయ్ (బి) అర్ష్‌దీప్ 8, స్టబ్స్ (ఎల్బీ) బిష్ణోయ్ 43, క్లాసెన్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 0, మిల్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 36, జెన్సన్ (నాటౌట్) 29, సిమెలానె (సి) బిష్ణోయ్ (బి) వరుణ్ 2, కొట్జీ (సి) శాంసన్ (బి) అక్షర్ 12, కేశవ్ (సి) తిలక్ (బి) అక్షర్ 6, సిపామ్ల (సి) అక్షర్ (బి) రమణ్‌దీప్ 3, ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 18.2 ఓవర్లలో 148 ఆలౌట్; వికెట్ల పతనం: 1-1, 2-1, 3-10, 4-10, 5-96, 6-96, 7-105, 8-131, 9-141, 10-148; బౌలింగ్: అర్ష్‌దీప్ 3-0-20-3, హార్దిక్ 3-1-8-1, రమణ్‌దీప్ 3.2-0-42-1, వరుణ్ 4-0-42-2, రవి బిష్ణోయ్ 3-0-28-1, అక్షర్ 2-0-6-2.



అర్ష్‌దీప్ (3/20)

2 టీ20ల్లో వేగంగా (33 ఇన్నింగ్స్) మూడు శతకాలు సాధించిన రెండో బ్యాటర్‌గా శాంసన్. ఫిల్ సాల్ట్ (32 ఇన్నింగ్స్) ముందున్నాడు.

రోహిత్ మళ్లీ తండ్రయ్యాడు

ముంబై: భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తండ్రయ్యాడు. రోహిత్ భార్య రితిక సజ్దే శుక్రవారంనాడు మగ బిడ్డకు జన్మనిచ్చింది. రోహిత్ దంపతులకు ఇంతకు ముందు కూతురు ఉన్న సంగతి తెలిసిందే. భార్య ప్రసవ సమయం వల్ల జట్టుతోపాటు రోహిత్ ఆస్ట్రేలియా వెళ్లని సంగతి తెలిసిందే. దాంతో ఈనెల 22 నుంచి జరిగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టుకు రోహిత్ అందుబాటులో ఉండడని వార్తలొచ్చాయి. అయితే భార్య ప్రసవం కావడంతో ఇక రోహిత్ పెర్త్ టెస్టుకు అందుబాటులో ఉండనున్నట్టు సమాచారం.

పట్నా పంజా


పీకేఎల్‌లో బెంగాల్ చిత్తు

నోయిడా: రైడింగ్ త్రయం దేవాంక్, అయాన్, సందీప్ చెలరేగడంతో ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో పట్నా పైరేట్స్ విజయాన్ని అందుకుంది. శుక్రవారం జరిగిన పోరులో పట్నా 52-31 స్కోరు తేడాతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుగా ఓడించింది. దేవాంక్ 15, అయాన్ 11, సందీప్ 8 పాయింట్లు కొల్లగొట్టి పట్నాను గెలిపించారు. ఈ సీజన్‌లో దేవాంక్ ఓవరాల్‌గా తన పాయింట్ల సంఖ్యను 115కు పెంచుకోవడం విశేషం. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్‌పాంథర్స్ 32-24తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది.

న్యూఢిల్లీ: అంతర్జాతీయ వేదికల మీద భారత్‌పై దుష్ప్రచారం చేయడం.. ఆ క్రమంలో ప్రతీసారీ అభాసుపాలవడం.. ఇదీ పాకిస్థాన్ తీరు. అయినా ఆ దేశం మాత్రం తన వక్రబుద్ధిని మార్చుకోవడంలేదు. ఈసారి భారత్‌ను కవ్వించేందుకు చాంపియన్స్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఉపయోగించుకోవాలని చూసింది. వచ్చే ఏడాది జరిగే ఈ టోర్నమెంట్‌లో ఆడేందుకు పాకిస్థాన్ వెళ్లకూడదని భారత్ నిర్ణయించిన విషయం విదితమే. ఆ ఉక్రోషంతో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో టోర్నమెంట్ ట్రోఫీని ప్రదర్శించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్ణయించింది. అయితే పీసీబీ చర్యను తీవ్రంగా ఆక్షేపించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) విషయాన్ని అంతర్జాతీయ

పాకిస్థాన్ పరువు పాయె!

పీవోకేలో చాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శనకు ఏర్పాట్లు



భారత క్రికెట్ బోర్డు అభ్యంతరం

ఐసీసీ దృష్టికి పీసీబీ కవ్వింపు చర్య

స్పందించిన ఐసీసీ

ట్రోఫీ ప్రదర్శన రద్దు

క్రికెట్ మండలి (ఐసీసీ) దృష్టికి తీసుకెళ్లింది. పాకిస్థాన్‌పై చర్యకు డిమాండ్ చేసింది. తక్షణమే స్పందించిన ఐసీసీ.. పీవోకేలో ట్రోఫీ ప్రదర్శన కార్యక్రమాన్ని రద్దు చేసింది. దాంతో అంతర్జాతీయంగా పాకిస్థాన్ తన పరువు మరోసారి పోగొట్టుకుంది.

విషయమేమిటంటే..

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీకి పాకిస్థాన్ ఆతిథ్యమివ్వాలి. అయితే 2008 నుంచి పాక్‌లో ఆడేందుకు నిరాకరిస్తున్న భారత జట్టు ఈసారి అదే పంథాను కొనసాగిస్తూ చాంపియన్స్ ట్రోఫీలో తలపడేందుకు ఆ దేశం వెళ్లబోమని స్పష్టంజేసింది. దీంతో టోర్నీని హైబ్రిడ్ విధానంలో అంటే..భారత్ ఆడే మ్యాచ్‌లను వేరే దేశంలో నిర్వహించాలని ఐసీసీ ప్రతిపాదించింది. కానీ పీసీబీ టోర్నీ ఆసాంతం తమ దేశంలోనే నిర్వహించాలని పట్టుబడుతోంది. ఫలితంగా..చాంపియన్స్ ట్రోఫీని దక్షిణాఫ్రికాకు మార్చాలని ఐసీసీ యోచిస్తోంది. ఈక్రమంలో టోర్నీపై ఐసీసీ ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు. అలాగే గత సోమవారం లాహోర్‌లో ధూం..ధాంగా నిర్వహించాల్సిన టోర్నీ ట్రోఫీ ప్రదర్శన కార్యక్రమాన్ని కూడా ఐసీసీ అనూహ్యంగా వాయిదా వేసింది. టోర్నీ షెడ్యూల్‌ను కూడా ఐసీసీ ప్రకటించలేదు. మరోవైపు.. ఐసీసీని సంప్రదించకుండా టోర్నీని తమ దేశంలోని పలు నగరాల్లో ప్రదర్శించే షెడ్యూల్ (నవంబరు 16-24)ను పీసీబీ ఏకపక్షంగా ఖరారు చేసింది. శనివారం లాహోర్‌లో ఈ కార్యక్రమం మొదలవ్వాల్సి ఉంది. తమ దేశంలోని వివిధ నగరాలతోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని స్కర్దు, ముర్రే, హుంజా, ముజఫరాబాద్‌లలో కూడా ట్రోఫీని ప్రదర్శించనున్నట్టు పీసీబీ వెల్లడించడం బీసీసీఐకి ఆగ్రహం తెప్పించింది. తమ దేశంలో ఆడేందుకు నిరాకరించడంతో కవ్వింపు చర్యల్లో భాగంగా పీసీబీ ఈ చర్య చేపట్టిందని బీసీసీఐ ఆక్షేపించింది. పాకిస్థాన్ చర్యను ఖండించిన బీసీసీఐ కార్యదర్శి జై షా.. ఐసీసీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. 'ఐసీసీ పెద్దలతో బీసీసీఐ కార్యదర్శి మాట్లాడారు. పాక్‌పై కఠిన చర్య తీసుకోవాలని గట్టిగా కోరారు. ఇస్లామాబాద్‌లో ట్రోఫీని ప్రదర్శించడంపై అభ్యంతరం లేదు. కానీ పీవోకేలో ప్రదర్శించనుండడంపైనే మా అభ్యంతరం' అని బీసీసీఐ అధికారి శుక్రవారం తెలిపారు. బీసీసీఐ ఆక్షేపణతో పీవోకేలో ట్రోఫీ ప్రదర్శనను ఐసీసీ రద్దు చేసింది. ఒకవేళ ఆతిథ్య హక్కులను పాకిస్థాన్ వదులుకుంటే, టోర్నీని భారత్‌లో నిర్వహించేందుకూ ఐసీసీ మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

టోర్నీ నిర్వహణకు మూడు ప్రత్యామ్నాయాలు..

చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ సందిగ్ధంలో పడిన తరుణంలో.. పీసీబీ మాజీ చీఫ్ నజామ్ సేథీ మూడు ప్రత్యామ్నాయాలను ఐసీసీకి సూచించినట్టు తెలిసింది.

- మొదటిది హైబ్రిడ్ విధానంలో జరపడం. ఈ పద్ధతిలో భారత్ మ్యాచ్‌లను వేరే చోట నిర్వహిస్తారు. గతంలో సేథీ పీసీబీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఆసియా కప్‌ను ఈ విధానంలో నిర్వహించారు. అప్పుడు భారత్ తన మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడింది.
- రెండోది.. టోర్నీని వేరే దేశానికి తరలించడం. అప్పుడు టోర్నీని బహిష్కరించడం, లేదంటే తరలించిన దేశంలో ఆడడం పాకిస్థాన్‌కు ఉండే ప్రత్యామ్నాయంగా సేథీ పేర్కొన్నారు. కానీ హైబ్రిడ్ పద్ధతిని తిరస్కరించిన పాక్ వేరే వేదికలో ఆడుతుందా అన్నది ప్రశ్న.
- ఇక..భావోద్వేగాలతో కాకుండా ఆచితూచి నిర్ణయం తీసుకోవడమే మేలని మూడో ప్రత్యామ్నాయంగా పాకిస్థాన్‌కు సేథీ సూచించారు.

ఎందుకు వెళ్లరో..రాత పూర్వకంగా ఇవ్వండి!

చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్‌కు భారత జట్టును ఎందుకు పంపడంలేదో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని బీసీసీఐని ఐసీసీ కోరినట్టు తెలిసింది. పాక్ వెళ్లబోమని ఐసీసీకి బీసీసీఐ ఇప్పటికే చెప్పేసింది. ఇదే విషయాన్ని పీసీబీకి ఐసీసీ చేరవేసింది. కానీ బీసీసీఐ నిర్ణయాన్ని తెలియజేసే లేఖను తమకు అందజేయాలని ఐసీసీని పీసీబీ అడిగిందట. దీంతో తమ నిర్ణయాన్ని రాత పూర్వకంగా తెలియజేయాలని బీసీసీఐకి ఐసీసీ సూచించినట్టు తెలిసింది.

ఐసీసీ టోర్నీల బహిష్కరణకు పాక్..?

భారత్ తమ దేశానికి రాని పక్షంలో పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలుస్తోంది. భారత్ పాల్గొనే ఐసీసీ ఈవెంట్లతో పాటు భారత్ వేదికగా జరిగే ఏ టోర్నీలోనూ పాక్ పాల్గొనకూడదని పీసీబీ నిర్ణయించనున్నదట.



రషీద్ డబుల్

- కరణ్ శతకం
- ఆంధ్ర 448/9
- హైదరాబాద్‌తో రంజీ

హైదరాబాద్ : టాపార్డర్ బ్యాటర్లు రషీద్ (203), కరణ్ షిండే (109) శతకాలతో కదం తొక్కడంతో హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర 147 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. రషీద్, షిండే మూడో వికెట్‌కు 236 పరుగులు జోడించారు. దాంతో 168/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర ఆట ఆఖరికి 448/9 స్కోరుతో నిలిచింది. మూడో రోజు ఆట ముగిసే సరికి సందీప్ (33), లలిత్ మోహన్ (0) క్రీజులో ఉన్నారు. అనికేత్ నాలుగు, మిలింద్, రక్షణ్ చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు. హైదరాబాద్ మొదటి ఇన్నింగ్స్‌లో 301 పరుగులు చేసింది.

పదికి పది



ఒకే ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు

హరియాణా పేసర్ అన్షుల్‌అరుదైన రికార్డు

లాహ్లి(హరియాణా): హరియాణా జట్టు పేసర్ అన్షుల్ కాంబోజ్ అరుదైన రికార్డు సాధించాడు. కేరళతో రంజీ మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో పది వికెట్లు పడగొట్టాడు. దీంతో రంజీ చరిత్రలో ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా 23 ఏళ్ల అన్షుల్ ఘనత వహించాడు. గతంలో బెంగాల్‌కు చెందిన ప్రేమాంగ్షు చటర్జీ (1953లో అస్సాంపై), రాజస్థాన్ క్రికెటర్ ప్రదీప్ సుందరం (1985లో విదర్భపై) రంజీల్లో ఈ రికార్డు నెలకొల్పారు. ఓవరాల్‌గా ఫస్ట్‌క్లాస్‌లో ఈ రికార్డు సాధించిన ఆరో భారత బౌలర్‌గా అన్షుల్ నిలిచాడు. కేరళతో పోరులో 30.1 ఓవర్లు వేసిన అన్షుల్.. 49 పరుగులు మాత్రమే సమర్పించుకొని 10 వికెట్లు తీశాడు. ఫలితంగా కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 291 రన్స్‌కే ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో హరియాణా శుక్రవారం ఆట ముగిసేసరికి 139/7 స్కోరు చేసింది. ఇక, ఇప్పటిదాకా 19 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన అన్షుల్ తాజా ప్రదర్శనతో కెరీర్‌లో 50 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు.

రన్నరప్ ప్రజ్ఞానంద



హారికకు ఐదు, అర్జున్‌కు ఆరో స్థానం

టాటా స్టీల్ చెస్ విజేతలు కార్ల్‌సన్, గోర్యాచ్కినా

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నమెంట్‌లో ఆరంభ రౌండ్లలో అదరగొట్టిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి చివరికొచ్చేసరికి నిరాశపరిచాడు. శుక్రవారం ముగిసిన ర్యాపిడ్ విభాగం ఓపెన్ కేటగిరిలో మొత్తం 9 రౌండ్లకు గాను 3.5 పాయింట్లు సాధించిన అర్జున్.. ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచాడు. నెంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి విజేతగా నిలిచాడు. ఇక, భారత్‌కు చెందిన ప్రజ్ఞానంద, వెస్లీ సో (అమెరికా) చెరో 5.5 పాయింట్లతో సమంగా నిలిచినా.. సూపర్ టైబ్రేక్‌లో మెరుగైన స్కోరుతో ప్రజ్ఞానంద రెండో స్థానంతో రన్నరప్‌గా నిలిచాడు. వెస్లీ మూడోస్థానంతో సరిపెట్టుకున్నాడు. మహిళల టైటిల్‌ను రష్యాకు చెందిన అలెగ్జాండ్రా గోర్యాచ్కినా దక్కించుకుంది. గోర్యాచ్కినా మొత్తం 9 రౌండ్లకు 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. నానా జాగ్నిజె (జార్జియా) 5.5 పాయింట్లతో రన్నరప్‌గా నిలవగా, భారత అమ్మాయి వంతికా అగర్వాల్ (5) మూడో స్థానం దక్కించుకుంది. ద్రోణవల్లి హారిక 4.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలవగా.. హంపి కేవలం 3 పాయింట్లతో ఆఖరిదైన పదో స్థానానికి పరిమితమైంది. దివ్యా దేశ్‌ముఖ్ (3.5), వైశాలి (3.5) ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచారు.

ఐపీఎల్ వేలం బరిలో 13 ఏళ్ల వైభవ్



మొత్తం 574 మంది క్రికెటర్లు

366 మంది భారతీయులు

న్యూఢిల్లీ: ఐపీఎల్ మెగా వేలం జాబితా ఖరారైంది. సౌదీ అరేబియాలోని జెడ్డాలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే ఈ వేలంలో మొత్తం 574 మంది క్రికెటర్లు బరిలో నిలిచారు. టీమిండియా స్టార్లు రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్ 2 కోట్ల రూపాయల బేస్ ధరతో వేలానికే ప్రధాన ఆకర్షణ కానున్నారు. 13 ఏళ్ల భారత అండర్-19 క్రికెటర్, బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ వేలంలో నిలిచిన అతి చిన్న వయస్సు ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. రూ. 30 లక్షల బేస్ ధరతో అతడు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. వాస్తవంగా మొత్తం 1574 మంది క్రికెటర్లు వేలంలో పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే బీసీసీఐ ఆ జాబితాను 574కి కుదించింది. వీరిలో 366 మంది భారత ఆటగాళ్లకాగా 208 విదేశీ క్రికెటర్లున్నారు. పంత్ అత్యధిక ధర పలుకుతాడని అంచనా. పేసర్లు షమి, సిరాజ్, చాహల్, అవేశ్ ఖాన్ వేలంలో నిలిచిన ఇతర స్టార్ ఆటగాళ్లు. రూ. 2 కోట్ల ధరతో 81 మంది క్రికెటర్లు వేలానికి వస్తుండగా, 27 మంది రూ. 1.5 కోట్ల శ్రేణిలో ఉన్నారు. 18 మంది రూ. 1.25 కోట్లు, 23 మంది రూ. కోటి రేటుతో బరిలో దిగనున్నారు. రూ. 2 కోట్లతో ఇంగ్లండ్‌కు చెందిన బట్లర్, బ్రూక్, బెయిర్ స్టోతో అత్యధిక మొత్తంతో వేలంలో అడుగుపెడుతున్న విదేశీ క్రికెటర్ల జాబితాలో ఉన్నారు. జేమ్స్ అండర్సన్ రూ. 1.25 కోట్లతో తన పేరు నమోదు చేసుకోవడం గమనార్హం.



విజయంతో విడిపోయారు

ట్యూరిన్ (ఇటలీ): ప్రపంచ టెన్నిస్ పురుషుల డబుల్స్‌లో విజయవంతమైన జోడీగా పేరు తెచ్చుకున్న భారత ఆటగాడు రోహన్ బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ఇకనుంచి వేర్వేరు భాగస్వాములతో కలిసి ఆడనున్నారు. ఈ ఇద్దరూ ఏటీపీ టూర్ ఫైనల్స్‌తో చివరి మ్యాచ్ ఆడారు. శుక్రవారం జరిగిన తమ గ్రూప్ ఆఖరి, మూడో మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ జోడీ 7-5, 6-7(6-8), 10-7తో జర్మనీ ద్వయం క్రావిట్జ్-టిమ్‌పై గెలిచింది. గతేడాది జనవరిలో జతకట్టిన బోపన్న, ఎబ్డెన్.. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో పాటు 4 టూర్ లెవెల్ టైటిళ్లు గెలిచారు.



టెన్నిస్‌కు ప్రజ్ఞేష్ వీడ్కోలు

చెన్నై: భారత ఆటగాడు ప్రజ్ఞేష్ గుణేశ్వరన్ ప్రొఫెషనల్ టెన్నిస్‌కు వీడ్కోలు పలికాడు. చెన్నైకి చెందిన 35 ఏళ్ల ప్రజ్ఞేష్ 2018 జకార్త ఆసియా క్రీడల్లో సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించాడు. కెరీర్‌లో అత్యుత్తమంగా 2019లో సింగిల్స్‌లో ప్రపంచ 75వ ర్యాంక్‌లో నిలిచాడు. ప్రజ్ఞేష్ నాలుగు గ్రాండ్‌స్లామ్స్‌లోనూ పోటీపడ్డా.. అన్నింటిలోనూ తొలిరౌండ్ దాటలేకపోయాడు. రెండు ఏటీపీ చాలెంజర్స్ సింగిల్స్ టైటిళ్లు నెగ్గిన అతను.. భారత్ నుంచి నెంబర్‌వన్ ర్యాంకర్‌గా నిలిచాడు.

గింజల్లో రాజా రాజ్‌మా

"రాజమాషో గురుర్బూరిశకృద్ రూక్షోతివాతలః
కషాయానురసః స్వాదురవృష్య శ్లేష్మపిత్తజిత్"

అంటాడు శాస్త్రకారుడు. ఈ శ్లోకంలో రాజమాష అనే పేరున్న గింజ వల్ల కలిగే ప్రయోజనాలను వర్ణించాడు. రాజమాష అంటే పెద్ద మినపగింజ అని అర్థం. అదే జనవ్యవహారంలో రాజ్‌మా అయ్యింది. ఇది మినపగింజ కన్నా పెద్దగా- మూత్రపిండాల ఆకారంలో ఉంటుంది కాబట్టి- దీనిని ఇంగ్లీషులో కిడ్నీబీన్ అని కూడా అంటారు.

ఏ అవయవ ఆకారంలో ఉన్న ద్రవ్యాలు- ఆ అవయవాన్ని బలసంపన్నం చేస్తాయనేది ఒక సహజ సూత్రం. హృదయం ఆకారంలో ఉండే మామిడిపండు హృదయానికి మేలు చేస్తుంది. మెదడు ఆకారంలో ఉండే అక్రూట్స్ మెదడుని బలసంపన్నం చేస్తాయి. ఇదే విధంగా రాజ్‌మా మూత్రాశయ వ్యవస్థను శుభ్రపరిచి.. మూత్రపిండాలపై అదనపు భారం పడకుండా అడ్డుకుంటుంది. అంతే కాదు.. మూత్ర పిండాల్లో రాళ్లను వెళ్లగొట్టే స్వభావం కూడా దీనికి ఉంటుంది. ఇంతే కాదు. రాజ్‌మా వల్ల అనేక ప్రయోజాలు ఉన్నాయి. ఇది కండరాల బలాన్ని పెంచుతుంది. చెడ్డకొవ్వును తొలగిస్తుంది. దీనిలో ఉండే అధిక పీచుపదార్థం కారణంగా సులభంగా జీర్ణమవుతుంది. చెడ్డకొవ్వు పెరగకుండా కూడా కాపాడుతుంది. దీనిలో కేలరీలు తక్కువ . అందువల్ల స్థూలకాయులు దీనిని నిస్సంకోచంగా తినవచ్చు. దీనిలో విటమిన్ కె అదనంగా లభిస్తూ ఉంటుంది. ఇక కొన్ని ద్రవ్యాలకు ద్వంద్వ ప్రవృత్తి ఉంటుంది. ఒక మంచి ఒక చెడుకలగలసి ఉంటాయి. చెడుని తట్టుకోగల శరీర దారుఢ్యం ఉన్నవారికి, బలమైన జీర్ణశక్తి ఉన్నవారికి రాజ్‌మా ఉత్తమంగా పనిచేస్తుంది. జీర్ణశక్తి మధ్యస్థంగా ఉన్నవారికి దీని గుణాలు మధ్యస్థంగానే అందుతాయి. జాఠరాగ్ని అల్పంగా వారికి దీని వలన ఇబ్బందులు సిద్ధిస్తాయి. అంతే కాదు. భోజనకుతూహలం గ్రంథంలో ఈ రాజమాష గుణాలను 'స్వాదురవృష్యం' అని వర్ణించారు. అంటే ఇది రుచికరమే కానీ లైంగిక శక్తిని నశింపచేస్తుందని అని అర్థం. అంటే రాజ్‌మాను అతిగా కాకుండా పరిమితంగా తింటేనే మంచిదని అర్థం.

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

రాజ్‌మాను నానబెట్టి ముద్దగా చేసి మొటిమలకు పట్టిస్తే అవి తగ్గిపోతాయి. చర్మం మృదువుగా తయారవుతుంది. చర్మవ్యాధుల నివారణకు కూడా రాజ్‌మా పనిచేస్తుంది.



రకరకాల వంటల్లో...

రాజ్‌మాను ఉత్తరభారతదేశంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే పచ్చిగింజలను కనీసం 8 గంటలు నానబెట్టి అప్పుడు మాత్రమే తినాలి. లేకపోతే అజీర్ణ సమస్యలు రావచ్చు. అంతే కాదు. రాజ్‌మాను ఇతర ఆకుకూరలు, కూరగాయలతో కలిపి తింటేనే ఎక్కువ రుచికరంగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో రాజ్‌మాను బాగా నానబెట్టి.. పెసరపప్పుతో కలిపి వడలు వేస్తారు. దీని వల్ల పెసరపప్పులోను, రాజ్‌మాలోను ఉంటే లక్షణాలన్నీ లభిస్తాయి. మరి కొన్ని ప్రాంతాల్లో రాజ్‌మాను మంటపై కాల్చి తింటారు. మరి కొందరు నానబెట్టి వేయించి తింటారు. ఈ మధ్యకాలంలో కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు, రాజ్‌మా, ఎండు మిరపకాయలను వేయించి.. దానిలో సైంధవ లవణాన్ని వేసి పొడి చేస్తున్నారు. దీనిని కంది పొడికి బదులుగా తినవచ్చు.

వంటిల్లు

ప్రకృతిలోని ప్రతి ఆకు, పువ్వు, కాయ మనకు ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుంది. కానీ చాలా సార్లు మనం మన చుట్టూ ఉన్న ఆకులలోని ఆరోగ్య లక్షణాలను పట్టించుకోం. అలాంటి కొన్ని ఆకుల ద్వారా చేసే రుచికరమైన కూరలు మీ కోసం...

ఆకులతో అదిరే రుచులు



చామదుంపల పత్రి కూర

కావాల్సిన పదార్థాలు

చామగడ్డలు- 250 గ్రాముల, బిల్వపత్రి- ఒక కప్పుడు, నూనె- 3 స్పూనులు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక అరకప్పు, పసుపు- అర చెంచా, పచ్చి మిర్చి ముక్కలు- నాలుగు చెంచాలు, కారం- ఒక స్పూను, కరివేపాకు- ఒక రెబ్బ, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, సన్నగా తరిగిన పుదీనా- తగినంత, తరిగిన కొత్తిమీర- ఒక స్పూను, దాల్చిన చెక్క- కొద్దిగా, జీలకర్ర- ఒక స్పూను, చింతపండు పులుసు- మూడు స్పూనులు, ఉప్పు- తగినంత

తయారీ విధానం

- చామదుంపలను ఉడికించి.. చల్లారిన తర్వాత పైతొక్క తీసి పెట్టుకోవాలి
- బిల్వపత్రం ఆకులను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి.
- ఉల్లిపాయముక్కలు, దాల్చిన చెక్క, జీలకర్రలను మిక్సీలో వేసి ముద్దగా చేయాలి
- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దానిలో కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి దోరగా వేయించాలి. దోరగా వేగిన తర్వాత పసుపు వేయాలి. ఆ తర్వాత ముందుగా తయారుచేసుకున్న ఉల్లిపాయ ముద్దను వేసి పచ్చివాసన పోయే దాకా వేయించాలి. ఆ తర్వాత చింతపండు పులుసు వేయాలి.
- ఈ మిశ్రమం ఉడికిన తర్వాత దానిలో ఉడికించిన చామదుంపలు, బిల్వపత్రిలను వేసి మూత పెట్టి ఐదుని మిషాలు ఉడకనివ్వాలి.
- ఆ తర్వాత ఉప్పు వేసి బాగా కలపాలి. పైన పుదీనా, కొత్తిమీరను జల్లాలి.

జాగ్రత్తలు

- బిల్వపత్రి త్వరగా ఉడికిపోతుంది. అందువల్ల ఎక్కువ సేపు ఉడికించాల్సిన అవసరం లేదు.
- అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయకపోయినా మంచి రుచి వస్తుంది.
- చామదుంపలు పెద్దగా ఉండకూడదు. చిన్నగా, గుండ్రంగా ఉన్న చామదుంపలను ఎంపిక చేసుకోవాలి. చామ దుంపలను ఎక్కువగా ఉడికిస్తే ముద్దగా అయిపోతాయి. అందువల్ల ఎక్కువగా ఉడికించకూడదు.

చెన్నంగి ఆకు కంద పులావ్

కావాల్సిన పదార్థాలు

చెన్నంగి ఆకు- ఒక కప్పు, కందగడ్డ ముక్కలు- ఒక కప్పు, బాస్మతి బియ్యం- మూడు కప్పులు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, బిర్యానీ దినుసులు (లవంగం, విరజాజి మొగ్గ, బిర్యానీ ఆకు, ఏలకులు)- పావు కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక స్పూను, పెరుగు- ఒక కప్పు, నూనె- ఆరు స్పూనులు, నెయ్యి- ఆరు స్పూనులు, పచ్చిమిర్చి పేస్ట్- రెండు స్పూనులు, పసుపు- అర స్పూను, జీడిపప్పు- నాలుగు స్పూనులు, కిస్‌మిస్- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత, నీరు- తగినంత

తయారీ విధానం

- బాస్మతి బియ్యాన్ని బాగా కడిగి నీళ్లలో 15 నిమిషాలు నాననివ్వాలి.
- కందగడ్డ ముక్కలను ఉడికించి చల్లారనివ్వాలి. ఆ తర్వాత ఒక మూకుడులో మూడు స్పూన్ల నెయ్యి వేసి కందగడ్డ ముక్కలను వేయించాలి. మిగిలిన నెయ్యిలో జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేసి వేయించాలి. వీటిని ఒక పళ్లెంలో చల్లారనివ్వాలి.
- ఆ తర్వాత అదే మూకుడులో నూనెను వేసి వేడి చేయాలి. దానిలో ఉల్లిపాయముక్కలు, అల్లం- వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేగనివ్వాలి. ఆ తర్వాత బిర్యానీ దినుసులు, పచ్చి మిర్చి పేస్ట్, పసుపు వేసి వేయించాలి. ఉప్పు కూడా వేయాలి.
- ఆ తర్వాత బాస్మతి బియ్యం, కందగడ్డ ముక్కలు వేసి మూత పెట్టి సన్నని సెగపై ఉడకనివ్వాలి.
- బియ్యం ఉడికిన తర్వాత దానిలో పెరుగు వేసి కలపాలి. ఈ సమయంలో చెన్నంగి ఆకులు వేసి మరి కొంత సేపు ఉడకనివ్వాలి.
- ఇలా ఉడికిన అన్నంలో మూడు చెంచాల నెయ్యి, జీడిపప్పు, కిస్‌మిస్‌లు వేసి దింపేయాలి.

జాగ్రత్తలు


- ఉడికించిన కంద ముక్కలను దోరగా వేయించాలి. దీనివల్ల పై పొర కరకరలాడుతూ ఉంటుంది. లోపల మెత్తగా ఉంటుంది.
- సాధారణంగా ఒక కప్పు బాస్మతి బియ్యానికి ఒకటిన్నర నీళ్లు పోస్తే సరిపోతుంది. బాస్మతి బియ్యాన్ని ఎక్కువ సేపు ఉడకనివ్వకూడదు. ఎక్కువ ఉడికితే ముద్దగా అయిపోతుంది.
- కొందరు సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను నూనెలో వేయించి.. వాటిని చివరలో కలుపుతారు. దీనివల్ల పులావ్‌కు అదనపు రుచి వస్తుంది.



వాము ఆకు బంగాళ దుంపల కూర

కావాల్సిన పదార్థాలు

బంగాళదుంప ముక్కలు- 250 గ్రాములు, బాగా కడిగిన వాము ఆకు- ఒక కప్పుడు, పచ్చిమిర్చి ముక్కలు- నాలుగు స్పూనులు, ఉల్లిపాయ ముక్కలు- ఒక కప్పు, కరివేపాకు- ఒక రెబ్బ, జీలకర్ర- ఒక స్పూను, ఆవాలు- ఒక స్పూను, వెల్లుల్లి రెబ్బలు- మూడు, అల్లం పేస్ట్- ఒక స్పూను, నూనె- నాలుగు స్పూనులు, పసుపు- ఒక స్పూను, తరిగిన కొత్తిమీర- రెండు స్పూనులు, ఉప్పు- తగినంత.



తయారీ విధానం

- ఒక మూకుడులో నూనె వేసి వేడి చేయాలి. నూనె వేడి ఎక్కిన తర్వాత ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి వేసి వేయించాలి.
- ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, అల్లం పేస్ట్ వేయాలి. ఇవన్నీ బాగా వేగిన తర్వాత బంగాళ దుంప ముక్కలను వేసి మూత పెట్టి బాగా మగ్గనివ్వాలి.
- బంగాళ దుంప ముక్కలు కొద్దిగా మగ్గిన తర్వాత వాము ఆకులు, ఉప్పు, కొత్తిమీర వేసి కలిపి దింపేయాలి.

జాగ్రత్తలు

- వాము ఆకులు తాజాగా ఉంటే కూర ఘుమఘుమలాడుతుంది.
- కొందరు ఈ కూరలో పచ్చిమిర్చిని పేస్ట్ చేసి కూడా కలుపుతారు. కారం ఎక్కువ కావాలనుకొనేవారు పచ్చిమిర్చి పేస్ట్‌ను బంగాళదుంప ముక్కలతో పాటు వేయాలి.
- వాము ఆకులను ముందు వేయకూడదు. చివరలోనే వేయాలి.



చెఫ్: వి.నగేష్
వివాహ భోజనంబు
జూబ్లీహిల్స్, హైదరాబాద్
99899 61488

ప్రత్యేకించి పిల్లల కోసం

మార్కెట్లో దొరికే సౌందర్య ఉత్పత్తులన్నీ పెద్దల కోసం ఉద్దేశించినవి. అయితే పిల్లల కోసం ఎలాంటి ఉత్పత్తులను ఎంచుకోవాలి? వాటిని ఏ మోతాదులో వాడుకోవాలి?

పెళ్లిళ్ల లాంటి వేడుకల్లో పిల్లలను కూడా అందంగా ముస్తాబు చేయాలనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో పెద్దలు ఉపయోగించే సౌందర్య సాధనాలనే పిల్లలకూ ఉపయోగిస్తూ ఉంటాం. అయితే వాటిలో పిల్లలకు హాని కలిగించేవీ ఉంటాయి. కాబట్టి అప్రమత్తంగా వ్యవహరించాలి.

ఇవి వద్దు

- కోల్, కాజల్, సుర్మా, సింధూర్‌లలో భారీ లోహాలు, సీసం ఉంటాయి. కాబట్టి వాటిని పిల్లలకు వాడకూడదు. వీటికి బదులుగా కర్పూరంతో తయారయ్యే కాటుక ఉత్తమం.
- నెయిల్ పాలిష్‌లో ఉండే ఫార్మాల్‌డిహైడ్, టోలీన్ లాంటి రసాయనాలు పిల్లలకు హాని కలిగిస్తాయి. కాబట్టి అలాంటి కొన్ని రసాయనాలను వాడలేదని నిర్ధారించే వివరాల కోసం లేబుళ్లను వెతకాలి. '5 ఫ్రీ, 7 ఫ్రీ, 9 ఫ్రీ' లేబుళ్లతో కూడిన నెయిల్ పాలిష్ ఎంచుకోవాలి.
- లిప్‌స్టిక్‌లకు బదులుగా పిల్లలకు లిప్‌గ్లాస్ వాడుకోవచ్చు.

మేకప్



ఇంట్లోనే ఇలా...

పిల్లలకు ఎటువంటి చర్మ సమస్యలూ రాకుండా ఉండాలంటే సౌందర్య ఉత్పత్తులను ఇంట్లోనే తయారుచేసుకోవాలి.

- **లిప్‌స్టిక్:** తాజా కొబ్బరినూనె, బీట్‌రూట్ రసాలను కలిపి లిప్‌స్టిక్‌గా వాడుకోవచ్చు. దీన్నే బ్లష్‌గా ఉపయోగించుకోవచ్చు.
- మైనం, షియా బటర్ లేదా కోకో బటర్, కొబ్బరినూనెలకు, అదనపు రసాయనాలు, రంగులూ జోడించని ఆహారపు రంగులు లేదా బీట్‌రూట్ పొడిని కలుపుకోవచ్చు. అందుకోసం మైనం, వెన్న, కొబ్బరినూనెను గిన్నెలో వేసి, చిన్న మంట మీద వేడి చేయాలి. కరిగిన తర్వాత స్టవ్ మీద నుంచి దింపి, రంగును కలుపుకోవాలి. చల్లారిన తర్వాత నిల్వ చేసుకోవాలి.
- **కాజల్:** సంప్రదాయ పద్ధతిలో మసి, కర్పూరాలతో తయారుచేసుకున్న కాటుక సురక్షితమైనది.
- **ఐ షాడో, ఫేస్ పౌడర్:** బీట్‌రూట్ ముక్కలను ఎండబెట్టి పొడి చేసుకుని, షియా బటర్ కలుపుకుని వాడుకోవచ్చు. కోకో పౌడర్ కూడా ఐ షాడోగా పనికొస్తుంది.
- **ఐ లైనర్:** యాక్టివేటెడ్ చార్కోల్ ముద్దగా మారే వరకూ, దాన్లో చుక్కలు చుక్కలుగా డిస్టిల్డ్ వాటర్ కలుపుతూ ఉండాలి. కావలసిన చిక్కదనం వచ్చాక, డబ్బాలో నిల్వ చేసుకోవాలి.

సెలబ్ ఫిట్



అందం... అభినయం మాత్రమే సరిపోదు. తనను తాను నిరూపించుకొనేందుకు సరైన అవకాశం కూడా రావాలి. అందుకే చేతికి వచ్చిన ఏ ప్రాజెక్ట్‌నూ వదులుకోలేదు. ప్రతినాయకుడితో జోడీ కట్టి... తెరంగేట్రం చేసింది. నటిగా మంచి మార్కులు వేయించుకుని... ఆపై కథానాయికగానూ అలరిస్తోంది. పాత్రకు తగ్గట్టుగా శరీరాకృతిని సిద్ధం చేసుకొనే అతికొద్దిమంది తారల్లో ఒకరు... హుమా కురేషీ. నలభైకి దగ్గరలో ఉన్నా... ఆమెలో ఇంకా అలనాటి మెరుపులే. అందుకు ఆరోగ్యకరమైన అలవాట్లే కారణం అంటుంది హుమా.

ఉరకలేసే ఉత్సాహం

పన్నెండేళ్ల కెరీర్‌లో దాదాపు ముప్పై చిత్రాల్లో నటించింది హుమా. వీటిల్లో కొన్ని విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. గత ఏడాది చివరల్లో వచ్చిన 'తార్లా'లో తార్లా దలాల్‌గా అభిమానులను ఆకుట్టుకున్న ఆమె... విభిన్నమైన పాత్రలతో పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఢిల్లీలో పుట్టి పెరిగిన హుమా... అక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసింది. 'గార్గి కాలేజీ'లో హిస్టరీతో డిగ్రీ చదివింది. ఆమె తండ్రి సలీమ్ కురేషీ 'సలీమ్స్' గ్రూప్ రెస్టారెంట్లకు అధిపతి. తల్లి అమీనా గృహిణి. హుమాకు ముగ్గురు సోదరులు. నటుడు సాకిబ్ సలీమ్ వారిలో ఒకరు. నటనపై ఉన్న మక్కువతో హుమా డిగ్రీ అవ్వగానే... 'యాక్ట్ 1' థియేటర్ గ్రూప్‌లో చేరింది. కొన్ని నాటకాల్లో భాగమైంది. ఎన్‌కే శర్మ ఆమెకు గురువు. మార్గదర్శకుడు. ఆయన ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి డాక్యుమెంటరీలు రూపొందించింది.

ఢిల్లీ నుంచి ముంబయికి...

సినిమాల్లో అవకాశాల కోసం తొలిసారి ముంబయికి వచ్చింది హుమా. అదికూడా అనుకోకుండా..! "ముంబయికి రావాలనే ఆలోచనే నాకు అప్పటివరకు లేదు. అసలు సినీ నటి కావాలని కూడా కోరుకోలేదు. నటన మీద మక్కువతో థియేటర్ గ్రూప్‌తో కలిశాను అంతే. అయితే 'జంక్షన్' అనే చిత్రం ఆడిషన్స్ కోసం నా స్నేహితురాలు ముంబయికి రమ్మంది. 'వెళితే బాగుంటుంది కదా' అనుకున్నాను. అలా అనుకోకుండా ముంబయికి వచ్చి ఆడిషన్స్ ఇచ్చాను. అన్నీ అయిపోయాయి... కానీ ఆ ప్రాజెక్టు అంతటితోనే ఆగిపోయింది. అదే సమయంలో 'హిందుస్తాన్ యునిలివర్' కంపెనీకి ప్రచారకర్తగా రెండేళ్ల ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా శామ్‌సంగ్ మొబైల్ యాడ్‌లో ఆమిర్ ఖాన్‌తో, నెరోలాక్ ప్రకటనలో షారూక్ ఖాన్‌తో కలిసి నటించే అద్భుత అవకాశం లభించింది" అంటూ ఓ సందర్భంలో నాటి రోజులు గుర్తు చేసుకుంది హుమా.

అనురాగ్ చూసి...

మొబైల్ యాడ్‌లో హుమా అభినయానికి ఫిదా అయిన దర్శకుడు అనురాగ్ కశ్యప్... తన చిత్రాల్లో అవకాశం ఇస్తానని చెప్పాడు. 'అప్పుడు నేను అస్సలు నమ్మలేదు. ఎందుకంటే పరిశ్రమలో ఇలాంటి వాగ్దానాలు తరచూ వింటూనే ఉంటాం. కనుక అనురాగ్ ఇచ్చే అవకాశం కోసం ఎప్పుడెప్పుడా అని ఉత్సుకతతో ఎదురుచూడలేదు' అంటున్న హుమాకు ఆ తరువాత ఊహించని విధంగా తన మూడు ప్రాజెక్టుల్లో అవకాశం ఇచ్చాడు అనురాగ్. 2012లో విడుదలైన 'గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్'లో సహాయనటి పాత్ర ఇచ్చాడు అతడు. ప్రతినాయకుడిగా నటించిన నవాజుద్దీన్ సిద్దికీకి జోడీగా హుమా నటించింది. అది మంచి గుర్తింపు తీసుకువచ్చింది. వాస్తవానికి ఆమె అజిత్ 'బిల్లా2'లో హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం కావాల్సింది. ఏడొందల మందిని వడపోశాక హుమాను ఎంపిక చేసుకున్నాడు దర్శకుడు. కానీ ఆ చిత్రం షూటింగ్ ఆలస్యం కావడంతో, అప్పటికే ఒప్పుకున్న ఇతర ప్రాజెక్టుల కోసం నిర్మొహమాటంగా బయటకు వచ్చేసింది. అందుకు తానేమీ బాధపడలేదన్న హుమాకు, 'గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్' వరుస అవకాశాలు వచ్చాయి. 'డి డే, బదలాపూర్, హైవే, జాలీ ఎల్ఎల్‌బీ, తార్లా' తదితర చిత్రాల్లో కథానాయిక ప్రాధాన్యమున్న పాత్రలు పోషించింది. తమిళంలో కూడా పలు చిత్రాల్లో నటించిన ఆమె... వృత్తిగత జీవితంలోనే కాదు, వ్యక్తిగత జీవితంలోనూ ఎంతో క్రమశిక్షణ పాటిస్తుంది. ముఖ్యంగా వ్యాయామాలు, ఆహార నియమాల విషయంలో కచ్చితంగా ఉంటుంది.

వ్యాయామాలు ఇలా...

పరిశ్రమలోకి వచ్చిన కొత్తల్లో బొద్దుగా ఉన్న హుమాను చూసి కొందరు ఆట పట్టించేవారట. దాన్ని సవాలుగా తీసుకుని కొద్ది నెలల్లోనే నాజూకు శరీరంతో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే జిమ్‌లో గంటలు గంటలు గడపడం ఆమెకు నచ్చదు. శారీరక దారుఢ్యం, ఆరోగ్యంగా ఉండడానికే ఆమె ప్రాధాన్యం.



ఇదీ ఆహారం...

హుమా రోజువారీ ఆహారంలో ఏమేం ఉండాలనేది ఆమె శరీర తత్వాన్ని బట్టి రూపొందించారు న్యూట్రిషనిస్ట్ రాధిక కర్లే. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకు ప్రాధాన్యమిస్తుంది. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా రోజుకు మూడు లీటర్ల నీళ్లు తాగుతుంది.

ఉదయం: ప్రొబయోటిక్ యోగర్ట్ లేదా బాదం పాలతో ఓట్‌మీల్, ఒక యాపిల్, రెండు కర్జూరా.
భోజనానికి ముందు: ఒక దానిమ్మ పండు
మధ్యాహ్నం భోజనం: పావు కప్పు గ్రీక్ యోగర్ట్‌తో ఒక కప్పు పచ్చి కూరగాయలు, కప్పు ఉడకబెట్టిన కూరగాయలు, వంద గ్రాముల బాయిల్డ్/ గ్రిల్డ్ చికెన్.
సాయంత్రం: వ్యాయామానికి ముందు ఒక అరటిపండు. తరువాత మూడు ఉడకబెట్టిన ఎగ్‌వైట్స్.
రాత్రి భోజనం: ఇంట్లో చేసిన వెజిటబుల్ సూప్, కప్పు ఉడకబెట్టిన కూరగాయలు, వంద గ్రాములు బాయిల్డ్ చికెన్/ చేప.

- హుమా దినచర్య యోగాతో మొదలవుతుంది. క్లిష్టమైన ఏరియల్ యోగాను నిత్యం సాధన చేస్తుంది.
- యోగా తరువాత స్క్వాట్స్, ట్విస్ట్ సిట్‌అప్స్, పుషప్స్
- నడుము సన్నబడటానికి, దృఢంగా మారడానికి హులా హూప్‌తో వ్యాయామం
- వారంలో నాలుగు రోజులు రన్నింగ్, సైక్లింగ్‌తో కూడిన కార్డియో సెషన్.

కాల్షియం కావాలా!

శరీరానికి అత్యవసరమైన ఖనిజం కాల్షియం. ఇది ఎముకలు, దంతాలు, గోళ్లను బలంగా ఉంచుతుంది. కండరాల సంకోచం, నరాల పనితీరుకు సహకరిస్తుంది. ఇలా ఎన్నో ప్రయోజనాలను అందించే కాల్షియం పూర్తి స్థాయిలో శరీరానికి అందాలంటే ఎటువంటి ఆహారం తీసుకోవాలో చూద్దాం!

తాజా కూరగాయలు: దాదాపు అన్ని ఆకు కూరలు, కూరగాయల్లో ఎంతో కొంత కాల్షియం ఉంటుంది. కాలానుగుణంగా లభించే తాజా కూరగాయలను ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన కాల్షియం లభిస్తుంది.

నారింజ: ఇందులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. రోజుకు కనీసం ఒక నారింజనైనా తింటూవుంటే ఎముకల మధ్య ఉండే కార్టిలేజ్ గట్టిపడుతుంది. కీళ్ల వాతం రాకుండా ఉంటుంది.

బ్రకోలీ: ఇందులో కాల్షియంతోపాటు కె విటమిన్ కూడా ఉంటుంది. బ్రకోలీని వారానికి రెండుసార్లు తింటే ఎముకల్లో సాంద్రతను తగ్గించే వ్యాధులు రాకుండా ఉంటాయి. కీళ్ల అరుగుదలను నివారిస్తుంది.




నువ్వులు: నువ్వులను కూరల్లో, సలాడ్స్‌లో, స్వీట్లలో భాగంగా చేర్చి తింటూవుంటే శరీరంలో కాల్షియం లోపం అనేదే ఉండదు. బెల్లంతో కలిపి చేసే నువ్వుండలు పిల్లలకు మంచి పౌష్టికాహారం. ప్రతిరోజూ ఒక చెంచా మోతాదులో నువ్వులు తినడం మంచిది.

బాదాం: ప్రతిరోజూ బాదాంలను మంచి నీళ్లలో నానబెట్టి తింటూ ఉంటే శరీరానికి కావాల్సిన కాల్షియం మోతాదు మొత్తం అందుతుంది. కాబట్టి మిగిలిన ఆహార పదార్థాలు తీసుకొనేటప్పుడు వాటి నుంచి లభించే కాల్షియం పరిమాణాన్ని గమనించుకోవాలి.

చియా గింజలు: వీటిలో కూడా కాల్షియం సమృద్ధిగా ఉంటుంది. వీటిని నీటిలో వేయగానే బాగా ఉబ్బి రుచికరంగా మారతాయి. ఓట్స్, పెరుగు, స్మూతీస్, యోగర్ట్‌తో చేర్చి చియా గింజలను తీసుకోవచ్చు.

సోయా: పాలలో కాల్షియం ఉంటుందని అందరికీ తెలుసు. కానీ పాలు, పాల పదార్థాలు తీసుకోవడం ఇష్టం లేనివారికి సోయా పాలు, సోయా టోఫు మంచి ఆప్షన్‌గా చెప్పవచ్చు.



న్యాయాధికారుల పదవీ విరమణ వయసు 61 ఏళ్లు!

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు సవరణ బిల్లులను శుక్రవారం శాసనసభ ఆమోదించింది. న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 సంవత్సరాలకు పెంచుతూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు క్రమబద్ధీకరణ సవరణ బిల్లు-2024ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టారు. సభ్యులు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో ఈ బిల్లు సభ ఆమోదం పొందినట్లు స్పీకరు ప్రకటించారు. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ (రెండో సవరణ) బిల్లు కూడా సభ ఆమోదం పొందింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ద్రవ్య వినిమయ తాత్కాలిక బడ్జెట్-2 బిల్లును శాసనసభ ఆమోదించింది. ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై చర్చ లేకుండా శాసనసభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం: నిమ్మల

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారు. వచ్చే జూన్ నాటికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్ణయించారు' అని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. రూ.15వేల కోట్లతో ఫేజ్-1కు సిద్ధమైన జగన్ ప్రభుత్వం ఐదేళ్లల్లో రూ.5 ఖర్చు చేయలేదు. ఈ ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.17,050 కోట్లు. రెండుదశల్లో పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ముందుగా రూ.1,600 కోట్లతో పోలవరం లెఫ్ట్ కెనాల్ పూర్తి చేసి ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు అందిస్తాం' అని వివరించారు. అంతకుముందు కొణతాల మాట్లాడుతూ... 'ఆర్థిక ఇబ్బందులున్నప్పటికి ఉత్తరాంధ్ర ప్రజలను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి' అని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కోరారు.

వ్యవసాయాన్ని వైసీపీ మూసేసింది: సోమిరెడ్డి

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం వ్యవసాయం, నీటిపారుదల శాఖలను మూసేసిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన సభలో ప్రసంగించారు. 'వైసీపీ ప్రభుత్వం లష్కర్లకి కూడా జీతాలు ఇవ్వలేదు. 2014-19 మధ్యలో నీటి పారుదల శాఖకు రూ.68 వేల కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ప్రభుత్వం రూ.35వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. చివరికి పోలవరం ప్రాజెక్టును కూడా నిలిపివేసింది. వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. ఎమ్మెల్యేలు సభకు రాకపోవడం ప్రజా ధనం వృథా చేయడమే. అవసరమైతే ప్రజా ప్రతినిధుల చట్టానికి సవరణ చేయాలి' అని సోమిరెడ్డి కోరారు.

గిరిజన ప్రాంతాల్లో 2,500 కోట్లతో రోడ్లు: గుమ్మడి

'రాష్ట్రంలోని ఐటీడీఏల్లో రహదారులతో అనుసంధానం లేని 2,162 నివాస ప్రాంతాలకు రహదారులు నిర్మించేందుకు రూ.2,500 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం' అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి చెప్పారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో గిరిజన ప్రాంతాల్లో కనీస సదుపాయాలు లేవంటూ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, గౌతు శిరీష, వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీష దేవి, పల్లె సింధూరరెడ్డి, బండారు సత్యనారాయణ మూర్తి సభ దృష్టికి తెచ్చారు. మంత్రి సంధ్యారాణి స్పందించి.. 'గతంలో గిరిజన ప్రాంతాల్లో 122 ఫీడర్ అంబులెన్సులు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 47 అంబులెన్సులను పునరుద్ధరించాం. గిరిజనుల పోడు భూములకు పట్టాలిచ్చే పనిలో ఉన్నాం' అని తెలిపారు.

హాస్టళ్ల మరమ్మతులకు 143 కోట్లు: డోలా

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి డోలా బాలవీరాంజనేయులు అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులపై సభ్యులు చదలవాడ అరవిందబాబు, పల్లె సింధూరరెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. 'రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు కేటాయించాం. 65 వసతి గృహాల నిర్మాణం కోసం రూ.221 కోట్లు కేటాయించాం. టెండర్లు ఆహ్వానించాం. డిసెంబరు, జనవరి నెలల్లో టెండర్లు పూర్తి చేస్తాం' అని మంత్రి వివరించారు.

ఈఎస్ఐని నిర్లక్ష్యం చేసిన వైసీపీ: సుభాష్

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఈఎస్ఐ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆరోపించారు. తణుకు నియోజకవర్గంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంపై ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. '20వేల ఈఎస్ఐ కార్డులున్న చోట మాత్రమే 30 పడకల ఆస్పత్రిని నిర్మించాలన్న నిబంధన ఉంది. లెక్కల ప్రకారం తణుకులో 12.50 వేల మంది ఈఎస్ఐ కలిగి ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 10 మంది ఉద్యోగులున్న కంపెనీలను కూడా ఈఎస్ఐ, కార్మిక శాఖ పరిధిలోకి తీసుకువస్తోంది. ఇందుకు సంబంధించిన సర్వే ప్రారంభించాం. ఏడాదిలో ఈ సర్వే పూర్తి అవుతుంది. అప్పుడు తణుకులో 20వేల పైన కార్డులు అందుబాటులోకి వస్తాయి. ఈలోగా ఆస్పత్రి నిర్మాణానికి అవకాశాలు పరిశీలిస్తాం. కర్నూలులో కూడా 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్మిస్తున్నాం' అని చెప్పారు.

మంత్రి ఆలస్యంపై స్పీకర్ సీరియస్..

శుక్రవారం సభలో స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు సీరియస్ అయ్యారు. శాసనసభ తొలుత ప్రశ్నోత్తరాలతోనే ప్రారంభమవుతుంది. మంత్రులు ప్రశ్నోత్తరాల సమయంలో కచ్చితంగా సభలో ఉండాలి. తొలి రెండు ప్రశ్నలు వాయిదా పడడంతో తణుకు ఈఎస్ఐ ఆస్పత్రిపై ప్రశ్నను స్పీకర్ అనుమతించారు. ఆ సమయంలో మంత్రి వాసంశెట్టి సభలో లేరు. దీంతో స్పీకర్ అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది హడావిడిగా మంత్రి కోసం పరుగులు తీశారు. ఈలోగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై సభ్యుల ప్రశ్నలు, మంత్రి సమాధానం సాగాయి. అదే సమయంలో కార్మిక మంత్రి సభలోకి వచ్చారు. నిమ్మల సమాధానం పూర్తి అయిన తర్వాత స్పీకర్ ఈఎస్ఐ ఆస్పత్రిపై మాట్లాడేందుకు అనుమతిస్తూ... 'మంత్రులకు సీరియస్‌నెస్ లేకపోతే ఎలా? సమయానికి సభలోకి రావాలి' అని సూచించారు.

సీట్లు కేటాయించండి...

అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు సీట్లు కేటాయించాలని ఎమ్మెల్యే జోగేశ్వరరావు స్పీకర్‌ను కోరారు. సభ ప్రారంభం కాగానే స్పీకర్ అయ్యన్న పాత్రుడు సభలోకి ప్రవేశించారు. అదే సమయంలో సభలోకి వచ్చిన ఎమ్మెల్యే జోగేశ్వరరావు తమకు సీట్లు కేటాయించాలని కోరారు. దీనిపై స్పందించిన స్పీకర్... 'ప్రతిపక్షం లేదు కదా! అంతా మనదే. ఎక్కడ కావాలంటే అక్కడ, ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ కూర్చోండి' అని నవ్వుతూ సూచించారు.

వద్దంటే కూర్చుంటా.. లేదంటే రాను: జ్యోతుల

బడ్జెట్‌పై ఆర్థిక మంత్రి సమాధానానికి ముందుకు కొందరు ఎమ్మెల్యేలకు అవకాశం ఇచ్చారు. అందులో భాగంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడారు. పది నిమిషాల తర్వాత 'ఇక ముగించాలి' అని సభాధ్యక్ష స్థానంలో ఉన్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు సూచించారు. ఇంకొంత సమయం కావాలని నెహ్రూ అడిగారు. ఇంకా ముగ్గురు మాట్లాడాలని, ఉపసభాపతి అన్నారు. మరికాసేపటికి... 'సభ్యులు అసహనంగా ఉన్నారు. సమయం లేదు' అని ఉపసభాపతి అనగా జ్యోతుల నొచ్చుకున్నారు. 'నా కంటే ముందు మాట్లాడినవారు నాకన్నా సీనియర్లు కాదు. వారికి ఇచ్చిన సమయం నాకూ ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. లేదు కూర్చోమంటే కూర్చుంటా. అసలు సభకే వద్దంటే అసెంబ్లీకి రావడం మానేస్తా. నేను మాట్లాడుతున్నప్పుడు మీరు పదే పదే అడ్డుకుంటుంటే నన్ను ప్రతిపక్షంలా చూస్తున్నారని అనిపిస్తోంది' అన్నారు. దీనికి ఆర్ఆర్ఆర్ స్పందిస్తూ... 'మీరంటే నాకు ఎనలేని గౌరవం ఉంది. కానీ సభను నడపాలి. అందరికీ అవకాశం ఇవ్వాలి' అన్నారు. తర్వాత కొద్దినిమిషాలు మాట్లాడి నెహ్రూ ముగించారు. ప్రతి నియోజకవర్గంలోనూ 100 పడకల ఆసుపత్రి ఉండేలా చర్యలు తీసుకోవాలని నెహ్రూ కోరారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేసి వంద పడకలుగా మార్చాలన్నారు. వచ్చే బడ్జెట్‌లో అయినా అందుకు అనుగుణంగా కేటాయింపులు చేయాలని కోరారు.

కరోనాలా... జగన్ జరోనా: ఆదినారాయణరెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ, 'కరోనా తరహాలో జగన్ జరోనా లాంటోడు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన సభకు రావాలి. ఆయన రాకపోగా మిగిలిన పదిమందిని కూడా బయటకు తోలుకుపోయాడు. బడ్జెట్ చూసి తట్టుకోలేకే రావట్లేదు. ఎవరైనా పరీక్ష హాలులోనే పరీక్ష రాయాలి. కానీ ఆయన బయట రాస్తానంటాడు. ఇక్కడ అసెంబ్లీ జరుగుతుంటే ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడుతున్నాడు. జగన్ కచ్చితంగా సభకు రావాలి. అవసరమైతే సభకు రావాలని లేఖలు రాద్దాం. ఆయన వచ్చే వరకూ అసెంబ్లీ నడుపుదాం' అన్నారు.

జగన్ హయాం అప్పులకు లెక్కల్లేవు

ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకమే..

అప్పులు 9.74 లక్షల కోట్లుపైనే!.. ఇంకా తవ్వాల్సింది చాలానే ఉంది...

- ఇప్పటికి ఇంతే బయటపడ్డాయి
- ఒక్కో శాఖ అకౌంట్ క్లియరెన్స్‌కు 4 నెలలు
- 5 నెలలుగా రోజుకో దుర్మార్గం వెలుగులోకి..
- వైసీపీ మిగిల్చిన ఆర్థికకష్టాలతో కుంగుబాటు
- వస్తున్న పెట్టుబడులు చూస్తే తిరిగి ధైర్యం
- బడ్జెట్‌పై చర్చకు మంత్రి పయ్యావుల జవాబు



"అప్పులతో సంక్షేమం అందిస్తే రాష్ట్రం దివాలా తీస్తుంది. అందుకే అభివృద్ధి చేయడం ద్వారా వచ్చిన ఆదాయంతో పేదవారికి పథకాలు అమలు చేయడం మా ప్రభుత్వ విధానం. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారు. కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు కూడా వీలు లేకుండా చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను ఎలా అర్థం చేసుకోవాలనేదీ అర్థం కావడం లేదు. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నాం"

\- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన అప్పులకు లెక్కల్లేవని, ఐదు నెలల నుంచి రోజుకొక అరాచకం బయటపడుతోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఒక్కో శాఖలో అకౌంట్లు బయటకు తీయడానికి 4నెలల సమయం పడుతోందని చెప్పారు. రాష్ట్ర అప్పులు రూ.9.74 లక్షల కోట్లకుపైనే ఉన్నాయని, ఈ లెక్క ఇంకా పెరుగుతూనే ఉందని స్పష్టం చేశారు. ఫలానా తేదీలోగా ఇన్ని వేలకోట్ల అప్పులు కట్టాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయని చెప్పారు. ఏక్షణాన ఏ అప్పుల వాడు వస్తాడో, ఏ బ్యాంకరు వస్తాడోనని కంగారుగా ఉంటోందని వ్యాఖ్యానించారు. నాలుగురోజులు వరుసగా ఆర్థిక మంత్రిగా వైసీపీ ప్రభుత్వ బిల్లు బాధితుల కష్టాలు, సహచర మంత్రుల వినతులు వింటుంటే కుంగుబాటు వస్తోందని చెప్పారు. అదే సమయంలో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను చూస్తుంటే తిరిగి ధైర్యం వస్తోందని వ్యాఖ్యానించారు. శుక్రవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చకు మంత్రి సమాధానం ఇస్తూ ఈ వివరాలు పంచుకున్నారు. "2014-19లో చంద్రబాబు హయాంలో 13.5 శాతం వృద్ధి నమోదైంది. అది అలాగే కొనసాగి ఉంటే రూ.76,000 కోట్ల ఆదాయం అదనంగా ఏపీకి వచ్చేది. కానీ, జగన్ హయాంలో కేవలం అప్పులపై ఆధారపడడంతో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఐదేళ్లలో ప్రతి శాఖలోనూ ఆర్థిక అరాచకమే. దేనికీ సరైన లెక్కలు, జమా ఖర్చులు లేవు" అని మంత్రి తెలిపారు.

అంతా అంకెల గారడే..

గత ప్రభుత్వం అంకెల గారడీతో అన్ని వ్యవస్థలను అస్తవ్యస్తం చేసిందని పయ్యావుల అన్నారు. "కేంద్ర సంస్థలను జగన్ ప్రభుత్వం తప్పుదారి పట్టించింది. ఇప్పుడు కూడా అదే గారడీ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. బిల్లులను పెండింగ్‌లో పెట్టడంతో అనేకమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. పిల్లలకిచ్చే చిక్కీల బిల్లులు కూడా పెండింగ్‌లో పెట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో కళాశాలల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వలేదు. మేం వచ్చాక సర్టిఫికెట్లు ఇప్పిస్తున్నాం. పోలవరం పనులు నిలిపివేసి డయాఫ్రమ్ వాల్ విధ్వంసానికి కారణమయ్యారు. రోడ్ల మరమ్మతులు చేపట్టలేదు. ఇసుక, మద్యం మాఫియాను ప్రోత్సహించారు" అని వివరించారు. చట్టసభల అనుమతి లేకుండా రూ.634 కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ చెప్పిందని గుర్తుచేశారు. జగన్ హయాంలో ఏపీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌ను ఏర్పాటుచేసి ప్రభుత్వ శాఖలను ఊడ్చేశారని వెల్లడించారు. రూ.80,000 కోట్లు విలువైన ఉద్యోగుల పీఎఫ్, సీపీఎస్, స్మాల్ డిపాజిట్లు....గత ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఇందులో రూ.21,000 కోట్లు ఉద్యోగులకు విధిగా ఇవ్వాల్సిన నిధులున్నాయని చెప్పారు. జగన్ ప్రభుత్వ ఆర్థిక అరాచకాలు భరించలేక మిగతా రాష్ట్రాలు కూడా అలా చేస్తాయేమోనని కేంద్రం చట్టాలు కూడా మార్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి చెప్పారు.

నాటి అరాచకాలకు కాగ్ పత్రమే రుజువు

గత ప్రభుత్వం తమకు కావాల్సిన వారి బిల్లులనే సీఎఫ్ఎంఎస్‌లో ప్రవేశపెట్టిందని మంత్రి గుర్తుచేశారు. బయటకు కనపడుతున్న లెక్కలు వేరు, తవ్వి నకొద్దీ వచ్చే లెక్కలు వేరన్నారు. జగన్ హయాంలో కాగ్ ప్రభుత్వానికి క్వాలిటేటివ్ సర్టిఫికెట్ ఇచ్చిందని, స్వతంత్రభారతంలో ఏరాష్ట్రానికీ కూడా ఇప్పటి వరకు కాగ్ ఆ పత్రం జారీ చేయలేదని చెప్పారు. దానర్థం ఏంటంటే తమకు చూపించినటువంటి లెక్కల ప్రకారం ఇంతమేరకే తాము సర్టిఫై చేస్తున్నాం... చూపించనివి ఇంకా ఉన్నాయి...వాటి గురించి తమకు తెలియదని.... ఆనాడు జరిగిన ఆర్థిక అరాచకాలకు ఈ పత్రమే రుజువు అని మంత్రి తెలిపారు.

గవర్నర్ నెత్తినా 'అప్పు'

అసెంబ్లీ అనుమతి లేకుండా ఖర్చు పెట్టడమే కాకుండా, కాగ్ పర్యవేక్షణలో లేని కార్పొరేషన్ల ద్వారా కూడా అప్పులు చేసి వాటి ద్వారానే మళ్లించే అరాచక విధానాన్ని జగన్ అవలంబించారని మంత్రి మండిపడ్డారు. ఏపీఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా బ్యాంకుల నుంచి రూ.25,000 కోట్ల అప్పు తీసుకుని... గ్యారంటీర్‌గా గవర్నర్‌ను (గవర్నమెంట్) పెట్టే హీనస్థితికి నాటి జగన్ సర్కారు దిగజారిందని కేశవ్ ఆగ్రహించారు. మరి.. రుణం తీర్చకపోతే చర్యలు తీసుకోవడానికి గవర్నర్‌కు రాజ్యాంగ రక్షణలు ఉంటాయి కదా అని బ్యాంకర్లు అభ్యంతరపెట్టగా, గవర్నర్ రక్షణలను సైతం తొలగిస్తూ జీవోను తెచ్చి అభాసుపాలు అయ్యారన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు దాచుకున్న 2,100 కోట్లను ఎల్ఐసీ నుంచి తీసుకొచ్చి వాడేశారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ఎనర్జీ ఉద్యోగుల సేవింగ్స్ రూ.5,043 కోట్లు వాడేశారని వెల్లడించారు.

జగన్ స్వార్థం వల్లే

'విద్యుత్' సంక్షోభం

- నాడు పీపీఏల రద్దుకు మారణాయుధాలతో పారిశ్రామికవేత్తలకు బెదిరింపు: మంత్రి గొట్టిపాటి



అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ రంగం దారుణ సంక్షోభానికి జగన్ స్వార్థ పరిపాలనే కారణమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నాడు విద్యుత్ పీపీఏల రద్దుకు పారిశ్రామిక వేత్తల్ని మారణాయుధాలతో బెదిరించిన మాఫియా ప్రభుత్వమని అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం అసెంబ్లీలో విద్యుత్ సంస్కరణ బిల్లుకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... ప్రజలపై మోపిన చార్జీల భారం, లోవోల్టేజీ సమస్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లలో కష్టాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి సమాధానమిస్తూ... 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి తన స్వార్థం కోసం పీపీఏలను రద్దు చేసి సర్వనాశనం చేశారని విమర్శించారు. కేంద్రం వద్దన్నా వినకుండా ఉత్పత్తి ఆపించి, ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారాన్ని మోపారన్నారు. ఇప్పుడు మళ్లీ సంస్కరణలకు శ్రీకారం చుట్టామని, 'ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024'కు అసెంబ్లీ ఆమోదం లభించినందున మంచి రోజులు వస్తాయని మంత్రి అన్నారు.

కడపలో తాగునీటికి కటకట

- ఐదు రోజులకోసారి వస్తున్నాయి: మాధవిరెడ్డి
- 'శింగనమల'లోనూ నీళ్లు లేవు: ఎమ్మెల్యే శ్రావణి

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేలా బడ్జెట్ రూపొందించారు. ప్రజలకు మేలు చేసే బడ్జెట్ చూసి దానిపై ప్రశ్నించేందుకు అవకాశం లేక జగన్ అసెంబ్లీకి రావట్లేదు' అని పలువురు ఎమ్మెల్యేలు అన్నారు. శుక్రవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో పలువురు పాల్గొన్నారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ, 'మేం టీవీలు, ఫ్రిజ్‌లు అడగట్లేదు. కేవలం తాగునీరు అడుగుతున్నాం. కడప కార్పొరేషన్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. 70 ఎంఎల్‌డీ నీళ్లు అవసరం కాగా 40 ఎంఎల్‌డీలే వస్తున్నాయి. ఐదారు రోజులకోసారి అదీ మురికినీరు వస్తోంది. బడ్జెట్‌లో కేటాయింపులు చేసి తాగునీటి కష్టాలుతీర్చాలి' అని కోరారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ, 'శింగనమలలోనూ తాగునీటి కష్టాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రాజెక్టులున్నా నీళ్లు లేవు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులు తాకట్టుపెట్టి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌ది అని ఎమ్మెల్యే గౌతు శిరీష విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దీపం పథకం ద్వారా మహిళలకు మేలు చేసిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు.

టీచర్లపై కేసులు ఎత్తివేస్తాం

- డీజీపీతో దీనిపై చర్చలు జరుగుతున్నాయి
- ప్రభుత్వ మార్పునకు టీచర్ల ఉద్యమమే కారణం
- కేసులు పెట్టి అప్పట్లో వేధించిన వైసీపీ సర్కారు
- టీచర్లు చదువు మాత్రమే చెప్పాలి
- బాత్‌రూమ్ ఫోటోలు తీయడం వారి పనికాదు
- శాసనసభలో మంత్రి లోకేశ్ వెల్లడి



అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. డీజీపీతో ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఈ మేరకు ఆయన సమాధానం ఇచ్చారు. "విద్యార్థులు పాఠాలు చెప్పడమే ఉపాధ్యాయుల విధి. వారిని హింసించడం, ఇతర పనులు అప్పగించడం చేయరాదు. కానీ, గత ప్రభుత్వం బాత్‌రూమ్‌ల ఫొటోలు వారితోతీయించింది. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని రద్దుచేశాం" అని లోకేశ్ తెలిపారు. కేసులు లేకుండా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. "1994 నుంచి టీడీపీ ప్రభుత్వంలో 15 డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చాం. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం 2.20 లక్షల ఉద్యోగాలు నోటిపై చేస్తున్నామనీ, అందులో 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని సెలవిచ్చారు. ఎన్నికలకు రెండు నెలలు ఉందనగా నోటిఫికేషన్ ఇచ్చారు. నిరుద్యోగ యువతను మభ్య పెట్టేందుకు 6100 పోస్టులకు ఈ నోటిఫికేషన్ ఇచ్చారు. డీఎస్సీ ద్వారా జగన్ భర్తీ చేసిన పోస్టులు సున్నా" అని లోకేశ్ ఎద్దేవా చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇస్తే బాగుంటుందని ఎమ్మెల్యే మాధవి కోరగా, ఇందుకు సంబంధించిన ఫైల్ సీఎం వద్ద పరిశీలనలో ఉందని లోకేశ్ చెప్పారు. డీఎస్సీ ప్రక్రియ ఎప్పుడు పూర్తి చేస్తారని పల్లా శ్రీనివాస్ అడగగా, వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. "రాష్ట్రంలో ప్రభుత్వం మారడానికి టీచర్లే కారణం. ఆ రోజు ఉపాధ్యాయులు రోడ్డు ఎక్కి వారి హక్కుల కోసం పోరాటం చేశారు. ఆ రోజు నుంచి ప్రజలకు కూడా ధైర్యంవచ్చి ప్రభుత్వాన్ని వ్యతిరేకించారు. ఆ కోపంతో టీచర్లపై తప్పుడు కేసులు పెట్టి జగన్ ప్రభుత్వం వేధించింది" అని లోకేశ్ గుర్తుచేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 6లక్షలమంది విద్యార్థులు తగ్గారన్నారు. గత ప్రభుత్వంలో పాఠశాలల విలీనం, టీచర్లపై పనిభారం పెంచడం చేస్తూ తెచ్చిన వివాదాస్పద జీవో 117కు మార్పు చేసే దిశగా పని చేస్తున్నామని, వివిధ సంఘాలతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ఉపాధ్యాయులకు సమయం కేటాయించి ప్రతివారం వారి సమస్యలు తెలుసుకుంటున్నామని, క్షేత్ర స్థాయి అంశాలు దానివల్ల తమకు తెలిసే అవకాశం లభించిందని లోకేశ్ తెలిపారు.

స్కూళ్లకు చలోచలో..

ఎమ్మెల్యేలు స్కూలుబాట పట్టాలని మంత్రి లోకేశ్ కోరారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తన నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ మంత్రి ఈ సూచన చేశారు. పాఠశాలకు ర్యాంకింగ్‌విధానం తీసుకువస్తామని, ఏబీసీడీ కేటగిరిగా పాఠశాలలను విభజించి మౌలిక సదుపాయాలు, సిబ్బంది సమస్యలపై దృష్టి సారిస్తామని చెప్పారు. డిసెంబరు మొదటి వారంలో పీటీఎం ఏర్పాటు చేస్తున్నామనీ, ఎమ్మెల్యేలందరూ పాల్గొనాలని కోరారు.

మీ తాతగారు కట్టించిన స్కూలు అది: లోకేశ్‌ను ఉద్దేశించి స్పీకర్ వ్యాఖ్య

ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ... భీమిలీ, తగరపువలసలోని రెండు డిగ్రీ కాలేజీల్లో సిబ్బంది కొరత ఉన్నదని లోకేశ్ దృష్టికి తెచ్చారు. తగరపువలసలోని జూనియర్ కాలేజీలు మౌలిక సదుపాయాల సమస్యలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సింహాచలంలోని రెసిడెన్సియల్ పాఠశాలలో వసతుల సమస్య తీవ్రంగా ఉందన్నారు. దీనిపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించారు. స్పీకర్ జోక్యం చేసుకుని... సింహాచలంలోని రెసిడెన్సియల్ స్కూలు మీ తాతగారు కట్టించారని లోకేశ్‌ను ఉద్దేశించి అన్నారు. అందువల్లే ఆ స్కూల్‌పై తనకు మరింత బాధ్యత ఉందని మంత్రి స్పందించారు.

ఉద్యోగుల హర్షం

విజయవాడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేస్తామని మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించడంపై ఏపీసీపీఎస్ఈఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పఠాన్ బాజీ, కరిమి రాజేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. 2022, సెప్టెంబరు 1న 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చామని, దీంతో నాటి వైసీపీ ప్రభుత్వం వేలాది మంది సీపీఎస్ ఉద్యోగులపై కేసులు పెట్టిందన్నారు. ఈ కేసులపై గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వంలోని మంత్రులను అనేకసార్లు కలిసి విజ్ఞప్తి చేశామని, మంత్రి లోకేశ్ సానుకూల ప్రకటన చేయడం సంతోషమని తెలిపారు. అలాగే, పాత పెన్షన్‌ను పునరుద్ధరించి లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాడేరు వైద్య కళాశాలకు 'సున్నా'

- మండలిలో మంత్రి సత్యకుమార్ ఫైర్

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల నిర్మాణంపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పెద్దఎత్తున దుమారం రేగింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దుయ్యబట్టారు. వైద్యకళాశాలల నిర్మాణం విషయంలో జగన్ పక్షపాతం చూపారని మండిపడ్డారు. అన్ని మెడికల్ కళాశాలల నిర్మాణానికి ఒకే విధంగా నిధులు ఖర్చుచేయలేదన్నారు. పులివెందులలో కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లకుగాను రూ.293కోట్లు ఖర్చుచేశారని, గిరిజన ప్రాంత విద్యార్థుల కోసం పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణానికి పైసా ఖర్చు చేయలేదన్నారు. జగన్ సహా వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 వైద్య కళాశాలలు నిర్మించామంటూ వైసీపీ సభ్యులు నిస్సిగ్గుగా చెబుతున్నారని పేర్కొన్నారు. ఏడాదిలో తాడేపల్లి ప్యాలెస్, 26 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు, రిషికొండలో ప్యాలెస్ కట్టుకున్న జగన్.. వైద్య కళాశాలలను ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. పులివెందుల్లో వైద్య ఆస్పత్రి మాత్రమే కట్టారని, ఆడపిల్లలకు హాస్టల్స్ కట్టలేదని, వారు చెట్లకింద కూర్చొని చదువుకోవాలా? అని మంత్రి ఏకిపారేశారు. 15 వైద్య కళాశాలల నిర్మాణం పూర్తికాకపోవడంతో 750సీట్లు ఆగిపోయాయన్నారు. దీనికి బాధ్యత ఎవరిదో వైసీపీ సభ్యులే సమాధానం చెప్పాలని నిలదీశారు. మంత్రి సమాధానం సభను తప్పుదోవ పట్టించేలా ఉందంటూ వైసీపీ ఎమ్మెల్సీలు వాకౌట్ చేశారు. కాగా, సాక్షి పేపర్, టీవీల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని చైర్మన్ మోషేన్‌రాజును కోరారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని, శాసనసభను, ప్రజాస్వామ్యాన్ని అవమానించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

సొంత బ్రాండ్లతో అడ్డగోలుగా దోచుకున్నారు

- వైసీపీ ప్రభుత్వంపై మంత్రి కొల్లు మండిపాటు
- మండలిలో ఎమ్మెల్సీ దువ్వాడ, కొల్లు మధ్య వాగ్వాదం



అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'మద్యం పాలసీ ఇప్పుడు గుర్తుకొచ్చిందా? మద్యాన్ని సొంత జాగీరులా వాడుకున్నారు' అంటూ వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో నూతన మద్యం పాలసీపై సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు, దువ్వాడ మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం దుకాణాలు పెంచారని, టెండర్లలో రౌడీయిజం జరిగిందని దువ్వాడ ఆరోపించారు. అయితే గత ప్రభుత్వంలో ఏం జరిగిందో వివరిస్తూ మంత్రి కొల్లు కూడా అంతే దీటుగా సమాధానం ఇచ్చారు. ఈ సమయంలో వైసీపీ సభ్యులు నిలబడి ఆవేశంతో కేకలు వేస్తూ మాట్లాడారు. గత ప్రభుత్వంలో మద్యంలో రూ.18 వేల కోట్ల అవినీతి జరిగిందని ప్రాథమిక అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్జాతీయ బ్రాండ్లను ఆపేసి, సొంత బ్రాండ్లను తెచ్చి అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ పేమెంట్లు లేకుండా నగదు చెల్లింపులే తీసుకున్నారని, రూ.లక్ష కోట్లు ఎవరి జేబులోకి వెళ్లాయని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నూతన మద్యం విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. తమ ప్రభుత్వం ఎక్కడా దుకాణాలను పెంచలేదని, రాష్ట్రంలో మద్యం దుకాణాలను పెంచింది వైసీపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న 3,396 షాపులకే టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. 10శాతం మద్యం దుకాణాలు కల్లుగీత కార్మికులకు కేటాయించడం తప్పా అని మంత్రి ప్రశ్నించారు. లాటరీ ద్వారా పారదర్శకంగా షాపులు కేటాయింపుల వల్ల వైసీపీ వారికీ షాపులు రావడం నిజం కాదా అని మంత్రి ప్రశ్నించారు. రూ.99 చీప్ లిక్కర్‌ను అన్నిచోట్లా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. మద్యం ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని కొల్లు హెచ్చరించారు.

మెడికల్ కాలేజీలన్నీ ప్రభుత్వమే చేపట్టాలి: లక్ష్మణరావు


రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలన్నింటినీ ప్రభుత్వమే నిర్వహించాలని, 100 శాతం సీట్లను నీట్ కౌన్సెలింగ్ ద్వారానే కేటాయించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కే.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు చేపట్టిందని, అందులో ఐదింటిలో ఈ ఏడాది అడ్మిషన్లు జరిగాయన్నారు. ఈ కాలేజీల్లో 50% సీట్లను నీట్ కౌన్సెలింగ్‌కు ఇచ్చి, మిగతా సగం సీట్లను ప్రైవేట్‌గా అమ్ముకునే ఆలోచనగా ఉన్నట్లు అనిపిస్తోందని ఆరోపించారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్వహించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో తెలుగు వర్సిటీ, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పాత విషయాలు ఎందుకు?: వైసీపీ ఎమ్మెల్సీలు

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌పై చర్చ జరపకుండా, మంత్రులు ఆవేశాలకు లోనవుతూ పాత విషయాలు ప్రస్తావిస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆ పార్టీ ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, ఎం.అరుణ్‌కుమార్, కె.రవిబాబు, ఎస్.సుబ్రహ్మణ్యం, వంకా రవీంద్రనాథ్, డాక్టర్ మధుసూదన్ తదితరులు మాట్లాడారు. మండలిలో ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు దాటవేస్తున్నారని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్సీల ప్రసంగాలకు కూటమి మంత్రులు, సభ్యులు ఆటంకాలు కల్పిస్తున్నారన్నారు. మెడికల్ కాలేజీలపై చర్చలో.. వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ వైసీపీ నేతలను అవహేళనగా మాట్లాడారని, ఆయన హావభావాలు సరికాదన్నారు. మంత్రి వ్యాఖ్యలకు నిరసనగా మండలి నుంచి వాకౌట్ చేసినట్లు చెప్పారు. దీపం-2 పథకం లబ్ధిదారుల సంఖ్యపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, గత ప్రభుత్వం చేపట్టిన 17 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలని, జీడీ మామిడి రైతులకు పంట బీమా గడువు పెంచాలని, ప్రీమియం ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు.

నా రాజీనామాను ఆమోదించండి: కల్యాణ్ చక్రవర్తి

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శాసనమండలి చైర్మన్ తన రాజీనామాను ఆమోదించకుండా తన హక్కులను కాలరాసేలా వ్యవహరిస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి ఆరోపించారు. మండలి సభ్యత్వానికి తాను రాజీనామా చేసి దాదాపు 2నెలలు దాటిందని, వ్యక్తిగతంగా హాజరై చైర్మన్‌కు రాజీనామా పత్రం అందజేశానని తెలిపారు. ఆ తర్వాత కూడా పలు దఫాలు చైర్మన్‌ను కలిసి తన రాజీనామా ఆమోదించాలని కోరానని, గురువారం శాసనమండలి సాక్షిగా మరోసారి చైర్మన్‌కు ఇదే విషయం స్పష్టం చేశానన్నారు. ఇంకా తన రాజీనామా ఆమోదించకుండా హక్కుల్ని కాలరాస్తున్నారని ఆరోపించారు.



క్యాస్ట్ ఫీలింగ్ అనుకుంటారు: ఆర్ఆర్ఆర్

విశాఖపట్నం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతున్న సమయంలో ఉపసభాపతి ఆర్ఆర్ఆర్ విసిరిన చలోక్తి సభలో నవ్వులు పూయించింది. బడ్జెట్‌పై విష్ణుకుమార్ రాజు మాట్లాడుతున్నప్పుడు 'ఇక ముగించండి' అనే ఉద్దేశంతో సభాపతి స్థానంలో ఉన్న ఆర్ఆర్ఆర్ బెల్ కొట్టారు. 'మీకు, నాకు 40 ఏళ్ల అనుబంధం ఉంది. ఇంకొంత సమయం ఇవ్వాలి' అని ఎమ్మెల్యే కోరారు. 'ఇంకా ఎక్కువ సమయం ఇస్తే క్యాస్ట్ ఫీలింగ్ అనుకుంటారు' అని ఆర్ఆర్ఆర్ అనడంతో ఎమ్మెల్యేలంతా ఒక్కసారిగా నవ్వారు. విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, 'వ్యక్తిగతంగా మద్యం సీసాలు కలిగి ఉండే పరిమితి పెంచాలి. ఒక వ్యక్తి వద్ద ఆరు కంటే ఎక్కువ ఉంటే అరెస్టు చేస్తున్నారు. ఎవరైనా స్నేహితులు విదేశాల నుంచి వచ్చేప్పుడు కొన్ని సీసాలు ఇచ్చినా వాటిని ఉంచుకోవడం నేరంగా మారుతోంది' అని విజ్ఞప్తి చేశారు.

కబ్జాకోర్ల గుండెల్లో దడపుట్టేలా చట్టం

» 10 నుంచి 14 ఏళ్లు శిక్ష పడేలా తీసుకొస్తున్నాం: అనగాని

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ కబ్జాలపై ప్రభుత్వానికి ఇప్పటి వరకు 8,305 ఫిర్యాదులు వచ్చాయని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. 7,873 ఎకరాల భూములు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు నిర్ధారించామని, కబ్జా అయిన బీసీ, ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములపై పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వంలో 13,59,505 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశామని, అనంతరం 25,276 ఎకరాలు అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించామని చెప్పారు. రెవెన్యూకు సంబంధించి 70 వేల ఫిర్యాదులు రాగా, వాటిలో 8,305 ల్యాండ్ గ్రాబింగ్ ఫిర్యాదులే ఉన్నాయన్నారు. భూ కబ్జాల నివారణకు కొత్తగా ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక చట్టాన్ని తీసుకువస్తున్నామని, కబ్జాదారులకు 10-14 ఏళ్ల శిక్ష పడేలా ఈ చట్టం ఉంటుందని తెలిపారు. పేదల భూములు అన్యాక్రాంతం కాకూడదనే కబ్జాకోర్ల గుండెల్లో దడ పుట్టించేలా కొత్త చట్టం తెస్తున్నామన్నారు. మదనపల్లెలో 13 వేల ఎకరాల్లో పేర్లు మార్చారని, 500 ఎకరాలపై అక్రమాలు నిర్ధారణయ్యాయని చెప్పారు. మదనపల్లె అక్రమాల్లో అధికారులు, నేతలు ఎంతటి వారున్నా శిక్షిస్తామని చెప్పారు. కాగా, దీపం-2 పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి వైసీపీ సభ్యులు ప్రజల్లో అనుమానాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీలు కరుదు కల్యాణి, మంగమ్మ అడిగిన ప్రశ్నలకు ఈ మేరకు మంత్రి సమాధానమిచ్చారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని పలు మండలాల్లో పంట నష్టం జరిగిందని, ఐదు జిల్లాల్లోని 54 మండలాలను అక్టోబరు 29న కరువు మండలాలుగా ప్రకటించామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో కరువు మండలాలపై సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సిద్ధం సభలకు ఆర్టీసీ బస్సులను తరలించడం వల్ల బస్సులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని రవాణాశాఖమంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పారిశ్రామిక విధానంపై మండలిలో సుదీర్ఘ చర్చ...

ఎంఎస్ఎంఈ పారిశ్రామిక విధానాలపై శాసనమండలిలో శుక్రవారం సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రైవేటు వ్యక్తులు పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేసుకుంటే, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలు పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వారికి పది శాతం అదనంగా రాయితీ ఇస్తున్నట్లు ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పారిశ్రామిక పార్కులో స్థలాల కేటాయింపులో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నారా? అని వైసీపీ సభ్యులు ప్రశ్నించగా, ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు కోరారు. ఏపీఐఐసీ భూములు, ప్రభుత్వ భూముల్లో పార్కులు అభివృద్ధి చేస్తే రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ప్రైవేటు వ్యక్తులు ప్రైవేటు స్థలాల్లో పార్కులు అభివృద్ధి చేసిన చోట పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొస్తే వారికి కూడా పది శాతం అదనంగా రాయితీ ఇస్తున్నామని చెప్పారు. పాలసీ విధివిధానాలు రాతపూర్వకంగా సభ్యులకు అందజేస్తామన్నారు. ఆరు పారిశ్రామిక విధానాలను మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్ సభలో ప్రవేశపెట్టారు. పాలసీల్లో 4.0ను తీసుకొస్తామని, భవిష్యత్తులో అవసరమైతే సవరణలు చేస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు వస్తాయని, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 20 వేల కోట్లు పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని చెప్పారు.

దోచేసి.. దాచేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఉందని ప్రశంసించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శుక్రవారం అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్ర విభజన నాటికి లోటు బడ్జెట్‌తో ఉన్న ఏపీలో ఒక్కో మెట్టు పేర్చుకొంటూ.. రాజధాని, పోలవరం నిర్మాణం చేసుకొంటూ.. పరిశ్రమల్ని స్వాగతించి ప్రోత్సాహకాలిస్తూ తాముస్తే... ఒక్క చాన్స్ పేరుతో ప్రజల్ని ఆర్థిక ఉగ్రవాది జగన్ మోసగించి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. మద్య నిషేధం మోసంతో ప్రజల్ని.. అధికారం, అవినీతితో ప్రభుత్వ సంపదను దోచుకుని రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలు కోసం ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై సమీక్షిస్తే 45ఏళ్ల రాజకీయ అనుభవంలో కని, విని, ఎరుగని దారుణ పరిస్థితులు కనిపించాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1994లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దయనీయ స్థితికి తీసుకురాగా, 2024లో వైసీపీ వెంటిలేటర్‌పైకి నెట్టిందని వాపోయారు. ముప్పై ఏళ్ల క్రితం తాను ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న కఠిన నిర్ణయాలు, చేపట్టిన సంస్కరణలతో తెలంగాణ ఆర్థిక పరిస్థితి దేశంలోనే గొప్పగా ఉందన్నారు. విభజిత ఏపీకి 2014లో చికిత్స చేస్తూ.. 2019నాటికి తెలంగాణ కన్నా ఏపీకి 17వేల కోట్లు అదనంగా ఆదాయం వచ్చే స్థాయికి తెచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. దేశంలోనే గొప్ప నగరంగా అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక స్థితికి మెరుగులు చేపట్టామన్నారు. దురదృష్టవశాత్తూ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసి తెలంగాణ కన్నా 62వేల కోట్లు వెనక పడే స్థాయికి దిగజార్చిందని వాపోయారు. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో బయటికి తీశామని చంద్రబాబు చెప్పారు. "ప్రతి నెల 64లక్షల మందికి పింఛన్లు.. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతి నిమిషమూ అందరం కష్టపడాలి" అని సీఎం అన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

ఐదేళ్ల అరాచకం.. 30ఏళ్లు వెనక్కి రాష్ట్రం..

"గత ఐదేళ్ల అరాచక పాలనతో రాష్ట్రం ముప్పై సంవత్సరాలు వెనక్కి పోయింది. ఆర్థిక ఉగ్రవాది రాజకీయాల్లోకి వచ్చి అధికారంతో ఇంతలా దోచేసి తప్పించుకుంటారని ఎప్పుడూ ఊహించలేదు.. ఎక్కడ ఎవరికి ఏది చిక్కితే అది లూటీ చేసేశారు.. అప్పులు, తప్పులు, నేరాలు, అసమర్థపాలన, ప్రజా సంపద దోపిడీ, స్కాముల కోసం స్కీములతో రాష్ట్రం సర్వ నాశనమైంది. ఏపీని ఎలా గట్టెక్కించాలనే ఆలోచన చేస్తున్నాం.. అందరం కష్టపడాలి.. పని చేసినంత ఉంది.. పని దొంగల్ని మాత్రం వదిలి పెట్టను. ఎన్డీయేను ప్రజలు దీవించడం వల్ల కేంద్రం బాగా సహకరిస్తోంది. రాష్ట్రాభివృద్ధికి నరేంద్ర మోదీ సహకారం అందిస్తున్నారు"

ఇదిగో 9,74,556 కోట్ల అప్పు లెక్క

» కాదనేవారికి లెక్కలు చూపిస్తా.. గుంజీలు తీయిస్తా..: చంద్రబాబు

"రాష్ట్రంపై అప్పు పది లక్షల కోట్లు ఎక్కడుందని మాట్లాడుతున్నారు.. ఇదిగో ఆ లెక్క" అంటూ సభలో గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల చిట్టా చంద్రబాబు చదివారు.. అవి...


- ప్రభుత్వ అప్పులు రూ.4,38,278కోట్లు..
- పబ్లిక్ అకౌంట్ లయబిలిటీస్ 80,914 కోట్లు..
- కార్పొరేషన్ అప్పులు రూ. 2,48,677కోట్లు..
- పౌర సరఫరాల సంస్థ 36,000 కోట్లు..
- విద్యుత్ రంగం 34,267కోట్లు..
- అన్ని స్కీముల బకాయిలు 1,13,244కోట్లు..
- ఉద్యోగులకు బకాయిలు 21,980కోట్లు..
- నాన్ కంట్రిబ్యూషన్ టు సింకింగ్ ఫండ్ 1,191కోట్లు..
- మొత్తం... 9.74 లక్షల కోట్లు

...ఇప్పటి వరకూ ఇది మాత్రమే తేలిందని ఇంకా తవ్వితే ఎంత వస్తుందో తెలీదని చంద్రబాబు అన్నారు. "ఎవరైనా దివాలా తీసినప్పుడు మాకూ అప్పు రావాల్సి ఉందని చాలా మంది వస్తుంటారు.. అలాంటివి ఇప్పటికి లేవు గనుక గుమ్మనంగా ఏమి చేయాలో ఆలోచిస్తున్నాం.. ఈ అప్పులు నిజంకాదని ఎవరైనా అంటే... రండి లెక్కలు చూపిస్తా.. ఆ తర్వాత గుంజీలు తీయిస్తా. ప్రజా జీవితంలో చిల్లర చేష్టలు మానండి. మీరు దాచిన చీకటి జీవోలన్నీ ఆన్‌లైన్‌లో ప్రజల ముందు పెట్టా.." అని చంద్రబాబు హెచ్చరించారు.

దోపిడీ కోసమే రాజకీయాల్లోకి...

"రాజకీయాల్లో అవినీతిపరుల్ని చూశాం. కానీ, దోపిడీ కోసమే రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని ఇప్పుడు చూస్తున్నాం.. ఇదొక పెద్ద ప్లానింగ్.. మా పార్టీ(టీడీపీ)కి 45ఏళ్లు. కానీ పేపర్, టీవీ లేవు. కానీ, వైసీపీ పెట్టే సమయానికే ఇవన్నీ ఏర్పాటు చేసుకుని సొంత పత్రికకు 400కోట్ల ప్రజాధనాన్ని ప్రకటనల రూపంలో తీసుకున్నారు.. వలంటీర్లకు కూడా వారి పేపర్ ఇప్పించి ఎంత అధికార దుర్వినియోగం చేయవచ్చో అంతా చేశారు.."

"మా ఊరికి దగ్గర్లోనే కొండ ఉంది. అందులో నుంచి పొలాల్లోకి అడవి పందులు వచ్చి రైతుల కష్టాన్ని మేసేసేవి. పదిశాతం పంట తినేసి, 90శాతం ధ్వంసం చేసి వెళ్లి పోయేవి.. రాష్ట్రంలోనూ ఐదేళ్లపాటు ఇదే జరిగింది. తినాల్సినంత తినేసి వ్యవస్థలను ధ్వంసం చేశారు.. అడవి పందులు పంట మేస్తే ఆ రైతు భూమి పాడవ్వదు. మళ్లీ ఇంకో పంట వేసుకోవచ్చు. కానీ రాష్ట్రంలో సంపద సృష్టించే మార్గాలు కూడా లేకుండా చేశారు. ఇంత దారుణాన్ని చూస్తానని అనుకోలేదు" - సీఎం చంద్రబాబు



కన్నతల్లి శీలాన్ని శంకించేవాళ్లు మనుషులేనా?

"డిజిటల్ కార్పొరేషన్ నుంచి డబ్బులు చెల్లించి సోషల్ మీడియాలో సైకోలను తయారు చేశారు. చివరికి కన్నతల్లి శీలాన్ని శంకిస్తూ పోస్టులు పెట్టారంటే వీళ్లని మనుషులు అనాలా.. లేక జంతువులా? తల్లి వ్యక్తిత్వాన్ని హననం చేసిన ఇలాంటి నీచులు రాష్ట్రంలో ఉండటానికి కూడా అర్హత లేదు. ఎన్డీయేలో ఏ నాయకుడూ ఇటువంటి పోస్టులు పెట్టరు. ఎవరైనా పెడితే వాళ్లకు ఇచ్చే ట్రీట్మెంట్ ఇస్తా.. రాష్ట్రంలో ప్రతి ఆడబిడ్డా గౌరవంగా బతికేలా చట్టానికి పదును పెడతాం.. రాజకీయ ముసుగులో నేరస్థులు ఘోరాలు చేస్తే వారిని నేరస్థుల్లానే చూస్తాం. పెద్ద మనుషులుగా ఎప్పటికీ గుర్తించబోం. రాష్ట్రంలో వైసీపీ పాలన ముగిసేనాటికి రాష్ట్రంలో 84 లక్షల టన్నుల మెట్రిక్ చెత్త పేరుకుపోయింది. అదంతా తొలగించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనే ఉంది. చెత్తపై పన్ను వేసిన వ్యక్తి పాపాలు మనం మోయాల్సి వస్తోంది" అని అసెంబ్లీలో చంద్రబాబు వ్యాఖ్యానించారు.

ఐదేళ్లు.. పది విధ్వంసాలు..

జగన్ పాలనలో ధ్వంసమైనవాటిలో పది చెబుతానంటూ సీఎం వాటి వివరాలు తెలిపారు.

- 1) రాజధాని అమరావతిని ఉద్దేశ పూర్వకంగా ధ్వంసం చేశారు.
- 2) ప్రభుత్వ టెర్రరిజంతో పరిశ్రమల్ని తరిమేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గండి కొట్టారు.
- 3) ఇసుక దోపిడీ చేసి భవన నిర్మాణాల కార్మికుల పొట్ట కొట్టారు.
- 4) విద్యుత్ రంగాన్ని ఒక వ్యక్తి దోపిడీ కోసం 1.29లక్షల కోట్ల నష్టాల్లోకి తోసేశారు.
- 5) మద్యం ఉత్పత్తి, సరఫరా, నగదు విక్రయాలతో భారీ దోపిడీలు చేసి.. సైకో బ్రాండ్లతో ప్రజల్ని దోచేసి తాడేపల్లి ప్యాలెస్‌కు సొమ్ము తరలించరు.
- 6)పన్నుల బాదుడులో చెత్తను కూడా వదలకుండా ప్రజల్ని వేధింపులకు గురి చేశారు.
- 7) ప్రజాస్వామ్యం సిగ్గుపడేలా పోలీసు వ్యవస్థను భ్రష్టుపట్టించి.. మాస్క్ అడిగిన దళిత వైద్యుడు సుధాకర్‌ను పిచ్చోడిని చేసి ఆయన చావుకు కారణం అయ్యారు.
- 8) రాష్ట్రంలో రోడ్లన్నీ గుంతలు, రాళ్లపై ఫొటోలకు వందల కోట్లు...కుటుంబం కోసం ప్రభుత్వసొమ్ముతో రుషికొండపై భారీ ప్యాలెస్
- 9) ఇంగ్లీష్ ప్రయోగంతో విద్యావ్యవస్థ ధ్వంసం..
- 10) తలసరి, రాష్ట్ర ఆదాయంతోపాటు పారిశ్రామిక ప్రగతి పతనం... దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని అట్టడుగుకు తెచ్చారు.

అమరావతికి సహకరించండి

» రాజధాని నిర్మాణంలో సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించండి!

» గోదావరి-పెన్నా అనుసంధానానికి సహకరించండి

» కేంద్ర మంత్రులకు చంద్రబాబు వినతులు

» నిర్మలా సీతారామన్, జైశంకర్‌లతో సీఎం భేటీ

న్యూఢిల్లీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణంలో సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు. అదేవిధంగా గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి కూడా సహకరించాలని విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. కేంద్రమంత్రులతో సీఎం చంద్రబాబు జరిపిన చర్చల వివరాలను టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు మీడియాకు వెల్లడించారు.

పునర్నిర్మాణానికి సహకరించండి

ఇటీవల సంభవించిన వరదల్లో విజయవాడ సహా పలు ప్రాంతాలకు భారీ ఎత్తున జరిగిన నష్టాన్ని పూరించేందుకు, దెబ్బతిన్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర జీఎస్టీపై ఒక శాతం సర్‌చార్జీని పెంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. విపత్తుల నుంచి బయటపడేందుకు జీఎస్టీలో ఉన్న నిబంధనల మేరకు ఈ సర్‌చార్జీని పెంచితే వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో పునర్నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. అదేవిధంగా పోలవరం నుంచి గోదావరి నదీ జలాలను పెన్నాకు అనుసంధానం చేసేందుకు సహకరించాలని కోరారు. మధ్యప్రదేశ్‌లో కెన్-బెట్వా మాదిరి గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి తోడ్పడితే ఏపీలో కూడా కొన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. అదేవిధంగా వెనుకబడిన జిల్లాలైన ప్రకాశం, రాయలసీమ ప్రాంతాలకు తాగు నీరు అందుతుందని చెప్పారు. రూ.60 వేల కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు కేంద్రం సహకరిస్తే త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను త్వరలోనే రూపొందిస్తామని చంద్రబాబు చెప్పారు.

అమరావతికి సింగపూర్ తోడ్పాటు

అమరావతి నిర్మాణంలో సింగపూర్ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌ను సీఎం చంద్రబాబు కోరారు. అమరావతి నిర్మాణ పనులకు తోడ్పడేందుకు గతంలో ముందుకు వచ్చిన సింగపూర్ మళ్లీ ఈ పనుల్లో తోడ్పాటును అందించేలా కేంద్రం సహకరించాలని విన్నవించారు. అలాగే, అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికైన నేపథ్యంలో వేలాది మంది తెలుగు విద్యార్థులు విద్య, ఉద్యోగాల పరంగా ఎదుర్కొనే సమస్యలు, ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాల గురించి చర్చించారు. ఇక, అమెరికాతో పాటు వివిధ దేశాల నుంచి ఏపీకి పెట్టుబడులు తరలి వచ్చేలా సహకరించాలని కోరారు. జైశంకర్ మాట్లాడుతూ.. కేంద్రం...ఏపీకి అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక దేశాలు సిద్ధంగా ఉన్నాయని, చంద్రబాబు నాయకత్వం పట్ల అనేకమందికి విశ్వాసం ఉందని చెప్పారు.

నేడు ముంబైకి బాబు: 'హిందుస్థాన్ టైమ్స్' ప్రారంభించి వందేళ్లయిన సందర్భంగా శనివారం జరిగే వేడుకలలో చంద్రబాబు పాల్గొననున్నారు. అనంతరం ఆయన మహారాష్ట్ర రాజధాని ముంబైకి వెళ్లనున్నారు. ఈ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీయే అభ్యర్థుల తరఫున ఆయన శనివారం, ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.



జై శంకర్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

చంద్రబాబును కలవడం సంతోషంగా ఉంది: జైశంకర్

ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీ కావడంపై విదేశాంగ మంత్రి జైశంకర్ సంతోషం వ్యక్తం చేశారు. చంద్రబాబుతో భేటీ అనంతరం ఎక్స్ వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ నూతన అభివృద్ధి లక్ష్యాలు, ఆకాంక్షలను చేరుకోవడానికి విదేశాంగ శాఖ తరఫున నిరంతరం సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చినట్లు జై శంకర్ పేర్కొన్నారు.

వర్రాను కస్టడీకి ఇవ్వండి

» కడప కోర్టులో పులివెందుల పోలీసుల పిటిషన్

కడప/పత్తికొండ/ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో వర్రా రవీంద్రారెడ్డిని విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని పులివెందుల పోలీసులు కడప కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్రాపై నమోదవుతున్న కేసులన్నింటినీ పులివెందుల స్టేషన్‌కు బదిలీ చేస్తున్నారు. ఈ వ్యవహారం నిగ్గు తేల్చేందుకు వర్రాను పది రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ పిటిషన్ వేశారు. దీనిపై విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, వర్రా రవీంద్రారెడ్డిని ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు శుక్రవారం పత్తికొండ కోర్టులో హాజరు పరిచారు. సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనితతో పాటు వైఎస్ విజయలక్ష్మి, వైఎస్ షర్మిలపై వర్రా అసభ్యకర రీతిలో వ్యాఖ్యలు చేస్తూ పోస్టింగులు చేశారు. టీడీపీ నాయకులు, మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. దీంతో రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 8న ఎమ్మిగనూరు మండలం బోడబండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త హరికృష్ణ ఫిర్యాదు చేశారు. దీంతో వర్రాపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు... కడప సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న రవీంద్రారెడ్డిని పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మిగనూరు కోర్టు న్యాయాధికారి సెలవులో ఉండటంతో పత్తికొండ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కడప సెంట్రల్ జైల్‌కు తరలించారు. కాగా, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి ముందస్తు బెయిలు కోసం కడప కోర్టులో బెయిలు పిటిషన్ దాఖలు చేశారు.

కడప ఎస్పీని కలిసిన సునీత: వివేకా కుమార్తె డాక్టర్ సునీత జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్ నాయుడును శుక్రవారం కలిశారు. కడపలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లిన ఆమె తన తండ్రి హత్య కేసుపై చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే వర్రా చేసిన అసభ్య పోస్టులపై ఇప్పటికే ఆమె హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాలన్నీ ఎస్పీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. కాగా, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను అసభ్య పదజాలంతో దూషించిన సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై టీడీపీ నేతలు కడప రిమ్స్ పోలీసులకు, టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదులు చేశారు. పోసానిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

అసభ్య పోస్టు కేసులో దంపతులకు రిమాండ్

» 2 రోజులు కస్టడీ కోరుతూ పోలీసుల పిటిషన్

నరసరావుపేట లీగల్/కడప, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్య పోస్టుల కేసులో నిందితులైన పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, ఆయన భార్య సుధారాణికి ఈ నెల 28 వరకు రిమాండ్ విధిస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నరసరావుపేటకి చెందిన పగడాల రమేష్ ఫిర్యాదుతో వీరిపై కేసు నమోదైంది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో నమోదైన ఓ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వీరిని పీటీ వారెంట్‌పై తీసుకు వచ్చి న్యాయాధికారి ఎదుటహాజరు పరిచగా, రిమాండ్‌కు ఆదేశించారు. కాగా రెండు రోజుల పాటు వీరిని కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.



వైభవంగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ

అన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి గిరిప్రదక్షిణ శుక్రవారం వైభవంగా జరిగింది. సత్య రథం వెంబడి లక్షా50వేలమంది భక్తులు పాల్గొన్నట్టు అంచనా. ఉదయం పల్లకిలో సత్యదేవుడిని 9.2 కిలోమీటర్లు రత్నగిరి, సత్యగిరి కొండల చుట్టూ ప్రదక్షిణ గావించారు. మధ్యాహ్నం సత్యరథంతో గిరియాత్ర చేపట్టగా అశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రత్న, సత్యగిరి సత్యదేవ నామస్మరణతో మార్మోగాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రామచంద్ర మోహన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గిరిప్రదక్షిణ అనంతరం భక్తులు పవిత్ర పంపానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి పంపాహారతులు కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. అర్చకస్వాములు పంపానదికి ఏడురకాలైన హారతులిచ్చారు.

ఏపీ అభివృద్ధికి ఐఐటీ-ఎం బాసట



లోకేశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో అధికారులు, ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ శాఖలతో ఎనిమిది ఒప్పందాలు చేసుకుంది. ఇందులో భాగంగా సీఎం చంద్రబాబును అసెంబ్లీలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మద్రాస్ ఐఐటీ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అంతకు ముందు మంత్రి నారా లోకేశ్ తదితరుల సమక్షంలో ఒప్పందాలు జరిగాయి. వీటిల్లో ప్రధానంగా అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి సాంకేతిక సలహాలు అందించడం, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో నాణ్యత పెంచే కార్యక్రమాలు చేపట్టడం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం, విశాఖను ఇంటర్నెట్ గేట్‌వేగా అభివృద్ధి చేయడం తదితర ఒప్పందాలు ఉన్నాయి. ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేయడానికి తాము ఉత్సాహంగా ఉన్నామని మద్రాస్ ఐఐటీ బృందం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, ఎం.రామప్రసాదరెడ్డి, బీసీ జనార్దనరెడ్డి, సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ఉన్నతాధికారులు కృతికా శుక్లా, విజయ రామరాజు, యువరాజ్, కన్నబాబు, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, సీఈవో ఎంజె శంకరనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ-ఎంతో వివిధ శాఖల ఒప్పందాల వివరాలు

ఏపీసీఆర్‌డీఏతో..

ప్రపంచ వర్సిటీల భాగస్వామ్యంతో అమరావతిలో అంతర్జాతీయ డీప్ టెక్ ఇన్నోవేషన్ సాధ్యమయ్యేలా చేయడం, ఇంక్యుబేషన్ పార్కు ఏర్పాటులో సాంకేతిక సహకారం కోసం ఈ ఒప్పందం కుదిరింది. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు భౌతికంగా, వర్చువల్ పద్ధతుల్లో ప్రభుత్వంతో కలసి పని చేస్తుంది.

ఏపీ మారిటైమ్ బోర్డుతో..

సముద్ర పరిశోధన, సమాచారం, తీర ప్రాంతంలో ఇంధన ఉత్పత్తి టెక్నాలజీల్లో సహకారం కోసం ఒప్పందం జరిగింది. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి పరిశోధనతో పాటు కన్సల్టెన్సీ, విద్య, శిక్షణ ప్రయోజనాలు సాధించడం కోసం ఈ ఒప్పందం జరిగింది.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్‌తో..

స్వయం ప్లస్, ఐఐటీఎం ప్రవర్తక్ డిజిటల్ స్కిల్ అకాడమీ వంటి ప్లాట్ ఫాంల ద్వారా స్కేల్ స్కిల్లింగ్ కార్యక్రమాల్లో నాణ్యత పెంచేలా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

ఏపీ విద్యాశాఖతో..

పారిశ్రామికావసరాలకు అనుగుణంగా అధునాతన సాంకేతిక శిక్షణను ఇచ్చేలా ఐఐటీఎం, విద్యాశాఖల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ప్రవర్తక్ విద్యా శక్తి ద్వారా రాష్ట్రంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల, ఇంటర్మీడియెట్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఐఐటీఎం సాంకేతిక శిక్షణను ఇస్తుంది. అవసరమైన మార్గదర్శక కార్యక్రమాలు ప్రారంభిస్తుంది.

ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

విమానాశ్రయాలను లాజిస్టిక్స్/మెయింటెనెన్స్ హబ్‌లుగా మార్చే లక్ష్యంతో ఈ అవగాహనా ఒప్పందం జరిగింది. ముఖ్యంగా కుప్పం, పుట్టపర్తి విమానాశ్రయాలపై దృష్టి సారించడం.. ఆయా ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలు గుర్తించి అభివృద్ధి చేయడం ఈ ఒప్పందం ఉద్దేశం.

ఐటీ శాఖతో..

అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతికతను ఉపయోగించి విశాఖ మహానగరాన్ని ఇంటర్నెట్ గేట్‌వేగా అభివృద్ధి చేయడం, తద్వారా రాష్ట్రంలో అంతర్జాతీయ డేటా కనెక్టివిటీని మెరుగుపరచడం ఈ ఒప్పందం ఉద్దేశం.

ఆర్టీజీఎస్‌తో..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ రంగాల్లో సాఫ్ట్‌వేర్, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందు కోసం ఐఐటీఎం ప్రవర్తక్ ఏపీఆర్టీజీఎస్‌తో కలసి పనిచేస్తుంది.

క్రీడల శాఖతో..

రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో స్మార్ట్ టెక్ ఎనేబుల్డ్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ఐఐటీఎం ద్వారా సాంకేతిక సలహాలు పొందేందుకు ఈ ఒప్పందాన్ని ప్రభుత్వం కుదర్చుకుంది.

ప్రాథమిక స్కూళ్లలోనే 3, 4, 5 తరగతులు!

- 130 మంది విద్యార్థులు దాటిన స్కూల్‌కు హెచ్‌ఎం
- వచ్చే ఏడాదే టీచర్ల బదిలీలు

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం తీసుకున్న 'పాఠశాలల విలీనం' నిర్ణయంతో దెబ్బతిన్న ప్రాథమిక పాఠశాలలను పూర్వస్థితికి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలకు తరలించడంతో రాష్ట్ర వ్యాప్తంగా 4,731 ప్రాథమిక పాఠశాలలు దెబ్బతిన్నాయి. వాటిని తిరిగి తీసుకురావాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్పటి నుంచి కోరుతున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు నిర్వహించిన చర్చల్లో ఆయా అంశాలపై స్పష్టతనిచ్చారు. విలీనంతో తరలిపోయిన తరగతులను తిరిగి వెనక్కి తీసుకొస్తారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించనున్నారు. వెనక్కి తీసుకొచ్చే తరగతులను మోడల్ పాఠశాలల్లో కలిపే అవకాశం ఉంది. ఆ ప్రాంతంలో మోడల్ ప్రాథమిక పాఠశాల లేకపోతే అంతకముందున్న ప్రాథమిక పాఠశాలలోనే కలుపుతారు. 130 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టు ఇవ్వాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది మేలోనే టీచర్ల బదిలీలు చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. బదిలీలపై త్వరలో చట్టం అమల్లోకి రానుంది. ఆ చట్టం ప్రకారం బదిలీల ప్రక్రియను కచ్చితంగా మే నెలలోనే చేపట్టనున్నారు.



రాజధానిలో భూ కేటాయింపులపై జరిగిన సమావేశంలో మంత్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, పయ్యావుల కేశవ్, దుర్గేశ్

అమరావతికి వస్తామంటున్నారు

- గత ప్రభుత్వంలో నిర్మాణాలకు వెనుకంజ
- కూటమి ప్రభుత్వం వచ్చాక నమ్మకం వచ్చింది
- సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం భేటీ

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రాజధాని అమరావతిలో నిర్మాణాలకు వెనుకంజ వేసిన సంస్థలు ఇప్పుడు మళ్లీ ముందుకు వస్తున్నాయని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు పయ్యావుల కేశవ్, నారాయణ, కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, టీజీ భరత్‌తో పాటు అధికారులు సమావేశమయ్యారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి వారికి నమ్మకం వచ్చిందని, అమరావతికి వస్తామని, నిర్మాణాలు ప్రారంభిస్తామని ముందుకొచ్చారని తెలిపారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రతి పది రోజులకు ఒకసారి సబ్ కమిటీ సమావేశమవుతుందని తెలిపారు.

నాపై కేసులు పెట్టినవారికి మంచి పోస్టింగ్‌లు

- మా వాళ్లే అధికారులకు ఇప్పిస్తున్నారు: చింతమనేని

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో తనపై వైసీపీ ప్రభుత్వం 27 కేసులు పెట్టిందని, తనపై అక్రమ కేసులు పెట్టిన అధికారులంతా ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో ముచ్చటించారు. తనను వేధించిన అధికారులే కావాలంటూ తమ వాళ్లే మంచి పోస్టింగ్‌లు ఇప్పించుకుంటున్నారని చింతమనేని చెప్పారు. పుట్టపర్తిలో తనపైనా కేసులు పెట్టారని రఘునాథ్‌రెడ్డి చెప్పారు.

ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును సమగ్ర అధ్యయనం చేసిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వంఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 60 రోజుల్లోపు నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది.

అవే అబద్ధాలు!

(మొదటి పేజీ తరువాయి)

పైగానే ఉన్నాయి. 2023-24 మార్చి నాటికి పబ్లిక్ డెట్ దాదాపు రూ.5 లక్షల కోట్లు ఉంది. కార్పొరేషన్లకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి తెచ్చుకుని వాడేసుకున్న అప్పు రూ.2.47 లక్షల కోట్లు! నాన్ గ్యారెంటీ అప్పులు రూ.1.06 లక్షల కోట్లు! కార్పొరేషన్ అప్పులూ ప్రభుత్వానివే అని 'కాగ్' కూడా స్పష్టం చేసింది. వీటితో పాటు జగన్ గుట్టలుగా పేర్చిన పెండింగ్ బిల్లులు రూ.1.75 లక్షల కోట్లకు పైమాటే! ఇవన్నీ కలిపితే జగన్ దిగిపోయేనాటికి రాష్ట్ర రుణభారం రూ.10 లక్షల కోట్లు దాటుతుంది.

తప్పుడు లెక్కలు...

కూటమి ప్రభుత్వం ఏటా రూ.74,000 కోట్ల అప్పు తీసుకోనుందని... తాను మాత్రం 47వేల కోట్లే తెచ్చానని జగన్ పేర్కొన్నారు. నిజానికి జగన్ హయాంలో ఏడాదికి సగటున రూ.60వేల కోట్ల వరకు అప్పులు తెచ్చారు. ఇవన్నీ కేంద్రం ఎఫ్‌ఆర్‌బీఎం ప్రకారం అనుమతిచ్చిన అప్పులే. ఈ అప్పులో అంతకుముందు చేసిన రుణాలకు సంబంధించిన అసలు వాటా కూడా చెల్లించాలి. జగన్ హయాంలో ఈ మొత్తం రూ.15,000 కోట్ల నుంచి రూ.18,000 కోట్ల వరకు ఉంది. అంటే... అప్పు తీర్చడం కోసం మళ్లీ అప్పు చేయడమన్న మాట! కానీ... దీనిని తాను చేసిన అప్పులో చూపించకుండా తాను తెచ్చింది రూ.47వేల కోట్లే అని బుకాయిస్తున్నారు. ఇదే సూత్రాన్ని కూటమి ప్రభుత్వానికి కూడా వర్తింప చేస్తే... ఈ ఆర్థిక సంవత్సరంలో చేసే అప్పు రూ.49,500 కోట్లే. జగన్ హయాంలో కార్పొరేషన్ల ద్వారా విచ్చలవిడిగా ఆఫ్ బడ్జెట్ అప్పులు తెచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు కార్పొరేషన్లను అడ్డం పెట్టుకుని అడ్డగోలు అప్పులు తీసుకురాలేదు.

కేపిటల్ వ్యయంపై కథలు...

2019-24 మధ్యలో తాము 15,632 కోట్ల మూలధన వ్యయం చేసి, ఆస్తులు సృష్టించామని జగన్ గొప్పగా చెప్పుకొన్నారు. తన గురించి తాను అబద్ధం చెప్పుకోరు కాబట్టి అది నిజమే అనుకుందాం. కానీ... 2014-19 మధ్య మూలధన వ్యయం కేవలం 13,860 కోట్లు అని రోత పత్రికలో ప్రచురించారు. ఇది మరో పచ్చి అబద్ధం. 2018-19 ఒక్క ఏడాదిలోనే మూలధన వ్యయం రూ.20,400 కోట్లు అని 'కాగ్' ధ్రువీకరించింది. 2014-19 మధ్య ఐదేళ్లలో మొత్తం కేపిటల్ ఎక్స్‌పెండిచర్ సుమారు లక్ష కోట్ల రూపాయలు. ఇవి... 'కాగ్' అధికారికంగా చెప్పిన లెక్కలు.

కొలువులపై కాకిలెక్కలు

'ఎవరి ప్రోగ్రెస్ ఏమిటి' అంటూ జగన్ మరో జిమ్మిక్కు చేశారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాలు 'ఖాళీ'గా చూపించి... తాను మాత్రం 6.31 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసినట్లుగా చెప్పారు. 'వామ్మో ఇదేం లెక్క... ఇన్ని ఉద్యోగాలు ఎప్పుడు ఇచ్చారనుకుంటున్నారా? అదే జగన్మాయ! 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, అవన్నీ భర్తీ చేస్తామని జగన్ 2019 ఎన్నికల ముందు ఊదరగొట్టారు. కానీ... ఏపీపీఎస్సీ ద్వారా ఐదేళ్లలో ఆయన ఇచ్చిన రెగ్యులర్ ఉద్యోగాలు కేవలం ఐదువేలు. ఇక... 23వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి... ఒక్క డీఎస్సీ కూడా వేయలేదు. ఇటీవలి ఎన్నికల ముందు 6వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చారు కానీ, నియామకాలు జరగలేదు. కొత్తగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి... 1.34 లక్షల మందిని నియమించారు. ఇక... 2.6 లక్షల మంది వలంటీర్లనూ 'ఉద్యోగుల' ఖాతాలోనే వేసేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేసి... ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న 58వేల మంది కార్మికులకు తామే 'ఉద్యోగాలు' ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకొన్నారు. ఇంతటితో ఆగలేదు! ప్రభుత్వ మద్యం షాపుల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లుగా ఉన్న 15వేల మందినీ ఉద్యోగులుగానే చూపించారు. ఇలా రకరకాల మాయలు చేసి తాము 6.31 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పుకోవడం జగన్‌కే చెల్లింది. 2.31 లక్షల రెగ్యులర్ ఖాళీల్లో ఎన్ని భర్తీ చేశారు? ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చారా? 23వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ఆయన... ఒక్క డీఎస్సీ అయినా ఇచ్చారా? వీటికి జగనే సమాధానం చెప్పాలి. ఇక... టీడీపీ హయాంలో భర్తీ చేసిన ఉద్యోగాలు 'ఖాళీ' అని చెప్పడం గమనార్హం. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే 12,803 పోస్టులతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేసింది. 2018లో 7729 పోస్టులతో మరో డీఎస్సీ ప్రకటించింది. నియామక ప్రక్రియ అప్పుడే మొదలుకాగా... ఎన్నికల తర్వాత వైసీపీ హయాంలో ముగిసింది.

డిస్కమ్‌లను ఉద్ధరించారట..

2014-19 మధ్య చంద్రబాబు హయాంలో డిస్కమ్‌ల నష్టాలు రూ.22వేల కోట్లకు పెరిగాయని, తన హయాంలో రూ.395 కోట్లు మాత్రమే నష్టపోయాయని జగన్ ఓ వింత లెక్క చెప్పారు. నిజానికి... 2019లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి డిస్కమ్‌ల అప్పులు రూ.62,800 కోట్లు. జగన్ గద్దెనెక్కాక ఐదేళ్లలో ఆ మొత్తం 1.12 లక్షల కోట్లకు చేరుకుంది. ఇక... తాము డిస్కమ్‌లకు 47,800 కోట్లు సహాయం చేయగా, చంద్రబాబు ప్రభుత్వం రూ.13,255 కోట్లే చేసిందని జగన్ మరో లెక్క చెప్పారు. వైసీపీ సర్కారు డిస్కమ్‌లకు ఏ సహాయమూ చేయలేదు. పైగా భారీగా బకాయిలు పెట్టింది. దీంతోపాటు ట్రూఅప్ చార్జీల పేరుతో జనానికి వరుస షాకులు ఇచ్చింది. ఈ పాపం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది.





Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.